www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఉప ఎన్నికల్లో ఇండియా హవా

- 13 అసెంబ్లీ సీట్లకు 10 కైవసం.. బీజేపీకి రెండే
- పశ్చిమ బెంగాల్‌లో నాలుగూ తృణమూల్‌కే
- హిమాచల్, ఉత్తరాఖండ్‌ల్లో కాంగ్రెస్ విజయం
- బిహార్‌లో జేడీయూపై ఇండిపెండెంట్ గెలుపు
- మారుతున్న రాజకీయానికి సంకేతం: జైరాం

9

ఆదివారం | 14-7-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 89 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి సా. 5.26 తదుపరి నవమి; నక్షత్రం: చిత్త రా. 10.06 తదుపరి స్వాతి; వర్జ్యం: శేషం ఉ. 5.59, తె. 4.15 మొదలు; దుర్ముహూర్తం: సా. 5.05-5.57; అమృతఘడియలు: మ. 2.56-4.43; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అరాచక ఐపీఎస్‌లకు షాక్!

9 మందిని పక్కన పెట్టిన ప్రభుత్వం

సమర్థత, నిష్పాక్షికతకు పెద్దపీట.. యువ అధికారులకు కీలక జిల్లాలు

- 23 జిల్లాల్లో కొత్త ఎస్పీలకు పోస్టింగ్
- తిరుపతి ఎస్పీగా సుబ్బరాయుడు
- గతంలో బాబుకు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా వ్యవహరించిన రాయుడు
- తెలంగాణ నుంచి డిప్యుటేషన్‌పై రాక
- బిందు మాధవ్‌కు కర్నూలు బాధ్యత
- జగన్ హయాంలో వివక్షకు గురైన దామోదర్‌కు ప్రకాశం ఎస్పీగా చాన్స్
- రాష్ట్ర వ్యాప్తంగా 37 మంది ఐపీఎస్‌లకు స్థాన చలనం.. సర్కారు ఉత్తర్వులు
- వైసీపీతో అంటకాగినోళ్లు వెయిటింగ్‌కు
- డీజీపీకి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు


జీఆర్ రాధిక : శ్రీకాకుళం నుంచి వెయిటింగ్‌కు


మేరీ ప్రశాంతి : ఏలూరు నుంచి వెయిటింగ్‌కు


బిందు మాధవ్ : వెయిటింగ్ నుంచి కర్నూలుకు


సుబ్బరాయుడు: తెలంగాణ నుంచి తిరుపతి ఎస్పీగా

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో తాడేపల్లి ఆదేశాలను తూ.చ. తప్పకుండా పాటించి అరాచకాలు సృష్టించిన పలువురు ఐపీఎస్ అధికారులను పక్కన పెడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇదేసమయంలో సమర్థులైన ఐపీఎస్‌లకు పలు కీలక జిల్లాల సారథ్యాన్ని అప్పగించింది. ఈ మేరకు శనివారం భారీ ఎత్తున ఐపీఎస్‌ల బదిలీలు చేపట్టింది. జిల్లా ఎస్పీలను గత ప్రభుత్వం పావులుగా వాడుకుంది. ప్రతిపక్షాలపై వారిని ఉసిగొల్పి అడ్డమైన కేసులు పెట్టి వేధించింది. ప్రభుత్వం మారగానే వీరందరి వ్యవహార శైలిపై సుదీర్ఘ కసరత్తు చేసిన దరిమిలా.. 37 మంది ఎస్పీ స్థాయి ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. అప్పట్లో సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ ఏం చెబితే అది గుడ్డిగా చేస్తూ, విపక్షాలను వేధించిన శ్రీకాకుళం ఎస్పీ రాధికకు పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయించారు. ఈమె శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా ఉంటూ వైసీపీ నేతలకు వత్తాసు

మిగతా 12వ పేజీలో...

శేషాచలంలో 'పెద్ద పుష్ప'

వందల కోట్ల ఎర్రచందనం విదేశాలకు
జగన్ ఏలుబడిలో సినీ ఫక్కీలో దోపిడీ

9

- స్మగ్లింగ్ సులువుగా జరిగేలా మాస్టర్ ప్లాన్.. ఉద్దేశపూర్వకంగా భద్రతా వ్యవస్థ నిర్వీర్యం
- ఐదేళ్లలో స్మగ్లర్లు దోచుకున్నది 8 వేల టన్నులు.. సర్కారు అమ్మినదానికంటే ఇదే ఎక్కువ
- పరిరక్షణలో జగన్ సర్కారు విఫలం.. విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● ఆదివారం 14 జూలై 2024



నాలుగా.. ఒక్కటా..!

ఇంగ్లండ్‌తో స్పెయిన్ ఢీ
'యూరో' ఫైనల్ నేడే

రాత్రి 12.30 నుంచి సోనీలో..

బెర్లిన్: జైత్రయాత్ర కొనసాగిస్తున్న స్పెయిన్ రికార్డుస్థాయిలో నాలుగోసారి యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ నెగ్గాలనే పట్టుదలతో ఉండగా.. గత టోర్నీలో తుది మెట్టుపై తడబడిన ఇంగ్లండ్ తొలిసారి విజేతగా నిలవాలనే కసితో ఉంది. ఆదివారం రాత్రి జరిగే టైటిల్ ఫైట్‌లో జోరుమీదున్న స్పెయిన్‌తో ఇంగ్లండ్ అమీతుమీ తేల్చుకోనుంది. సెమీస్‌లో బలమైన ఫ్రాన్స్‌ను ఓడించిన స్పెయిన్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. కెప్టెన్ మొరాటా పూర్తి ఫిట్‌నెస్‌తో కనిపిస్తుండగా.. చిచ్చరపిడుగు యమల్‌పైనే అందరి దృష్టీ నెలకొనే అవకాశం ఉంది. ఓమ్లో కూడా ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు ఇంగ్లండ్ అద్భుత పోరాటపటిమను ప్రదర్శిస్తోంది. నాకౌట్ మ్యాచ్‌ల్లో వెనుకబడినా అద్భుతంగా పుంజుకొని విజయాలు అదుకొంటోంది. నెదర్లాండ్స్‌తో ఫైనల్ ఫోర్ మ్యాచ్‌లోనూ వెనుకంజలో నిలిచినా.. వాట్కిన్స్ లేటు గోల్‌తో జట్టును గెలిపించాడు. కెప్టెన్ హ్యారీ కేన్, బెలింగమ్, సాకా జట్టుకు కీలకం కానున్నారు.



మెస్సీ సేనకు ఎదురుందా?

కొలంబియాతో అర్జెంటీనా టైటిల్‌ఫైట్
కోపా అమెరికా కప్

సోమవారం ఉదయం 5.30 నుంచి

మయామి (యూఎస్): డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా రికార్డుస్థాయిలో 16వసారి కోపా అమెరికా కప్‌ను సొంతం చేసుకోవాలనుకొంటోంది. సోమవారం తెల్లవారుజామున జరిగే ఫైనల్లో కొలంబియాతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈపాటికే 15సార్లు కోపా టైటిల్ నెగ్గిన అర్జెంటీనా.. ఉరుగ్వేతో సమంగా నిలిచింది. మరోసారి విజేతగా నిలిస్తే మెస్సీ సేన సరికొత్త చరిత్రను సృష్టించనుంది. కాగా, 28 మ్యాచ్‌ల్లో ఓటమనేదే లేని కొలంబియా అదే జోరును కొనసాగించాలనుకొంటోంది. సెమీస్‌లో పటిష్ఠ ఉరుగ్వేకు ఝలకిచ్చిన కొలంబియా.. సంచలనం సృష్టించాలనే పట్టుదలతో ఉంది. 23 ఏళ్ల తర్వాత మళ్లీ టైటిల్‌ను ముద్దాడాలనుకొంటోంది.

అవసరమైతే నా పెన్షన్ ఇస్తా

గైక్వాడ్‌ను బీసీసీఐ ఆదుకోవాలన్న కపిల్

న్యూఢిల్లీ: బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతూ లండన్‌లోని ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న టీమిండియా మాజీ క్రికెటర్ అన్షుమన్ గైక్వాడ్‌ను ఆర్థికంగా ఆదుకోవాలని బీసీసీఐని మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ కోరాడు. దేశం కోసం ఆడిన గైక్వాడ్‌కు ఇప్పుడు అందరం అండగా నిలవాలని కోరాడు. అవసరమైతే బోర్డు నుంచి తనకు లభించే పెన్షన్‌ను కూడా అతనికి ఇస్తా అని కపిల్ అన్నాడు. గైక్వాడ్ చికిత్స కోసం నిధులు సేకరించేందుకు మాజీ ఆటగాళ్లంతా కలిసి ప్రయత్నిస్తున్నామన్నాడు.



(సా. 6.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో)

బిగ్‌ఫైట్

అల్కారజ్ x జొకోవిచ్
పురుషుల ఫైనల్ నేడే

గత ఏడాది ఫైనలిస్టులు రెండో సీడ్ నొవాక్ జొకోవిచ్, మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్ ఆదివారం జరిగే వింబుల్డన్ పురుషుల సింగిల్స్ టైటిల్ ఫైట్‌లో అమీతుమీ తేల్చుకోనున్నారు. నిరుడు ఇక్కడ జొకో ఆధిపత్యానికి గండికొట్టి తొలి గ్రాస్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ అందుకున్న అల్కారజ్, గత ప్రదర్శనను పునరావృతం చేయాలన్న పట్టుదలతో ఉన్నాడు. మరోవైపు మోకాలి గాయానికి ఆపరేషన్ తర్వాత కూడా అమోఘమైన ఆటతీరుతో తుదిపోరుకు దూసుకొచ్చిన 37ఏళ్ల జొకో.. ఈవేదికపై ఎనిమిదో టైటిల్‌తో ఫెడరర్ రికార్డును సమం చేయాలని ఆరాటపడుతున్నాడు.

క్వీన్ క్రెజికోవా

● చెక్ భామ ఖాతాలో వింబుల్డన్
● ఫైనల్లో పాలినీపై విజయం



లండన్: తొలిసారి వింబుల్డన్ ఫైనల్ చేరిన చెక్ రిపబ్లిక్ భామ బార్బరా క్రెజికోవా అదేజోరులో టైటిల్‌ను సొంతం చేసుకొంది. శనివారం జరిగిన తుది పోరులో 31వ సీడ్ క్రెజికోవా 6-2, 2-6, 6-4తో ఏడో సీడ్, ఇటలీ తార జాస్మిన్ పాలినిని ఓడించింది. వింబుల్డన్‌కు ముందు ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన జాస్మిన్‌కు ఇక్కడా నిరాశే ఎదురైంది. కాగా, 28 ఏళ్ల క్రెజికోవాకిది కెరీర్‌లో రెండో సింగిల్స్ గ్రాండ్‌స్లామ్. 2021లో ఫ్రెంచ్ ఓపెన్ గెలిచింది. గంటా 56 నిమిషాలపాటు సాగిన ఫైనల్లో క్రెజికోవా బేస్‌లైన్ షాట్లు ఆడుతూనే తెలివిగా డ్రాప్ చేస్తూ పాయింట్లు రాబడుతుంటే.. ప్రత్యర్థి పాలినికి ఏం చేయాలో కూడా అర్థం కాలేదు. తొలిసెట్ మొదటి గేమ్‌లోనే ఇటలీ ప్లేయర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన బార్బరా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే, మూడో గేమ్‌లో సర్వీస్ నిలబెట్టుకొన్న పాలిని 1-2తో నిలిచింది. కానీ, ఆ తర్వాత వరుసగా మూడు గేమ్‌లు నెగ్గిన క్రెజికోవా 5-1తో పైచేయి సాధించింది. అదే ఊపులో సెట్‌ను సొంతం చేసుకొంది. కానీ, రెండో సెట్‌లో పుంజుకొన్న జాస్మిన్ తొలి మూడు గేమ్‌లు గెలిచి 3-0తో ముందంజ వేసింది. వరుసగా సర్వీస్‌లను నిలబెట్టుకొంటూ రెండో సెట్‌ను నెగ్గిన పాలిని.. మ్యాచ్ ఫలితాన్ని మూడో సెట్‌కు తీసుకెళ్లింది. నిర్ణాయక సెట్‌లో ఇద్దరూ సర్వీస్‌లను నిలబెట్టుకొంటూ 3-3తో హోరాహోరీగా తలపడ్డారు. అయితే, ఏడో గేమ్‌లో డబుల్ ఫాల్ట్ కారణంగా పాలిని సర్వీస్ బ్రేక్ కాగా.. తర్వాతి గేమ్ నెగ్గిన బార్బరా 5-3తో ఆధిక్యం సాధించింది. 9వ గేమ్ గెలిచిన జాస్మిన్.. తర్వాతి గేమ్‌లో సమం కోసం పోరాడినా బ్యాక్ హ్యాండ్ తప్పిదంతో మ్యాచ్‌ను చేజార్చుకొంది.

శ్రీలంక టూర్‌లో మార్పులు

ముంబై: శ్రీలంకలో పర్యటించే భారత పురుషుల క్రికెట్ జట్టు షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. ఈనెల 26 నుంచి మొదలవ్వాల్సిన ఈ టూర్ ఒకరోజు ఆలస్యంగా అంటే 27 నుంచి ప్రారంభం కానుందని బీసీసీఐ శనివారం తెలిపింది. ఈ టూర్‌లో భారత్ 3 టీ20లు, 3 వన్డేలు ఆడనుంది. ఈనెల 26న జరగాల్సిన తొలి టీ20 27న జరగనుంది. రెండో టీ20 28న, మూడోది 30న జరుగుతాయి. ఆగస్టు 1న జరగాల్సిన తొలి వన్డే 2వ తేదీకి మారింది. 4న రెండోది, 7న మూడో వన్డే జరగనుంది.

రిత్విక్‌కు రజతం



లా ప్లాగ్నే (ఫ్రాన్స్): తెలంగాణ క్రీడాకారుడు రాజా రిత్విక్ లా ప్లాగ్నే ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో రన్నరప్‌గా నిలిచాడు. శనివారం జరిగిన ఆఖరిదైన 9వ రౌండ్‌లో స్థానిక గ్రాండ్‌మాస్టర్ మౌస్సార్డ్ జూల్స్‌తో నల్ల పావులతో తలపడిన రిత్విక్ 28 ఎత్తుల అనంతరం డ్రా చేసుకున్నాడు. దీంతో జూల్స్ 7.5 పాయింట్లతో టైటిల్ విజేతగా నిలవగా.. రిత్విక్ రెండోస్థానంతో సరిపెట్టుకున్నాడు.

పాంటింగ్‌కు ఢిల్లీ వీడ్కోలు

కోచ్‌గా తొలగింపు



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్‌తో రికీ పాంటింగ్ ఏడేళ్ల బంధం ముగిసింది. తమ జట్టు ప్రధాన కోచ్ పదవి నుంచి అతడిని తొలగిస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. ప్రస్తుతం టీమ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్న సౌరవ్ గంగూలీకే కోచ్ బాధ్యతలు అప్పగించనున్నట్టు సమాచారం. 2018 నుంచి పాంటింగ్ డీసీ కోచ్‌గా వ్యవహరించాడు. అతడి శిక్షణలో జట్టు ఒక్కసారి కూడా ఫైనల్ వరకు చేరలేకపోయింది. ఇక చివరి మూడు సీజన్లలో ప్లేఆఫ్‌లోనూ అడుగుపెట్టకపోవడంతో ఢిల్లీ కోచ్ మార్పునకు సిద్ధమైంది.



ఇద్దరే బాదేశారు

జైస్వాల్, గిల్ అజేయ అర్ధసెంచరీలు
3-1తో భారత్‌దే సిరీస్
నాలుగో టీ20లోనూ జింబాబ్వే ఓటమి

హరారే: సిరీస్ నిర్ణాయక మ్యాచ్‌లో యువ భారత్ మరింత దూకుడును ప్రదర్శించింది. ప్రత్యర్థి బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యాన్ని చూపిన ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (53 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్సులతో 93 నాటౌట్), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సులతో 58 నాటౌట్) అజేయ అర్ధసెంచరీలతో చెలరేగారు. దీంతో శనివారం జరిగిన నాలుగో టీ20లో భారత్ పది వికెట్లతో గెలిచింది. 3-1తో సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. ఆఖరి మ్యాచ్ ఆదివారమే జరుగనుంది. ముందు గా జింబాబ్వే 20 ఓవర్లలో 7 వికెట్లకు 152 పరుగులు చేసింది. సికిందర్ రజా (46) టాప్ స్కోరర్. ఆరంభంలో ఓపెనర్లు మరుమని (32), మధెవెరె (25) నిలకడను ప్రదర్శించారు. మిడిలార్డర్‌లో రజా ధాటిగా ఆడాడు. కానీ మరో ఎండ్‌లో వికెట్ల పతనం కొనసాగింది. అలాగే 19వ ఓవర్‌లో రజాను అరంగేట్ర పేసర్ తుషార్ దేశ్‌పాండే అవుట్ చేయడంతో జింబాబ్వే ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. చివరి ఓవర్‌లో పేసర్ ఖలీల్ 2 వికెట్లు తీసి 5 పరుగులే ఇచ్చాడు. ఛేదనలో భారత్ 15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 156 రన్స్ చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జైస్వాల్ నిలిచాడు.

మెరుపు ఆరంభం: ఛేదనలో ఓపెనర్లు జైస్వాల్, గిల్ ఎదురుదాడిని జింబాబ్వే బౌలర్లు ఏమాత్రం అడ్డుకోలేకపోయారు. ఈ జోడీ తొలి వికెట్‌కు అజేయంగా 156 రన్స్ అందించడంతో 28 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. తొలి ఓవర్‌లోనే జైస్వాల్ హ్యాట్రిక్ ఫోర్లతో వేట ఆరంభించాడు. అదే దూకుడుతో మూడో ఓవర్‌లోనూ 4 ఫోర్లు బాదడంతో పవర్‌ప్లేలోనే జట్టు 61 రన్స్ సాధించింది. 29 బంతుల్లోనే జైస్వాల్ ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. అప్పటికి గిల్ స్కోరు 13 రన్సే. ఇక గిల్ కూడా పదో ఓవర్‌లో మూడు ఫోర్లతో ఆకట్టుకోగా స్కోరు వంద దాటింది. 15వ ఓవర్‌లో చెరో సిక్సర్‌తో 16 రన్స్ రావడంతో జట్టు విజయానికి చేరువైంది. అటు గిల్ అర్ధసెంచరీ కూడా పూర్తయ్యింది. అయితే ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించిన జైస్వాల్ సెంచరీకి 7 పరుగుల దూరంలో ఆగిపోయాడు.

స్కోరుబోర్డు

జింబాబ్వే: మధెవెరె (సి) రింకూ (బి) దూబే 25; మరుమని (సి) రింకూ (బి) అభిషేక్ 32; బెన్నెట్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 9; రజా (సి) గిల్ (బి) తుషార్ 46; క్యాంప్‌బెల్ (రనౌట్) 3; మైర్స్ (సి అండ్ బి) ఖలీల్ 12; మదండె (సి) రింకూ (బి) ఖలీల్ 7; ఫరాజ్ (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 20 ఓవర్లలో 152/7. వికెట్ల పతనం:** 1-63, 2-67, 3-92, 4-96, 5-141, 6-147, 7-152. **బౌలింగ్:** ఖలీల్ 4-0-32-2; తుషార్ 3-0-30-1; రవి బిష్ణోయ్ 4-0-22-0; సుందర్ 4-0-32-1; అభిషేక్ 3-0-20-1; శివమ్ దూబె 2-0-11-1.

భారత్: జైస్వాల్ (నాటౌట్) 93; గిల్ (నాటౌట్) 58; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం:** 15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 156. **బౌలింగ్:** ఎన్‌గరవ 3-0-27-0; ముజరబాని 3.2-0-25-0; చటార 2-0-23-0; ఫరాజ్ 4-0-41-0; రజా 2-0-24-0; బెన్నెట్ 1-0-16-0.

1 టీ20ల్లో వికెట్ నష్టపోకుండా 150+ స్కోరును ఛేదించడం భారత్‌కిదే తొలిసారి. అలాగే ఎక్కువ బంతులు (28) మిగిలి ఉండగానే మొదటిసారి మ్యాచ్‌ను పూర్తి చేసింది.

2 ఛేదనలో ఏ వికెట్‌కైనా రెండో అత్యధిక భాగస్వామ్యం అందించిన జైస్వాల్-గిల్.

5 భారత్ నుంచి టీ20ల్లో తొలి వికెట్‌కు 150+ భాగస్వామ్యం నమోదవడం ఇది ఐదోసారి.

కార్ల స్టాక్ క్లియరెన్స్ సేల్

డీలర్ల వద్ద పేరుకుపోయిన రూ.60,000 కోట్ల వాహన నిల్వలు.. ఇప్పటివరకిదే అత్యధిక ఇన్వెంటరీ

» విక్రయాలు మందగించడం వల్లే..
» కస్టమర్లకు భారీ రాయితీలతో గాలం

న్యూఢిల్లీ: దేశీయ కార్ల కంపెనీలు జోరుగా డిస్కౌంట్లు కల్పిస్తున్నాయి. ఎందుకంటే, గడిచిన కొన్ని నెలల్లో వాహన విక్రయాల జోరు తగ్గింది. లోక్‌సభ ఎన్నికలు, ఎండల జోరుతో ఈ వేసవి సీజన్ ప్యాసింజర్ వాహన మార్కెట్‌కు అంతగా కలిసి రాలేదు. ఎన్నికల తర్వాత విక్రయాలు మళ్లీ జోరందుకోవచ్చని కంపెనీలు భావించినప్పటికీ, ఉత్తరాదిలో భారీ ఎండల కారణంగా కార్ల షోరూమ్‌లను సందర్శించే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. దాంతో గత నెల కార్ల విక్రయాల్లో కేవలం 3 శాతం వృద్ధి నమోదైంది. ఇప్పుడేమో వర్షాకాలం.

సాధారణంగానే ఈ సీజన్‌లో వాహన మార్కెట్ సెంటిమెంట్ బలహీనంగా ఉంటుంది. మళ్లీ పండగ సీజన్ ప్రారంభమైతే తప్ప విక్రయాలు పుంజుకునే అవకాశాల్లేవు. దాంతో కంపెనీలు కస్టమర్లను ఆకర్షించే ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాయి. ప్రస్తుత స్టాక్‌ను క్లియర్ చేయడంతో పాటు విక్రయాలు పెంచుకునేందుకు కంపెనీలు పలు మోడళ్ల కార్ల ధరలను తగ్గించడంతో పాటు భారీగా డిస్కౌంట్లు, ప్రోత్సాహకాలను ఆఫర్ చేస్తున్నాయి.



ప్రస్తుతం కార్ల కంపెనీలు, డీలర్ల వద్ద మరో రెండు నెలలకు సరిపోయే రూ.60,000 కోట్ల విలువైన వాహన నిల్వలు పేరుకుపోయాయి. దేశీయ కార్ల పరిశ్రమ చరిత్రలో ఇప్పటి వరకిదే అత్యధిక ఇన్వెంటరీ. "ప్రస్తుతం డీలర్ల వద్ద అమ్ముడుపోకుండా ఉన్న కార్ల నిల్వలు 6-6.5 లక్షల యూనిట్ల వరకు ఉంటాయి. గడిచిన రెండు నెలల్లోనే నిల్వలు 77,000 యూనిట్ల మేర పెరిగాయి. ప్రస్తుతం ఇన్వెంటరీలోని కార్ల సగటు ధర రూ.9.5 లక్షల స్థాయిలో ఉంటుంది. ఈ లెక్కన కార్ల నిల్వల విలువ రూ.60,000 కోట్ల వరకు ఉంటుంద"ని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ (ఫాడా) అధ్యక్షుడు మనీశ్ రాజ్ సింఘానియా తెలిపారు.

జూన్ నెలలో కార్ల కంపెనీల టోకు విక్రయాలు (డీలర్లకు సరఫరా చేసినవి) 3.41 లక్షల యూనిట్లుగా ఉండగా.. డీలర్లు మాత్రం 2,81,600 యూనిట్ల వాహనాలను విక్రయించగలిగారు. కంపెనీల నుంచి డీలర్లకు సరఫరా.. రిటైల్ విక్రయాలకు మధ్య అంతరం భారీగా ఉందనడానికిదే నిదర్శనం. అయితే, అధిక నిల్వలపై అంతగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. గిరాకీ, సరఫరా మధ్య సమతుల్యం సాధించడం కంపెనీలకు బాగా తెలుసునని భారత వాహన తయారీదారుల సమాఖ్య (సియామ్) ప్రెసిడెంట్ వినోద్ అగర్వాల్ అన్నారు.

తగ్గిన రుణ లభ్యత

గడిచిన కొన్ని నెలలుగా బ్యాంకులు సైతం కార్ల కొనుగోలుకు రుణాలిచ్చే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయని డీలర్లు అంటున్నారు. మంచి క్రెడిట్ స్కోర్ ఉన్న వారికి తప్ప మిగతా వారికి వాహన రుణాలిచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావట్లేదని, ఇందుకు తోడు అధిక వడ్డీ రేట్లు కూడా కార్ల విక్రయాలపై ప్రభావం చూపాయని వారన్నారు.

ఫోక్స్‌వేగన్

జర్మన్ ఆటోమొబైల్ కంపెనీ ఫోక్స్‌వేగన్ తన ఎస్‌యూవీ టైగున్‌పై రూ.1.78 లక్షల క్యాష్ డిస్కౌంట్, రూ.73,000 ఉచిత యాక్సెసరీలు, రూ.40,000 ఎక్స్ఛేంజ్ బోనస్ కలిపి రూ. 2.9 లక్షల వరకు ప్రయోజనాలందిస్తున్నట్లు తెలిసింది. అలాగే, తన అత్యంత ఖరీదైన ఎస్‌యూవీ మోడల్ టిగ్వాన్‌పై రూ.3.4 లక్షల డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం.

స్కోడా

చెక్ రిపబ్లిక్ ఆటో కంపెనీ స్కోడా తన కాంపాక్ట్ ఎస్‌యూవీ కుషాక్‌పై ఏకంగా రూ.2.5 డిస్కౌంట్ అందిస్తోంది. తెలిసింది. అలాగే, 3ఏళ్ల కార్ మెయింటెనెన్స్ ప్యాకేజీతో పాటు 5 ఏళ్ల ఎక్స్‌టెండెడ్ వారంటీ సైతం కల్పిస్తోంది. కంపెనీ తన ఎస్‌యూవీ కొడియాక్‌పైనా రూ.2.5లక్షల వరకు డిస్కౌంట్ ఇస్తోంది.

హ్యుండయ్

హ్యుండయ్ మోటార్ గ్రాండ్ ఐ10 నియోస్‌పై వేరియంట్‌ను బట్టి రూ.15,000-35,000 వరకు డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. ఐ20పై రూ.20,000 -35,000, వెర్నాపై రూ.15,000, అల్కజార్‌పై రూ.55,000, టూసన్‌పై రూ.50,000-2 లక్షల వరకు రాయితీ అందిస్తోంది. అలాగే, ఎక్స్‌టర్‌పై రూ.10,000, వెన్యూపై రూ.35,000 -45,000 నగదు ప్రయోజనాలను కల్పిస్తోంది. ఇందుకు తోడు, రూ.10,000-30,000 ఎక్స్ఛేంజ్ బెనిఫిట్, రూ.3,000 కార్పొరేట్ బోనస్ కూడా అందిస్తోంది. కంపెనీ హైయెస్ట్ సెల్లింగ్ మోడల్ క్రెటాపైన మాత్రం ఎలాంటి డిస్కౌంట్ ఆఫర్ చేయడం లేదు.

టాటా మోటార్స్

టాటా మోటార్స్ తన హ్యాచ్‌బ్యాక్ కారు టియాగోపై రూ.25,000-30,000 క్యాష్ డిస్కౌంట్ అందిస్తోంది. టిగోర్‌పై రూ.25,000-30,000, ఆల్ట్రోజ్‌పై రూ.15,000-25,000, నెక్సాన్‌పై రూ.20,000 రాయితీ ఆఫర్ చేస్తున్నట్లు కంపెనీ డీలర్లు వెల్లడించారు. టియాగో, టిగోర్ ఎలక్ట్రిక్ వేరియంట్లపైనేతే రూ.75,000- 85,000 నగదు ప్రయోజనాలందిస్తోంది. నెక్సాన్ ఈవీపై రూ.1.1 లక్షల వరకు ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం. అలాగే, రూ.10,000-30,000 ఎక్స్ఛేంజ్ బెనిఫిట్, రూ.3,000-8,000 కార్పొరేట్ డిస్కౌంట్ సైతం అందిస్తున్నట్లు వారు తెలిపారు.

బిజినెస్

మారుతి సుజుకీ

దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన కాంపాక్ట్ కార్ల ఆటోమెటిక్ ట్రాన్స్‌మిషన్ వేరియంట్లపై క్యాష్ బ్యాక్ డిస్కౌంట్లు ఆఫర్ చేస్తోంది. బ్రెజ్జా ఆటోమెటిక్‌పై రూ.10,000, ఆల్టో కే 10పై రూ.30,000-45,000 వరకు, ఎస్-ప్రెస్సోపై రూ.35,000-40,000 వరకు, వ్యాగన్ ఆర్‌పై రూ.30,000-40,000 వరకు, ఈకోపై రూ.10,000-20,000 వరకు, డిజైర్‌పై రూ.10,000-15,000 వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిసింది. దీనికి అదనంగా రూ.10,000 -20,000 ఎక్స్ఛేంజ్ బోనస్, రూ.2000-5000 కార్పొరేట్ డిస్కౌంట్ కూడా ఆఫర్ చేస్తున్నట్లు సమాచారం.

నెక్సా షోరూమ్ మోడళ్ల విషయానికొస్తే, ఇగ్నిస్ మరియు బాలెనోపై రూ.35,000-40,000, ఫ్రాంక్స్‌పై రూ.22,500-35,000 వరకు, సియాజ్, ఎక్స్‌ఎల్ 6పై రూ.20,000, గ్రాండ్ విటారాపై రూ.30,000-50,000 వరకు, జిమ్నీపై రూ.3.3 లక్షల వరకు డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నట్లు డీలర్ వర్గాలు తెలిపాయి.

మహీంద్రా అండ్ మహీంద్రా

ఎక్స్‌యూవీ 700 ధరను రూ.2.2 లక్షల వరకు తగ్గించిన మహీంద్రా అండ్ మహీంద్రా.. బొలెరో నియోపై ఎక్స్ఛేంజ్ బోనస్‌తో కలిపి రూ.90,000 క్యాష్ డిస్కౌంట్, ఎక్స్‌యూవీ 300పై రూ.1.5 లక్షల డిస్కౌంట్ ఆఫర్ చేస్తోంది. అలాగే, కొన్ని నగరాల్లో కంపెనీ థార్, స్కార్పియో ఎన్‌పై పరిమిత ఆఫర్లను సైతం అందిస్తున్నట్లు డీలర్లు వెల్లడించారు.ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ పై మాత్రం ఎలాంటి రాయితీలు లేవు.

ఎంజీ మోటార్

బ్రిటన్ మోటార్ బ్రాండ్ ఎంజీ తన ఎస్‌యూవీ గ్లోస్టర్‌పై రూ.2 లక్షల వరకు డిస్కౌంట్‌ను కల్పిస్తోంది. జెడ్‌ఎస్ ఈవీపై రూ.1.5 లక్షల వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిసింది.

ఎంజీఎం హెల్త్‌కేర్ చేతికి సెవెన్‌హిల్స్ హాస్పిటల్

రూ.171 కోట్ల రిజొల్యూషన్ ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ అమరావతి బెంచ్ ఓకే



హైదరాబాద్: కార్పొరేట్ దివాలా ప్రక్రియ (సీఐఆర్‌పీ)లో ఉన్న సెవెన్ హిల్స్ హాస్పిటల్‌ను చెన్నైకి చెందిన ఎంజీఎం హెల్త్‌కేర్ చేజిక్కించుకుంది. ఎంజీఎం హెల్త్‌కేర్ సమర్పించిన రూ.171 కోట్ల రిజొల్యూషన్ ప్రణాళికకు ఎన్‌సీఎల్‌టీ అమరావతి బెంచ్ ఆమోదం తెలిపింది. కాగా రూ.171 కోట్ల రిజొల్యూషన్ ప్రణాళికలో భాగంగా రూ.18 కోట్లను మూలధన వ్యయం, వర్కింగ్ క్యాపిటల్ నిమిత్తం ఎంజీఎం హెల్త్‌కేర్ వినియోగించనుంది. 1988లో కార్యకలాపాలు ప్రారంభించిన సెవెన్‌హిల్స్ హెల్త్‌కేర్ ప్రైవేట్ లిమిటెడ్.. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 300 పడకల సామర్థ్యం గల హాస్పిటల్‌తో పాటు ముంబైలో 1,500 పడకల సామర్థ్యం గల హాస్పిటల్‌ను నిర్వహిస్తోంది.

2018లో దివాలా ప్రక్రియ ప్రారంభం

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంకరప్టసీ కోడ్ (ఐబీసీ) కింద యాక్సిస్ బ్యాంక్.. సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌పై ఎన్‌సీఎల్‌టీ అమరావతి బెంచ్‌లో 2018 మార్చిలో దివాలా పిటిషన్ దాఖలు చేసింది. దాదాపు రూ.1,273 కోట్ల బకాయిలు రాబట్టుకునేందుకు యాక్సిస్ బ్యాంక్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. రుణదాతలు, ఉద్యోగులు, ఇతరులు కలిపి మొత్తం రూ.1,361.89 కోట్ల క్లెయిమ్స్‌కు పిటిషన్ దాఖలు చేయగా అందులో సెక్యూర్డ్ రుణదాతలు క్లెయిమ్ చేసిన మొత్తం రూ.1,273 కోట్లుగా ఉంది. ఎంజీఎం హాస్పిటల్ ప్రమోటర్ రాజగోపాలన్‌తో పాటు మోహన్ రెడ్డి కన్సార్షియం, క్యాపీ గోల్డ్ హోల్డింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా తమ రిజొల్యూషన్స్ ప్రణాళికలు సమర్పించాయి. అయితే రుణదాతల కమిటీ (సీఓసీ) వంద శాతం మెజారిటీతో ఎంజీఎం రాజగోపాలన్ ప్రణాళికకు ఆమోదం తెలిపింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సెవెన్‌హిల్స్ రెవెన్యూ రూ.100 కోట్లుగా ఉంది. సెవెన్‌హిల్స్ హాస్పిటల్‌లో 100 మందికి పైగా డాక్టర్లు, 700 మందికి సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

తొలిసారిగా చెన్నై వెలుపలకు..

సెవెన్‌హిల్స్ కొనుగోలుతో ఎంజీఎం హెల్త్‌కేర్ తొలిసారిగా చెన్నై వెలుపలికి తన కార్యకలాపాలు విస్తరించనుందని సంస్థ డైరెక్టర్ ప్రశాంత్ రాజగోపాలన్ వెల్లడించారు. అంతేకాకుండా ఐదేళ్ల వ్యవధిలోనే ఎంజీఎం మొత్తం పడకల సామర్థ్యం 1,000కి చేరుకోనుందన్నారు. మరోవైపు పొరుగున ఉన్న తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ప్రజలకు సేవలందించే అవకాశం లభించనుందని పేర్కొన్నారు.

'బీ' నుంచి 'డీ' గ్రేడ్‌కు పడిపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్ పరపతి రేటు

రుణాలు ఇవ్వలేమని చేతులెత్తేసిన బ్యాంకులు

విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్, ఆర్ఐఎన్ఎల్)కు రుణాలు ఇవ్వలేమని బ్యాంకులు చేతులెత్తేశాయి. దాంతో యాజమాన్యానికి ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి ఎదురైంది. నాలుగు రోజుల క్రితం ప్లాంట్ అధికారులు రుణాల కోసం వివిధ బ్యాంకులను సంప్రదించేందుకు ముంబై వెళ్లారు. గతంలో తీసుకున్న రుణాలను సరైన సమయంలో చెల్లించకపోవడం వల్ల మళ్లీ ఇవ్వలేమని ఎస్‌బీఐ సహా పలు బ్యాంకులు తేల్చి చెప్పేశాయి. వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న టర్మ్ లోన్ రూ.450 కోట్లలో అసలు, వడ్డీని జూన్ 30లోగా చెల్లించాల్సి ఉండగా స్టీల్ ప్లాంట్ తీర్చలేకపోయింది. దాంతో స్టీల్ ప్లాంట్ పరపతి 'బీ' నుంచి 'డి' గ్రేడ్‌కు పడిపోయింది. ఈ గ్రేడ్‌ను డిఫాల్టర్ లేదా డీమ్డ్ టు బీ డిఫాల్టర్‌గా వ్యవహరిస్తారు. ఇటువంటి సంస్థలకు రుణాలు ఇవ్వాలంటే బ్యాంకులు ఆచితూచి వ్యవహరిస్తాయి. అదొక్కటే కాకుండా మానిటైజేషన్ కింద సంస్థకు చెందిన ఆస్తులను విక్రయించి, ఆ మొత్తాలు రాబట్టుకోవడంలో కూడా స్టీల్ ప్లాంట్ సరిగ్గా వ్యవహరించలేకపోయిందని బ్యాంకులు అభిప్రాయపడ్డాయి. ప్లాంట్ వద్ద నగదు నిల్వలు కూడా రూ.19 కోట్లకు పడిపోయాయి. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి. జిందాల్, టాటా స్టీల్ నుంచి తీసుకున్న రూ.2,300 కోట్లు కూడా సద్వినియోగం కాలేదు. రుణాలు ఇవ్వాలంటే స్టీల్ ప్లాంట్ పేరిట సెంటు భూమి కూడా లేదు. వీటన్నింటి నేపథ్యంలో రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరించాయని అధికార వర్గాల సమాచారం.

ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 20% వృద్ధి

ఈనెల 11 నాటికి రూ.5.74 లక్షల కోట్ల ఆదాయం

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఇప్పటివరకు (ఏప్రిల్ 1 నుంచి జూలై 11 వరకు) నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 19.54 శాతం పెరిగి రూ.5.74 లక్షల కోట్లకు చేరుకున్నాయి. అందులో కార్పొరేట్ పన్ను వసూళ్లు రూ.2,10,274 కోట్లుగా, వ్యక్తిగత ఆదాయం పన్ను ఆదాయం రూ.3,46,036 కోట్లుగా నమోదయ్యాయి. సెక్యూరిటీల లావాదేవీలపై పన్ను రూపంలో మరో రూ.16,634 కోట్లు సమకూరాయని ప్రత్యక్ష పన్నుల కేంద్ర బోర్డు (సీబీడీటీ) తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.4.80 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కాగా, ఈ ఏప్రిల్ 1- జూలై 11 మధ్య కాలంలో రూ.70,902 కోట్ల రిఫండ్లు జారీ చేయడం జరిగిందని, గత ఏడాదిలో ఇదే సమయానికి జారీ చేసిన రిఫండ్లతో పోలిస్తే 64.4 శాతం అధికమని సీబీడీటీ వెల్లడించింది. ఈ నెల 11 నాటికి స్థూల వసూళ్లు 23.24 శాతం వృద్ధితో రూ.6.45 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2024-25లో ప్రత్యక్ష పన్నుల రాబడి రూ.21.99 లక్షల కోట్ల స్థాయిలో ఉండవచ్చని ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్లో ఆర్థిక శాఖ అంచనా వేసింది.

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	115
వరంగల్	110	గుంటూరు	115
కరీంనగర్	110	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	122
కర్నూలు	110	నెల్లూరు	122
విశాఖపట్నం	107	అనంతపురం	115
గోదావరి	115		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,800 ▲	67,700 ▲	1,00,000 ▲
ముంబై	72,660 ▲	66,560 ▲	92,204 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	555
వరంగల్	532	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 14-7-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బాబు కాళ్లకు బంధమేల?



..ప్రభుత్వం మారి చంద్రబాబు నేతృత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు మాత్రమే అయింది. అయినా తెలుగు తమ్ముళ్లు ఆవేశపడిపోతున్నారు. అధికారుల పోస్టింగుల నుంచి ప్రతి చిన్న విషయానికీ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు.

..ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యవహారాలకు కొన్ని మార్గదర్శకాలు ఉంటాయి. అయితే జగన్ రెడ్డి వాటన్నింటినీ తుంగలో తొక్కి, పగ, ప్రతీకారాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో అప్పుడు బాధితులుగా ఇబ్బందులు పడినవారందరూ ఇప్పుడు చంద్రబాబు కూడా అదే బాటలో నడవాలని కోరుకుంటున్నారు.

..ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు అవుతున్నప్పటికీ ఇంకా కుదురుకోలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. జగన్ రెడ్డి వ్యవహార శైలి కారణంగా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. మరకలు అంటని అధికారులను గుర్తించడం కష్టంగా మారింది.

...తెలుగు తమ్ముళ్లు ఇప్పుడే ఎందుకు ఇంత అసహనానికి గురవుతున్నారంటే కారణం లేకపోలేదు. జగన్ రెడ్డి పాలనలో ప్రత్యర్థులను, ముఖ్యంగా తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులను కేసులతో వేధించారు. వారు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి. దీంతో నాటి బాధితులు ఇప్పుడు ఇన్‌స్టంట్ జస్టిస్ కోరుకుంటున్నారు. జగన్ రెడ్డి బాటలోనే వ్యవహరించాలనుకుంటే ప్రభుత్వం మారాల్సిన అవసరం లేదని మరచిపోతున్నారు.

...అధికారులు ఇంతగా చెడిపోవడమే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యగా మారింది. ప్రభుత్వం మారినంత మాత్రాన అధికారులు కొత్తగా పుట్టుకు రారు. కనుక పూర్తిగా చెడిపోయిన అధికారులను వదిలేసి మిగతావాళ్లకు ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించి వారితోనే పనిచేయించుకోవాలి. ఈ విషయంలో తెలుగు తమ్ముళ్లు కూడా ఆవేశాన్ని తగ్గించుకోవాలి.

...కొన్ని రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కొందరు తెలుగుదేశం, జనసేన నాయకులు, ఎమ్మెల్యేలు గత పాలకుల బాటలోనే కప్పం కోసం డిమాండ్ చేయడం, కబ్జాల బాటపట్టడం చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. పెట్టుబడుల ఆకర్షణ పనిలో చంద్రబాబు ఉంటే, ఎమ్మెల్యేలు ఇలా ప్రవర్తించడాన్ని ఎలా సమర్థించుకుంటారు?

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 2లో..

వ్యక్తిగత దాడులొద్దు

అధికారంలో ఉన్నామని మనం కూడా దాడులు చేస్తే... వైసీపీకీ, మనకూ తేడా ఉండదు.
-చంద్రబాబు

వైసీపీ వాళ్లు చేసిందే మనమూ చేయొద్దు

- తప్పు చేసినవారిని చట్టపరంగా శిక్షిద్దాం
- సమర్థులందరికీ నామినేటెడ్ పదవులు
- అధికారంలోకి వచ్చామనే గర్వం వీడండి
- పార్టీ ఆఫీసుకు రావడాన్ని సేవగా మంత్రులు చూడాలి
- టీడీపీ నేతలకు చంద్రబాబు స్పష్టీకరణ


శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చేశామన్న గర్వంతో ఎవరిపైనా వ్యక్తిగత దాడులకు ఎవరూ దిగొద్దని, కక్షసాధింపు చర్యలకు పాల్పడవద్దని పార్టీ నేతలు, కార్యకర్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ జోనల్ నేతలతో సమావేశమైన ఆయన దీనిపై పలు సూచనలు చేశారు. "అధికారంలో ఉన్నామని మనం కూడా దాడులు చేస్తే... వైసీపీకీ, మనకీ తేడా ఉండదు. తప్పు చేసిన వారిని చట్టపరంగా శిక్షిద్దాం" అని పేర్కొన్నారు. గత ఐదేళ్లగా టీడీపీ కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసుల గురించి చంద్రబాబు ఆరా తీశారు. చట్టపరంగా వారికి కేసుల నుంచి ఎలా విముక్తి కలిగించాలనే దానిపై చర్చించారు. నియోజకవర్గ ఇన్‌చార్జులు తమ పరిధిలో నమోదైన అక్రమ కేసుల వివరాలను పంపాలని చంద్రబాబు ఆదేశించారు. తెలుగుదేశం నేతల ఇళ్లపై, కార్యాలయాలపై గతంలో వైసీపీ మూకలు దాడులకు దిగినప్పుడు కేసులు పెట్టినా సక్రమంగా వ్యవహరించని దర్యాప్తు అధికారుల వివరాలివ్వాలని, చట్టపరంగానే వారి సంగతి తేలుద్దామని చెప్పారు. అధికారంలోకి వచ్చామని నేతలు అలసత్వం ప్రదర్శించొద్దనీ, మంత్రులు కూడా పార్టీ కార్యాలయానికి తరచుగా రావడం సేవగా భావించాలని సూచించారు. ప్రతిరోజూ ఇద్దరు మంత్రులైనా పార్టీ


మిగతా 11వ పేజీలో...

కాళ్లు మొక్కే సంస్కృతి వద్దు

- నాకు ఎవరైనా మొక్కితే నేనూ అదే పనిచేస్తా
- పార్టీ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరించిన బాబు
- రాజధాని నిర్మాణానికి విరాళాల వెల్లువ 11

నామినేటెడ్ పోస్టుల వివరాలు ఇవ్వండి

- సాధారణ పరిపాలన శాఖ సర్క్యులర్ జారీ 10
- రేపు ఉన్నతాధికారుల సమావేశంలో కీలక నిర్ణయం?


9

అదిగో జగన్నాథుడి ఖజానా!

- నేడు తెరుచుకోనున్న పూరీ ఆలయ రత్నభాండాగారం.. రహస్య గదిలోకి వెళ్లనున్న 16 మంది బృందం
- 46 ఏళ్ల తర్వాత సంపద లెక్కింపునకు ఏర్పాట్లు.. 15 చెక్కపెట్టెల్లో బంగారు, వెండి ఆభరణాలు, వస్తువులు
- రత్నాలు, వజ్ర వైడూర్యాలు, గోమేధిక పుష్యరాగాల రాశులు.. నిధిలో పెద్ద కిరీటాలు, భారీ స్వర్ణ సింహాసనం
- నెమలి ఈకలు, తామరపూలు, పులి గోరు ఆకారాల్లో నగలు.. అరుదైన సంపదను విరాళమిచ్చిన రాజులు
- నిధికి విషసర్పాలు రక్షణగా ఉన్నాయేమోనని ఆందోళన.. రెడీగా పాములు పట్టేవారు, వైద్య సిబ్బంది


శనివారం బెజవాడలో కురిసిన భారీ వర్షానికి ఆయుష్ ఆస్పత్రి వద్ద చెరువులా మారిన రోడ్డు 12

నేడు, రేపు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం.. రేపటిలోగా అల్పపీడనంగా మారే చాన్స్
- ఉత్తర కోస్తా తీరంలో బలమైన గాలులు.. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక

పచ్చకామెర్లోడికి అంతా పచ్చగానే



- బాబుకు తోకపార్టీ అనడం అవగాహనారాహిత్యం
- జీవోకు క్లారిటీ ఇవ్వమనడం కొమ్ముకాయడమా..!
- తల్లుల పక్షాన నిలదీశాం కాబట్టే ప్రభుత్వ వివరణ
- ప్రతి బిడ్డకూ 15 వేలు అని జగన్ చెప్పడం నిజం
- జలయజ్ఞం, సంపూర్ణ మద్య నిషేధం, ప్రత్యేక హోదాపైనా ప్రచారం.. వైసీపీపై షర్మిల మండిపాటు 12

బహిరంగ చర్చకు రావాలని సవాల్

ఆప్కాస్‌లో ఆక్టోపస్!

నిధులన్నీ కార్పొరేషన్ ఎండీ జల్సాలకే

జగన్ హయాంలో దొంగ బిల్లులతో సొమ్ములు స్వాహా

- కేవలం జిరాక్స్ కాగితాలకే నెలకు 18 లక్షలు
- 1.14 లక్షల సంస్థ నిధులతో సొంతానికి సెల్‌ఫోన్
- ఎండీ ఇంటికీ పులుసు.. రవాణాకే నెలకు 25 వేలు
- ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సంక్షేమానికి ఆప్కాస్
- కానీ వైసీపీ, జగన్ మనుషుల అడ్డాగా మార్చేశారు
- ఆప్కాస్ కమీషన్ల దెబ్బకు బోర్డులు హడల్
- ప్రకటించిన నియామక ప్రక్రియ సైతం నిలిపివేత
- ఈపీఎఫ్ విషయంలో ఘోర తప్పిదాలు
- రూ.10 కోట్లు జరిమానాగా చెల్లించిన వైనం
- కొత్త ప్రభుత్వం రావడంతో వెలుగులోకి అక్రమాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తాత్కాలిక ఉద్యోగుల భద్రత కోసం ఏర్పాటుచేసిన ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్(ఆప్కాస్) ఓ అధికారికి అప్పనంగా దోచుకునేందుకు కల్పతరువుగా మారింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఏజెన్సీల దోపిడీకి గురికాకుండా చూస్తామంటూ గత జగన్ ప్రభుత్వం ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసింది. అయితే, చివరికి.. దీనిని వైసీపీ, అప్పటి సీఎం జగన్ మనుషుల అడ్డాగా మార్చేశారు. ఆప్కాస్ ఎండీ వాసుదేవరావు ఈ సంస్థ పాలిట తిమింగలంగా మారారు. అడ్డగోలు నియామకాలు, కమీషన్ల కక్కుర్తి, నిర్వహణ పేరుతో భారీగా తప్పుడు బిల్లులు పెట్టుకుని నిధులు స్వాహా చేస్తుండటం కార్పొరేషన్‌లో సర్వ సాధారణమైందన్న ఆరోపణలున్నాయి. కొత్త ప్రభుత్వం రావడంతో అప్పటి పాతకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. ఆప్కాస్‌ను ఏర్పాటుచేసిన తర్వాత దానికి ఎండీగా మాజీ మంత్రి బొత్సకు సన్నిహితుడైన వాసుదేవరావును నియమించారు. వాస్తవానికి గతంలో మెడ్‌టెక్‌లో జరిగిన భారీ స్కామ్‌లో ఈయన కీలకంగా ఉన్నారు. కార్పొరేషన్‌ను సొంత జేబు సంస్థగా

మిగతా 10వ పేజీలో...

వేల కోట్లు కొట్టేశారు

పేదల ఇళ్ల నిర్మాణంలో భారీ దోపిడీ.. ఆప్షన్-3లో కాంట్రాక్టర్ల కుమ్ముడు

- వైసీపీ నేతలు, అస్మదీయుల దందా
- పనులు ప్రారంభించకుండానే అడ్వాన్సులు
- 3.5 లక్షల ఇళ్ల బేస్‌మెంట్లకు 2,450 కోట్లు
- అలాగే లక్షలాది టన్నుల స్టీల్, సిమెంట్ కూడా
- సగానికిపైగా ప్రారంభంకాని ఇళ్ల పనులు
- పునాదులు వేసినవీ నాసిరకమే
- అడ్వాన్సుల్లోనే 2 వేల కోట్లు నొక్కుడు
- పనులు ఆపేసి ఉడాయించిన కాంట్రాక్టర్లు
- వైసీపీ హయాంలో పాపాలు ఎన్నెన్నో



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేరుకేమో పేదలకు పక్కా ఇళ్ల నిర్మాణం! జరిగిందేమో పేదల ఇళ్ల పేరిట వైసీపీ అస్మదీయుల దోపిడీ! వైసీపీ నేతలు, కార్యకర్తలు, అస్మదీయ కంపెనీలు అంతా కలసి వేల కోట్లు దోచుకున్నారు. పేదల ఇళ్ల నిర్మాణాలకు పునాదులు కూడా వేయకుండా వదిలేసి పోయారు. వైసీపీ ప్రభుత్వంలో ఆప్షన్ 3 కింద ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు అన్యాయం చేశారు. అడ్వాన్స్ పేరిట మొత్తం 2 వేల కోట్ల ప్రభుత్వ నిధులు దోచుకున్నారు. అలాగే ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం ఇచ్చిన వేలకోట్ల రూపాయల విలువైన మెటీరియల్‌ను అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. హౌసింగ్ అధికారులు కమీషన్లకు కక్కుర్తిపడి కాంట్రాక్టర్లకు దోచిపెట్టినట్టు ఆరోపణలు వస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఆప్షన్ 3 కింద పేదలకు 3,54,954 ఇళ్లను కట్టించేందుకు కాంట్రాక్టర్లకు పనులు అప్పగించింది. పనులు ప్రారంభించకుండానే ఒక్కో ఇంటి బేస్‌మెంట్‌కు రూ.70 వేల చొప్పున

మిగతా 9వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

బాబు కాళ్లకు బంధమేల?


"చంద్రబాబు నాయుడులో మార్పు ఆశించడం వేస్ట్.. పేరుకే కూటమి ప్రభుత్వం గానీ వైసీపీ–2 ప్రభుత్వం ఉన్నట్టుగానే ఉంది" –సోషల్ మీడియాలో తెలుగు తమ్ముళ్లు పుంఖానుపుంఖాలుగా పెడుతున్న పోస్టులు, వ్యాఖ్యల సారాంశం ఇది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారి చంద్రబాబు నేతృత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు మాత్రమే అయింది. అయినా తెలుగు తమ్ముళ్లు ఆవేశపడిపోతున్నారు. చంద్రబాబులో ఏమి మార్పు ఆశిస్తున్నారో తెలియదు. అధికారుల పోస్టింగుల నుంచి ప్రతి చిన్న విషయానికీ సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. గత జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అరాచకాలకు తక్షణ శిక్షలు వేయాలని, అప్పట్లో ప్రభుత్వానికి సహకరించిన అధికారులు అందరినీ పక్కన పడేయాలని వారు కోరుకుంటున్నారు. ఈ నెల రోజులుగా తెలుగు తమ్ముళ్లు వ్యక్తంచేస్తున్న అభిప్రాయాలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తలనొప్పిగా మారాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ వ్యవహారాలకు కొన్ని మార్గదర్శకాలు ఉంటాయి. అయితే జగన్‌రెడ్డి హయాంలో ఈ మార్గదర్శకాలు అన్నింటినీ తుంగలో తొక్కి, పగ, ప్రతీకారాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అప్పుడు బాధితులుగా ఇబ్బందులు పడినవారందరూ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కూడా అదే బాటలో నడవాలని కోరుకుంటున్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో జరిగిన దురాగతాలలో భాగస్వాములైన అధికారులు అందరినీ శిక్షించాలని వారు కోరుకుంటున్నారు. నిజానికి కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు అవుతున్నప్పటికీ ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. జగన్‌రెడ్డి వ్యవహార శైలి కారణంగా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. మరకలు అంటని అధికారులను గుర్తించడం కష్టంగా మారింది. ఈ కారణంగా అధికారుల నియామకాలలో ముఖ్యమంత్రి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ జగన్ హయాంలో తొత్తుగా వ్యవహరించిన ఫలానా అధికారిని ఎందుకు నియమించారు? అంటూ నిట్టూర్పులు వెలువరిస్తున్నారు. పోలీసు శాఖలో కీలక పదవుల భర్తీకి అనువైన అధికారుల కోసం వెదుక్కోవలసి వచ్చింది. ప్రభుత్వ శాఖల కార్యదర్శుల నియామకం ఇంకా పూర్తికాలేదు. శాఖాధిపతులుగా ఎవరిని నియమించాలో తెలియని పరిస్థితి. జిల్లా కలెక్టర్ల నియామకం కొంతవరకు పూర్తిచేసిన ప్రభుత్వం జిల్లా ఎస్పీల నియామకాన్ని ఈ శనివారం మాత్రమే చేపట్టగలిగింది. వాస్తవానికి కార్యదర్శులు, శాఖాధిపతులు, కలెక్టర్లు, ఎస్పీల నియామకం పూర్తి అయితే గానీ కింది స్థాయి అధికారుల బదిలీ గురించి ఆలోచించే పరిస్థితి ఉండదు. అయితే తెలుగు తమ్ముళ్లు మాత్రం సహనం కోల్పోతున్నారు. "మా దగ్గర ఫలానా పోలీసు అధికారే, ఫలానా రెవెన్యూ అధికారే కొనసాగుతున్నారు. ఇలా అయితే ప్రభుత్వం మారాలని ఒళ్లూ ఇళ్లూ హూనం చేసుకోవడం ఎందుకూ?" అని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ ధోరణి ఎంత ప్రమాదకరంగా మారిందంటే, స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవలసిన ముఖ్యమంత్రి చంద్రబాబు వెనుకంజ వేయాల్సి వస్తోంది. ప్రభుత్వాలు మారినప్పుడు అప్పటిదాకా హడావిడి చేసిన అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు తెరమరుగై కొత్తగా అధికారంలోకి వచ్చిన పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు హల్‌చల్ చేయడం సర్వసాధారణం. ప్రభుత్వ యంత్రాంగంలో ఇలా చేయడం సాధ్యం కాదు. ఏ ప్రభుత్వమైనా అదే అధికారులు, సిబ్బందితో పనిచేయించుకోవాల్సి ఉంటుంది. అయితే తెలుగు తమ్ముళ్లు ఇప్పుడే ఎందుకు ఇంత అసహనానికి గురవుతున్నారంటే కారణం లేకపోలేదు. జగన్‌రెడ్డి పాలనలో రాజకీయ ప్రత్యర్థులను, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులను కేసులతో వేధించారు. వారు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి ఉండింది. పోలీసులు కనీవినీ ఎరుగని రీతిలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. బారా ఖూన్ మాఫీ అన్నట్టుగా ఎవరేమి చేసినా చెల్లుబాటు అయింది. ప్రశ్నించే వెసులుబాటు కూడా లేకుండాపోయింది. ప్రజాస్వామ్యంలో తాను ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిని మాత్రమే అన్న స్పృహ లేకుండా తాను ఒక చక్రవర్తిలాగా జగన్‌రెడ్డి వ్యవహరించారు. ఇక వైసీపీ నాయకులు సామంతుల్లాగా తమ తమ ప్రాంతాలపై ఆధిపత్యం చెలాయించారు. మొత్తంగా రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేకుండా చేశారు. వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. పగ, ప్రతీకారాలే రాజకీయాలకు పరమావధి అన్నట్టుగా రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇచ్చారు. దీంతో నాటి బాధితులు ఇప్పుడు ఇన్‌స్టంట్ జస్టిస్ కోరుకుంటున్నారు. కంటికి కన్ను–పంటికి పన్ను సిద్ధాంతాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. జగన్‌రెడ్డి బాటలోనే వ్యహరించాలనుకుంటే రాష్ట్రంలో ప్రభుత్వం మారాల్సిన అవసరం లేదని మరచిపోతున్నారు. చంద్రబాబు నాయుడు కూడా జగన్ మాదిరిగా సైకో పనులు చేయాలనుకుంటున్నారు. ఇదొక దురదృష్టకర వాతావరణం.

> జగన్‌రెడ్డి లేదా చంద్రబాబుకు సేవ చేసి తరించడానికే ఆయా అధికారులు అఖిల భారత సర్వీసుకు ఎంపిక కాలేదు కదా! చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయడమే అధికారుల బాధ్యత. ముఖ్యమంత్రుల కళ్లలో ఆనందం చూడటం కోసం కాకుండా రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలి. చంద్రబాబు, జగన్ మధ్య రాజకీయ వైరం ఉంటే వాళ్లిద్దరూ తేల్చుకుంటారు. వారికోసం అధికారులు కిరాయి సైనికులుగా మారడం సమర్థనీయం కాదు కదా! అధికారులు ఇంతగా చెడిపోవడమే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యగా మారింది. కీలక పోస్టుల భర్తీకి ఒకటికి రెండుసార్లు ఆలోచించవలసి వస్తోంది. ప్రభుత్వం మారినంత మాత్రాన అధికారులు కొత్తగా పుట్టుకు రారు. కనుక పూర్తిగా చెడిపోయిన అధికారులను వదిలేసి మిగతావాళ్లకు ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించి వారితోనే పనిచేయించుకోవాలి. ఈ విషయంలో తెలుగు తమ్ముళ్లు ఆవేశాన్ని తగ్గించుకోవాలి.

జగన్ కళ్లలో ఆనందం కోసం..

తెలుగునాట ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి, పోయాయి. అయితే గతంలో ఇలాంటి పరిస్థితి ఉండేది కాదు. అధికారంలోకి వచ్చిన వారి ప్రాధాన్యతల ఆధారంగా పాలన ఉండేది. అధికారులపై పార్టీల ముద్ర ఉండేది కాదు. తమిళనాడులో డీఎంకే – అన్నాడీఎంకే అధిపతులుగా కరుణానిధి–జయలలిత ఉన్నప్పుడు, డీఎంకే అధికారంలోకి వస్తే వారికి అనుకూలమైన అధికారులు కీలక స్థానాల్లోకి వచ్చేవారు. అన్నాడీఎంకే అధికారంలోకి రాగానే వారందరినీ అప్రధాన పోస్టులలో నియమించేవారు. ఈ పరిస్థితి తెలుగునాట గతంలో లేదు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాతే కొంతమంది అధికారులు కుల, మత ప్రాతిపదికన పార్టీలకు విధేయత ప్రకటించుకున్నారు. ఆ క్రమంలో వారు హద్దులు మీరి ప్రవర్తించారు. దీంతో రాష్ట్రంలో ప్రజల మైండ్‌సెట్ కూడా మారిపోయింది. పగ, ప్రతీకారాలే ఎజెండాగా అవతరించాయి. జగన్‌రెడ్డి హయాంలో ఏడెనిమిది మంది అధికారులు మరీ దిగజారి వ్యవహరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే ప్రవీణ్ ప్రకాశ్ అనే ఐఏఎస్ అధికారి స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేసుకున్నారు. అంటే, చంద్రబాబు ప్రభుత్వంలో పనిచేయడం ఆయనకు ఇష్టం లేకపోయి ఉండవచ్చు లేదా తన పాపాలకు శిక్ష అనుభవించాల్సి వస్తుందన్న భయం కావచ్చు. పరిటాల రవిని హత్య చేసిన వారిలో ఒకరైన మొద్దు శీను ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన బావ (మద్దెలచెరువు సూర్యనారాయణ రెడ్డి) కళ్లలో ఆనందం చూడటానికే రవిని చంపానని చెప్పాడు. ప్రవీణ్ ప్రకాశ్ కూడా జగన్ కళ్లలో ఆనందం చూడటం కోసం ప్రభుత్వానికి దిక్కుమాలిన సలహాలు ఇస్తున్నానని తన సహచరులతో చెప్పేవారట. ఒక ఐఏఎస్ అధికారి ఆలోచించాల్సిన తీరు అదేనా? ఇలాంటి వారి సూచనలు అమలుచేసి ఆనందపడిన జగన్మోహన్‌రెడ్డి ఇంటికి పోయారు. ఆయన కళ్లలో ఆనందం చూడడమే ముఖ్యమనుకున్న ప్రవీణ్ ప్రకాశ్ కూడా స్వచ్ఛంద పదవీ విరమణ చేయాల్సి వచ్చింది. ఇలాంటి అధికారుల మూలంగానే అఖిల భారత సర్వీసుల ప్రతిష్ఠ మసకబారుతోంది. ప్రవీణ్ ప్రకాశ్ తరహాలోనే మరికొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు వ్యవహరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల రోజులు అవుతున్నా సదరు అధికారులకు ఆయన దర్శనం కూడా లభించలేదు. ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి విషయమే తీసుకుందాం. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన కారణంగా సీబీఐ నమోదు చేసిన కేసులలో జగన్‌రెడ్డితో పాటు శ్రీలక్ష్మి కూడా జైలుకు వెళ్లి ఆరోగ్యం కూడా చెడగొట్టుకున్నారు. అయినా బుద్ధి తెచ్చుకోకుండా తెలంగాణ కోటాకు వెళ్లిన ఆమె.. విజయసాయి రెడ్డి ద్వారా పైరవీలు చేసుకొని జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లారు. ఇప్పుడు ఆమెకు చంద్రబాబు దర్శనం కూడా లభించడంలేదు. విధి నిర్వహణలో సక్రమంగా వ్యహరించి ఉంటే శ్రీలక్ష్మి కేంద్ర కేబినెట్ సెక్రటరీగా పదోన్నతి పొంది ఉండేవారు. ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్, సంజయ్ వంటి వారు కూడా ఈ కోవలోకే వస్తారు. వారిని కలవడానికి కూడా చంద్రబాబు ఇష్టపడటం లేదు. అఖిల భారత సర్వీసుకు ఎంపికైన అధికారులు ఇలా ఎందుకు ప్రవర్తించారనే ప్రశ్నకు వారే సమాధానం చెప్పాలి. చంద్రబాబు గతంలో కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అయితే అధికారుల విషయంలో ఇంత కఠినంగా ఆయన ఎప్పుడూ వ్యవహరించలేదు. సౌమ్యుడైన చంద్రబాబు కఠినంగా మారడానికి ఇలాంటి అధికారులే కారణం. జగన్‌రెడ్డి లేదా చంద్రబాబుకు సేవ చేసి తరించడానికే ఆయా అధికారులు అఖిల భారత సర్వీసుకు ఎంపిక కాలేదు కదా! చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయడమే అధికారుల బాధ్యత. ముఖ్యమంత్రుల కళ్లలో ఆనందం చూడటం కోసం కాకుండా రాజ్యాంగానికి కట్టుబడి పనిచేయాలి. జగన్‌రెడ్డి పాలనలో అధికారుల బలహీనతలను వాడుకొని వారితో అడ్డమైన పనులూ చేయించారు. 'జగన్‌రెడ్డి జైలుకు వెళ్లడానికి కారకుడైన చంద్రబాబును జైలుకు పంపకపోతే ఎలా? మీరు మాతో సహకరించండి. లేదా మిమ్మల్ని కూడా జైలుకు పంపుతామని సీనియర్ ఐఏఎస్ అధికారి అజయ్ జైన్ మెడపై కత్తి పెట్టిన చరిత్ర ఐపీఎస్ అధికారి కొల్లి రఘురామిరెడ్డిది. చంద్రబాబు, జగన్ మధ్య రాజకీయ వైరం ఉంటే వాళ్లిద్దరూ తేల్చుకుంటారు. వారికోసం అధికారులు కిరాయి సైనికులుగా మారడం సమర్థనీయం కాదు కదా! అధికారులు ఇంతగా చెడిపోవడమే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమస్యగా మారింది. కీలక పోస్టుల భర్తీకి ఒకటికి రెండుసార్లు ఆలోచించవలసి వస్తోంది. తెలుగు తమ్ముళ్లూ.. ఇప్పుడు చెప్పండి– జగన్‌రెడ్డి బాటలోనే చంద్రబాబు కూడా పాలెగాడి తరహా పాలన చేయాలా? లేక రూల్ ఆఫ్ లా ప్రకారం వ్యవహరించాలా? జగన్ ప్రభుత్వం అరాచకంగా ఉండిందనే కదా ప్రజలు ఆయనను చిత్తుగా ఓడించారు. చంద్రబాబు కూడా అలాగే చేస్తే ఆయనను కూడా ప్రజలు అంతే చిత్తుగా ఓడిస్తారు. కక్ష సాధింపులు ప్రభుత్వాలకు ఎజెండాగా ఉండకూడదు. అయితే నాటి బాధితులకు ఉపశమనం లభించాల్సిందే. కాకపోతే అది చట్టబద్ధంగా జరగాలి. తప్పు చేసిన అధికారులను నిబంధనల ప్రకారం శిక్షించాలి గానీ ఆటవిక న్యాయం అమలు చేయాలని కోరుకోవడం సమంజసం కాదు కదా! ఈ నేపథ్యంలో ప్రభుత్వాన్ని గాడిలో పెట్టడానికి చంద్రబాబుకు తగినంత వ్యవధి ఇవ్వాలి. సోషల్ మీడియా పేరిట ఆయనను ప్రభావితం చేయాలనుకోవడం, ప్రభుత్వం అనుచిత నిర్ణయాలు తీసుకొనే విధంగా ప్రేరేపించడం సమర్థనీయం కాదు. జగన్‌రెడ్డి పాలనలో అనేక ఇబ్బందులు పడిన ప్రజలు.. చంద్రబాబు ప్రభుత్వంపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఈ ప్రభుత్వాన్ని వేయి కళ్లతో గమనిస్తున్నారు. ప్రభుత్వాలు రాజధర్మాన్ని పాటించాలి. గత ప్రభుత్వంలో లీజుదారులను వెళ్లగొట్టి గనులను కబ్జా చేశారు. వ్యాపారాలను కబళించారు. పోర్టులను చెరపట్టారు. రాష్ట్రంలో న్యాయబద్ధంగా వ్యాపారం చేసుకోవాలన్నా కప్పం కట్టాల్సిన దుస్థితి కల్పించారు. ఇప్పుడు కూటమి నాయకులు కూడా అలాగే వ్యవహరిస్తే ప్రజలు కచ్చితంగా హర్షించరు. నాయకులు, కార్యకర్తలలోనే కాదు ప్రజల్లో కూడా ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయని గుర్తించాలి.

> తెలుగు తమ్ముళ్లూ.. ఇప్పుడు చెప్పండి– జగన్‌రెడ్డి బాటలోనే చంద్రబాబు కూడా పాలెగాడి తరహా పాలన చేయాలా? లేక రూల్ ఆఫ్ లా ప్రకారం వ్యవహరించాలా? అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఎవరైనా రేపు అనేది లేకుండా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ముఖ్యమంత్రి వెనుకాడకూడదు.



> తెలుగు తమ్ముళ్లు ఇప్పుడే ఎందుకు ఇంత అసహనానికి గురవుతున్నారంటే కారణం లేకపోలేదు. జగన్‌రెడ్డి పాలనలో రాజకీయ ప్రత్యర్థులను, ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులను కేసులతో వేధించారు. వారు స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకోలేని పరిస్థితి ఉండింది. పోలీసులు కనీవినీ ఎరుగని రీతిలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. బారా ఖూన్ మాఫీ అన్నట్టుగా ఎవరేమి చేసినా చెల్లుబాటు అయింది. ప్రశ్నించే వెసులుబాటు కూడా లేకుండాపోయింది. ప్రజాస్వామ్యంలో తాను ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రిని మాత్రమే అన్న స్పృహ లేకుండా తాను ఒక చక్రవర్తిలాగా జగన్‌రెడ్డి వ్యవహరించారు. ఇక వైసీపి నాయకులు సామంతుల్లాగా తమ తమ ప్రాంతాలపై ఆధిపత్యం చెలాయించారు. మొత్తంగా రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా లేకుండా చేశారు. వ్యవస్థలు కుప్పకూలిపోయాయి. పగ, ప్రతీకారాలే రాజకీయాలకు పరమావధి అన్నట్టుగా రాజకీయాలకు కొత్త నిర్వచనం ఇచ్చారు. దీంతో నాటి బాధితులు ఇప్పుడు ఇన్‌స్టంట్ జస్టిస్ కోరుకుంటున్నారు.

వారిని కట్టడి చేయాల్సిందే!

గడచిన కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో చోటుచేసుకుంటున్న కొన్ని సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలుగుదేశం, జనసేన నాయకులు, ఎమ్మెల్యేలు గత పాలకుల బాటలోనే వ్యవహరిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. నర్సరావుపేట పార్లమెంటు నియోజకవర్గానికి చెందిన ఒక ఎమ్మెల్యే తన నియోజకవర్గంలోని నాలుగు బార్ల యజమానులను తక్షణమే వాటిని ఖాళీ చేసి తమ మనుషులకు అప్పగించాలని హుకుం జారీ చేశారట. అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ఒక జనసేన ఎమ్మెల్యే ఫార్మా కంపెనీ వాళ్లు తనకు కప్పం కట్టాలని ఆదేశిస్తున్నారట. కడప జిల్లాలో గతంలో మాదిరి భూ కబ్జాలు జరుగుతున్నట్టు సమాచారం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే పనిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉండగా, కూటమికి చెందిన ఎమ్మెల్యేలు ఇలా ప్రవర్తించడాన్ని ఎలా సమర్థించుకుంటారు? వ్యాపారాలు చేసుకొనే వారికి సహకరించాలే గానీ కప్పం కట్టాలని కోరడం ఏమిటి? గత పాలనలో ఇలా జరిగిందనే కదా ప్రజలు ఆ ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో నిమజ్జనం చేశారు! తూర్పు గోదావరి జిల్లాలో ఎన్నో ఏళ్లుగా లేటరైట్ క్వారీలు నడుపుకొంటున్న వారిని గత ప్రభుత్వంలో తరిమేసి వైవీ సుబ్బారెడ్డి కుమారుడు వాటిని చెరబట్టారు. ఇప్పుడు ప్రభుత్వం మారాక సానా సతీష్ అనే ఆయన అదే బాటలో పయనించే ప్రయత్నం చేసినట్టు వార్తలు వచ్చాయి. నెల్లూరు జిల్లాలో ప్రైవేటు భూములలో సిలికా ఇసుక లభిస్తుంది. ఆయా భూ యజమానులు లీజు పొంది సిలికా అమ్ముకొనేవారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక అధికార పార్టీ వాళ్లు యజమానులను తరిమేసి వాటిని కబ్జా చేశారు. చీమకుర్తిలోని గెలాక్సీ గ్రానైట్ గనులు కూడా ఈ కోవలోకే వస్తాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కఠినంగా వ్యవహరించాలి. కబ్జాలకు గురైన గనులను, ఖనిజాలను వాటి యజమానులకు అప్పగించి వారు స్వయంగా వ్యాపారాలు చేసుకోగలిగే పరిస్థితులు కల్పించాలి. ప్రభుత్వ మార్పు మాత్రమే కాదు.. కొత్త ప్రభుత్వంలో ప్రజలు కోరుకుంటున్న మార్పు ఇదే. మంచికి పోతే చెడు ఎదురైందని అంటారు. ఉచిత ఇసుక విషయంలో ఇలాగే జరుగుతోంది. 2014–2019 మధ్య కాలంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఉచిత ఇసుక విధానం అమలు చేసినా విమర్శలపాలయ్యారు. స్పష్టమైన విధానం, అవగాహన లేకుండా లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా ఉచిత ఇసుక అని ప్రకటించడంతో అప్పట్లో రీచ్‌లు అధికార పార్టీ ఎమ్మెల్యేలు, వారి మనుషుల అధీనంలోకి వెళ్లిపోయాయి. ఇసుక లోడింగ్, అన్ లోడింగ్ రవాణా చార్జీలు భరించాల్సి ఉంటుందని చెప్పి ఉంటే విమర్శలకు తావు ఉండేది కాదు. గతంలో అమరావతిలో సచివాలయం, అసెంబ్లీలకు తాత్కాలిక భవనాలు నిర్మించామని అన్నందుకు ఆ మాటను పట్టుకొని చిలువల పలువలు చేశారు. ఏడెనిమిదేళ్లుగా ఉపయోగిస్తున్న ఆ భవనాలను గుడారాలు అంటూ విమర్శించారు. ఇలాంటి అనుభవం దృష్ట్యా ప్రభుత్వం పదాల వాడకంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఎవరైనా రేపు అనేది లేకుండా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెనుకాడకూడదు. ప్రభుత్వం మారినంత మాత్రాన అధికారులు కొత్తగా పుట్టుకురారు. కనుక పూర్తిగా చెడిపోయిన అధికారులను వదిలేసి మిగతావాళ్లకు ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించి వారితోనే పనిచేయించుకోవాలి. ఈ విషయంలో తెలుగు తమ్ముళ్లు కూడా ఆవేశాన్ని తగ్గించుకోవాలి.


..కానివ్వండి ఓదార్చుకోండి!

ఇప్పుడు తెలంగాణ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఢిల్లీలో విలేకరుల సమావేశంలో జగన్మోహన్‌రెడ్డి ఓటమిపై చేసిన వ్యాఖ్యల విషయానికి వద్దాం. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు ముందు జగన్ మళ్లీ అధికారంలోకి వస్తారన్నది తమకున్న సమాచారం అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇప్పుడు జగన్ చిత్తుగా ఓడిపోయి చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరి నెల అయింది. ఈ నేపథ్యంలో తెలంగాణలో తాము కోలుకోవడం ఎలాగో ఆలోచించకుండా జగన్ ఓడిపోవడం ఆశ్చర్యంగా ఉందని, అయినా 40 శాతం ఓట్లు సాధించిన ఆయన హీరో అని కేటీఆర్ సెలవిచ్చారు. తెలంగాణలో తాము జీరోలుగా మారిన విషయం వదిలేసి పక్క రాష్ట్రం వాళ్లను హీరోలని పొగిడితే వచ్చేది ఏమిటో ఆయనకే తెలియాలి. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ పట్ల తండ్రీకొడుకులైన కేసీఆర్‌కూ, కేటీఆర్‌కూ అవ్యాజమైన ప్రేమ ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో రోడ్లు లేవు, కరెంటు లేదని ఒకప్పుడు విమర్శించిన ఇదే కేటీఆర్.. ఇప్పుడు జగన్ ఓటమికి ఆశ్చర్యపోవడం ఎందుకో తెలియదు. తెలంగాణలో తాము ఎందుకు సోయిలో లేకుండా పోయామో సమీక్షించుకోవాల్సింది పోయి జగన్‌పై ప్రేమ ఒలకబోస్తే మరింత నష్టమే తప్ప లాభం ఉండదు. తెలంగాణలో ప్రస్తుతం జీరోగా మారిన కేటీఆర్‌కు ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిలో హీరో కనిపించడం విడ్డూరంగా ఉంది. 2019 ఎన్నికల్లో ఓటమి పాలైన చంద్రబాబుకు కూడా 40 శాతం ఓట్లు వచ్చిన విషయం కేటీఆర్‌కు గుర్తులేదా? ప్రతిరోజూ జనంలో తిరిగిన ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి ఓడిపోవడం ఆశ్చర్యంగా ఉందని కేటీఆర్ అన్న మాటలకు ఆంధ్రప్రదేశ్ మంత్రి, ధర్మవరం నుంచి గెలిచిన తాజా ఎమ్మెల్యే సత్యకుమార్ తగు విధంగా బదులిచ్చారు. జగన్, కేతిరెడ్డి వంటి వారి గురించి కేటీఆర్ వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా సోషల్ మీడియాలో ఒక పోస్టు వచ్చింది. "గాడిద సంగీతానికి ఒంటె ఆశ్చర్యపోతే, ఒంటె అందానికి గాడిద మూర్ఛపోయిందట! ఏం చేద్దాం.. ఒకరినొకరు ఓదార్చుకోండి!!" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. నిజమే కదా! పక్క రాష్ట్రంలో ప్రజలు ఎవరి కుర్చీనో మడతపెడితే దానిపై కేటీఆర్ విశ్లేషణలు ఎవరికి కావాలి? తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి భారత రాష్ట్ర సమితిని కాపాడుకోవడం కేటీఆర్ ప్రస్తుతం చేయాల్సిన పని. ఎన్నికల్లో ఓడిపోయినవారి వ్యాఖ్యలు, విశ్లేషణలకు పెద్దగా విలువ ఉండదని ఆయన ఎప్పుడు తెలుసుకుంటారో?

> నిజానికి కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు అవుతున్నప్పటికీ ప్రభుత్వం ఇంకా కుదురుకోలేదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. జగన్‌రెడ్డి వ్యవహార శైలి కారణంగా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయాయి. మరకలు అంటని అధికారులను గుర్తించడం కష్టంగా మారింది. ఈ కారణంగా అధికారుల నియామకాలలో ముఖ్యమంత్రి ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయినప్పటికీ జగన్ హయాంలో తొత్తుగా వ్యవహరించిన ఫలానా అధికారిని ఎందుకు నియమించారు? అంటూ నిట్టూర్పులు వెలువరిస్తున్నారు. పోలీసు శాఖలో కీలక పదవుల భర్తీకి అనువైన అధికారుల కోసం వెదుక్కోవలసి వచ్చింది. ప్రభుత్వ శాఖల కార్యదర్శుల నియామకం ఇంకా పూర్తికాలేదు. శాఖాధిపతులుగా ఎవరిని నియమించాలో తెలియని పరిస్థితి. జిల్లా కలెక్టర్ల నియామకం కొంతవరకు పూర్తిచేసిన ప్రభుత్వం జిల్లా ఎస్పీల నియామకాన్ని ఈ శనివారం మాత్రమే చేపట్టగలిగింది.

జ్ఞానయోధుడు: సన్నాఫ్ జోగిని చిన్నూబాయి

బ్రిటీష్ పాలకుల వ్యతిరేక ఉద్యమంలో, స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో సవర్ణులతో పాటు దళితులకు సమాన భాగస్వామ్యం ఉందని నిగ్గుతేల్చిన చరిత్రకారుడు జంగం చిన్నయ్య. భారతదేశ భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రభావాలను ఉన్నతీకరిస్తూనే దళిత వేదనను ఆర్ద్రంగా చిత్రించిన జాషువా కావ్యం 'గబ్బిలం'కు 'తల్లి పోలికలు బిడ్డలో ప్రతిఫలించిన' రీతిలో చిన్నయ్య చేసిన ఆంగ్లానువాదం 'Gabbilam: A Dalit Epic'కు ప్రతిష్ఠాత్మక ఎ.కె.రామానుజన్ అనువాద పురస్కారం లభించింది.



జోగినికి పుట్టిన బిడ్డ అంటూ లోకం అతనిని అవమానించింది. అంటరానివాడని ఊరు బాధించింది. పేదరికం వెక్కిరించింది. లెక్కలేని అవమానాలను ధిక్కరించి, కఠోర శ్రమతో, అచంచల కార్యదీక్షతో అతను ముందడుగు వేశాడు. ముళ్ళ తుప్పలను తొక్కుకుంటూ, నెత్తుటి పాదాలతోనే నడక సాగించి వెలివాడ నుండి కెనడాలోని కార్లెటాన్ విశ్వవిద్యాలయం పీఠంపై కాలు మోపాడు. నేడు ఆ జోగినీ పుత్రుడు ప్రఖ్యాత పరిశోధకుడిగా అణగారిన ప్రజల చరిత్రను తిరగరాస్తున్నాడు. తెలుగు దళిత సాహిత్య ఔన్నత్యాన్ని దశదిశలా చాటి చెబుతున్నాడు. ఆ జ్ఞానయోధుడు ద గ్రేట్ సన్నాఫ్ చిన్నూబాయి ప్రొఫెసర్ చిన్నయ్య జంగం. గుర్రం జాషువ గబ్బిలం కావ్యాన్ని (Gabbilam A Dalit Epic) జంగం చిన్నయ్య ఆంగ్లంలోకి అనువదించి ప్రతిష్ఠాత్మకమైన డాక్టర్ ఎ.కె రామానుజన్ అంతర్జాతీయ పురస్కారాన్ని (2024) పొందారు. దక్షిణాసియా దేశాల్లోని లబ్ధప్రతిష్ఠులైన రచయితలతో పోటీపడి ఈ విశిష్ట గౌరవాన్ని అందుకొన్న జంగం చిన్నయ్య ప్రస్థానాన్ని పరిశీలిస్తే మహత్తరమైన స్ఫూర్తి కలుగుతుంది.

జంగం చిన్నయ్య నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో మాదిగ కుటుంబంలో చిన్నూబాయికి జన్మించాడు. బాల్యంలో పోలియో బారిన పడిన చిన్నూబాయిని ఊరిపెద్దలు జోగినిగా మార్చారు. ఆమె ఆ దురాచార సర్పపరిష్వంగంలో నలిగిపోయింది. ఐదేళ్ల ప్రాయం నుండే భూస్వాముల పశువులకొట్టంలో జీతగాడిగా బందీ అయిన చిన్నయ్య దొరల బిడ్డల్లా తానూ చదువుకోవాలని ఆరాటపడ్డాడు. బిడ్డను చదివించాలనే ధ్యేయంతో పాఠశాలకు వెళ్ళిన చిన్నూబాయికి, చిన్నయ్య తండ్రి పేరు చెబితేనే ప్రవేశం లభిస్తుందని హెడ్‌మాస్టర్ ఒత్తిడిచేయడంతో చివరకు పోచయ్య అనే తన బావ పేరునే తండ్రి పేరుగా రాయించింది ఆమె. బాలకూలిగా పనిచేస్తూనే తెలివైన విద్యార్థిగా రాణిస్తున్న తన బిడ్డను చూసి చిన్నూబాయి మురిసిపోయింది. ఇంతలోనే పాము కాటుకు బలై చిన్నుబాయి చనిపోవడంతో చిన్నయ్య, అతని చెల్లి సుజాత అనాథలయ్యారు. ఆ తరువాత, చిన్నమ్మ భూదేవి ఆదరణ, ఉపాధ్యాయుడు షేక్ మన్నన్ సలహాతో ఉప్పలవాయి పాఠశాలలో హైస్కూల్ విద్యనభ్యసించి, ఉట్నూరులోని గురుకుల జూనియర్ కళాశాలలో చిన్నయ్య ఇంటర్ పూర్తిచేశాడు. తరువాత చిన్నయ్యను ఉట్నూరు సబ్ కలెక్టర్ డాక్టర్ పి.వి రమేశ్ దంపతులు చేరదీసి కన్నబిడ్డలా ఆదరించారు. వారు అతనిని ఉన్నత విద్యవైపు మళ్ళించారు. నాగార్జున సాగర్ గురుకుల డిగ్రీ కళాశాలలో బి.ఏ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎం.ఎ(హిస్టరీ) పూర్తిచేసి, ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్. పరిశోధన చేశాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్ర శాఖలో కొంతకాలం సహాయ ఆచార్యుడిగా పాఠాలు బోధించాడు. అనునిత్యం శ్రమించి ప్రఖ్యాత సంస్థల ఫెలోషిప్ సాధించి లండన్, న్యూయార్క్ యూనివర్సిటీలలో పిహెచ్.డితో పాటు పోస్ట్ డాక్టరేట్ చేశాడు. ప్రస్తుతం జంగం చిన్నయ్య కెనడాలోని కార్లెటాన్ యూనివర్సిటీలో చరిత్ర ఆచార్యుడు.


ఒక మారుమూల గ్రామం నుండి వచ్చిన చిన్నయ్య ఆంగ్లభాషపై అపారమైన పట్టుసాధించి, ప్రపంచంలోనే ప్రథమశ్రేణి విద్యాసంస్థల్లో విద్యనభ్యసించి ప్రత్యామ్నాయ చరిత్రకారుడిగా, ప్రభావశీలమైన పరిశోధకుడుగా ఎదిగిన తీరు ఆదర్శనీయం. వేటగాళ్ళు చెప్పే పిట్టకథలను తోసిరాజని సింహం తన వీరోచిత చరిత్రను రాసుకున్నట్లుగా దేశ సంస్కృతికి, నాగరికతకు నడకలు నేర్పిన దళితుల చరిత్రను చిన్నయ్య తవ్విపోస్తున్నాడు. భారత జాతీయోద్యమ పర్యవసానాల గురించి ఎంఫిల్ చేద్దామనుకున్న చిన్నయ్య కంచె ఐలయ్య సూచనతో దళితుల చరిత్ర వైపు దృష్టి సారించాడు. అణగారిన జాతుల మహా చరిత్రని వేయి కన్నులతో పరిశీలించి 'Dalits and the Making of Modern India' అనే గ్రంథాన్ని వెలువరించాడు. ఈ గ్రంథాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ప్రచురించడం విశేషం. 'Social and Intellectual History of Dalits in Modern South Acia' పేరుతో చిన్నయ్య రచించిన మరొక పరిశోధన గ్రంథం సుప్రసిద్ధ చరిత్రకారుల దృష్టిని ఆకర్షించింది. భారతీయ చరిత్రలోని విస్మృత కోణాలను చిన్నయ్య తన రచనల్లో ఆవిష్కరించాడు. బ్రిటీష్ పాలకుల వ్యతిరేక ఉద్యమంలో, స్వతంత్ర భారతదేశ నిర్మాణంలో సవర్ణులతో పాటు దళితులకు సమాన భాగస్వామ్యం ఉందని చిన్నయ్య నిగ్గుతేల్చాడు. సామాజికపరమైన, మేధోపరమైన దళితుల కృషిని, వారు సాగించిన రాజకీయ, పోరాటాల తీరుతెన్నులను ప్రామాణికంగా తన గ్రంథాల్లో విశ్లేషించాడు. నైతిక, సమానత్వంతో కూడిన సమాజ ఆవిర్భావానికి కులనిర్మూలన పోరాటమే ఆలంబనగా నిలుస్తుందని పరిశోధనా పత్రాల్లో చిన్నయ్య ప్రతిపాదించాడు.

తెలుగు ప్రాంతంలోని దళితుల సామాజిక, సాంస్కృతిక, సాహిత్య చరిత్ర స్వరూప స్వభావాలను చిన్నయ్య ఎంతో ఆసక్తిదాయకంగా వివరించాడు. కుసుమ ధర్మన్న, జాలా రంగస్వామి, మంగమ్మ, తాడి నాగమ్మ, గ్యార ప్రేమయ్య, వాగిరి ఆమోసు లాంటి తొలితరం దళిత సంస్కర్తల, రచయితల నిరుపమాన కృషిని ఆయన లోకానికి పరిచయం చేశాడు. పాఠశాలలో గుర్రం జాషువా పద్యాలు విని, ప్రేరణపొందిన చిన్నయ్య, దళిత ఉద్యమ చరిత్రను అధ్యయనం చేసే క్రమంలో జాషువ గబ్బిలం కావ్యాన్ని అర్థం చేసుకొని అందులో తనను తాను చూసుకున్నాడు. కుల, మత, లింగ, జాతి వివక్షలను వ్యతిరేకిస్తూ వెలువడిన సాహిత్యం అత్యంత శక్తిమంతమైనదని, ఈ విధమైన రచనలను ఆంగ్లంలోకి అనువదిస్తే ఎంతోమందికి గొప్ప ప్రేరణగా నిలుస్తుందని భావించాడు. అప్పుడే తనకిష్టమైన గబ్బిలం కావ్యం చిన్నయ్య మదిలో మెదిలింది.

జాతీయోద్యమ కాలధర్మాన్ని, తన అస్తిత్వ చైతన్యంతో సమన్వయించి, జాషువా గబ్బిలం కావ్యం రచించాడు. భారతదేశ భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక వైభవ ప్రభావాలను ఉన్నతీకరిస్తూనే దళిత వేదనను ఆర్ద్రంగా చిత్రించటం వల్ల ఈ కావ్యం ఒక క్లాసిక్‌గా మిగిలింది. చిన్నయ్య చరిత్ర విద్యార్థి అయినా గబ్బిలం కావ్యాన్ని అధ్యయనం చేసి, రెండు సంవత్సరాల పరిశ్రమతో ఆంగ్లంలోకి అనువదించాడు. దార్శనిక దృష్టితో గబ్బిలం కావ్యాన్ని దళిత ఇతిహాసంగా ఆయన పేర్కొన్నాడు. ఛందోబద్ధమైన భావధారను కవితాత్మక, ప్రతీకాత్మకమైన అభివ్యక్తులను సామాజిక, ప్రాదేశికపరమైన పరిభాషను నుడికారాలను, ఆంగ్లంలోకి అనువదించటం అత్యంత కష్టమైనా సాహితీవేత్తల సహకారంతో చిన్నయ్య ఈ బృహత్కార్యాన్ని సముచితంగా నిర్వహించాడు. వర్ణవ్యవస్థను ఆదర్శీకరించిన ప్రాచీన తెలుగు సాహిత్య రాజకీయాల వైఖరిని, గబ్బిలం చారిత్రక నేపథ్యాన్ని వివరించటంతో పాటు, రాజ్యాంగ నైతికతను, ఆత్మగౌరవాన్ని, కులనిర్మూలనా దృష్టిని ప్రబోధించే సాహిత్య ఆవశ్యకతను Dalit Epic గ్రంథ పీఠికలో ఈ రచయిత విశ్లేషణాత్మకంగా తెలియజేశాడు. ముఖ్యంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో జాషువా నిర్వహించిన పాత్రను, ఆయన స్థానాన్ని సూక్ష్మ పరిశీలనతో పీఠికలో నిర్ధారించాడు. జెరాక్స్ కాపీలా కాకుండా తల్లి పోలికలు బిడ్డలో ప్రతిఫలించిన శైలితోనే గబ్బిలం అనువాదం సాగింది. చిన్నయ్య అనువాద గ్రంథానికి ఎకె రామానుజం బహుమతి లభించటం అత్యంత సమంజసం. భారతీయ సంప్రదాయ సాహిత్యాన్ని అనువాదం చేసి గతంలో ఎక్కువమంది రచయితలు ఈ పురస్కారాన్ని అందుకోగా, దళిత నేపథ్యం కలిగిన గ్రంథం ద్వారా చిన్నయ్య ఈ అరుదైన గౌరవాన్ని పొందారు.

తెలుగు రాష్ట్రాల్లోని వివిధ విశ్వవిద్యాలయాల్లో జంగం చిన్నయ్య రచనలను పాఠ్యాంశాలుగా చేరిస్తే నిజమైన చరిత్ర నిర్మాతలెవరో ఈ తరానికి బోధపడుతుంది. ప్రపంచాన్ని గెలిచిన జంగం చిన్నయ్య జీవిత కథను పాఠశాల చిన్నారులకు ఉపవాచకంగా నిర్ణయిస్తే, చిన్న కష్టాన్ని కూడా ఎదుర్కొనే ధైర్యం లేక క్షణికావేశంతో ఆత్మహత్య దిశగా అడుగులు వేస్తున్న విద్యార్థులకు గుణపాఠంగా నిలుస్తుంది.

■ డాక్టర్ కోయి కోటేశ్వరరావు
తెలుగుశాఖ అధ్యక్షులు, ప్రభుత్వ సిటీ కళాశాల





బెంజిసర్కిల్ వద్ద జోరువానలో వాహనదారుల పాట్లు



తడిపేసిన వాన

నగరాన్ని వర్షం తడిపేసింది. శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసినప్పటికీ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ చినుకులు పడ్డాయి. దీంతో నగరంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.



రెండోరోజూ జూడాల నిరసన

ప్రభుత్వాసుపత్రి, జూలై 13 : నగరంలోని ప్రభుత్వాసుపత్రిలో జూడాలు రెండోరోజూ శనివారం కూడా నిరసన తెలిపారు. వర్షంలోనే కొత్త ప్రభుత్వాసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అత్యవసర విభాగ సేవలు మినహా విధులను బహిష్కరించారు. జూడాలపై దాడి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిలో సెక్యూరిటీ సిబ్బందిని పెంచాలని డిమాండ్ చేశారు.

ఫ్యాక్టరీలపై ఏదీ పర్యవేక్షణ?

ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావిడి

- నిబంధనలు పాటించని యాజమాన్యాలు
- గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు

పకడ్బందీ చర్యలు కోరుతున్న కార్మికులు

4లో..



బాధ్యతలు స్వీకరించిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న కొత్త సీపీ రాజశేఖర్‌బాబు

ఈ-పోలీసింగ్‌కు ప్రాధాన్యం

ఈ-బీట్స్, ఎల్‌హెచ్ఎంఎస్‌ను అమలుచేస్తాం

- ఈ-చలాన్, గ్రీవెన్స్ సెల్‌పై ప్రత్యేక దృష్టి
- కొత్తగా సైబర్ కమాండర్ల ఏర్పాటు
- యువతకు సైబర్ వారియర్స్‌గా శిక్షణ
- మహిళా భద్రతకు ప్రత్యేక కార్యాచరణ
- కొత్త పోలీస్ బాస్ రాజశేఖర్‌బాబు

విజయవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : టెక్నాలజీని ఉపయోగించి పోలీసు వ్యవస్థను మరింత పటిష్టం చేస్తామని కొత్త పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు స్పష్టం చేశారు. సీపీగా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న అనంతరం కమిషనరేట్‌కు చేరుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత డీసీపీలు, ఏసీపీలను పరిచయం చేసుకున్నారు. అనంతరం సమావేశ మందిరంలో మీడియాతో మాట్లాడారు. ప్రజల్లో నమ్మకం, భరోసా కల్పిస్తామని, పోలీసింగ్‌లో వినూత్న విధానాలు అమలు చేస్తామని పేర్కొన్నారు. రాజధానికి చెంతనే ఉండటం వల్ల నగరంలో ట్రాఫిక్ ప్రధాన సమస్యగా ఉందని, ఈ సమస్యకు పరిష్కార మార్గాలను చూపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ-చలాన్ విధానాన్ని, గ్రీవెన్స్ సెల్‌ను పటిష్టంగా అమలు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం టెక్నాలజీని ఉపయోగించి ఫిర్యాదు చేసుకునే అవకాశం ఉందని, టోల్‌ఫ్రీ, సిటిజన్ పోర్టల్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు. నగరంలో ప్రస్తుతం 1,800 సీసీ కెమెరాలు ఉన్నాయన్నారు. వాటి సంఖ్యను మరింత పెంచాలని సీపీ అభిప్రాయపడ్డారు. గంజాయి, డ్రగ్స్ గొలుసుకట్టును తెంచేస్తామన్నారు. ప్రస్తుతం యాంటీ నార్కోటిక్ సెల్‌కు ఒక టోల్‌ఫ్రీ నెంబర్‌ను కేటాయించారన్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించి ప్రత్యేకంగా ఒక టోల్‌ఫ్రీ నెంబర్‌ను కేటాయిస్తామన్నారు. డ్రగ్స్ వ్యవహారాల్లో అసలు కింగ్‌పిన్‌లను బయటకు లాక్కొస్తామని కొత్త సీపీ స్పష్టం చేశారు. మహిళల భద్రతకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. మహిళలపై నేరాలు జరిగే ప్రదేశాలను గుర్తించి, వాటిని జియో ట్యాగింగ్ చేస్తామన్నారు. మహిళలు, అమ్మాయిల అదృశ్యానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును ప్రారంభిస్తామన్నారు. మూలనపడిన ఈ-బీట్ విధానాన్ని, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్‌ను బయటకు తీస్తామని పేర్కొన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌ను అమలు చేయడం ద్వారా ప్రజలకు చేరువవుతామన్నారు. సైబర్ నేరాల దర్యాప్తునకు సైబర్ కమాండర్లను ఏర్పాటు చేస్తామన్నారు. టెక్నాలజీపై పట్టున్న సిబ్బందిని కమాండర్లుగా నియమిస్తామన్నారు. యువతకు సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించి, వారియర్స్‌గా నియమిస్తామని, సైబర్ నేరాల బారిన పడకుండా వారితో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం సీపీ ఉండవల్లిలో సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

దుర్గమ్మ సన్నిధిలో..

కొత్త సీపీ రాజశేఖర్‌బాబు దంపతులు దుర్గమ్మను దర్శించుకున్నారు. అలాగే, రిలీవ్ అయిన సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ కూడా దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. వారికి ఈవో రామారావు స్వాగతం పలికి, దర్శనం చేయించారు.

నగర డీసీపీగా గౌతమీశాలి

కమిషనరేట్‌లో ఇద్దరు డీసీపీల బదిలీ

విజయవాడ, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : విజయవాడకు కొత్త డీసీపీ రాబోతున్నారు. డీసీపీ-1గా అనంతపురం జిల్లా ఎస్పీ గౌతమీశాలిని నియమించారు. రాష్ట్రంలో 37 మంది ఎస్పీలను ప్రభుత్వం బదిలీ చేసింది. అందులో భాగంగా కమిషనరేట్‌లో ఉన్న డీసీపీ-1 అధిరాజ్‌సింగ్ రాణా, రూరల్ డీసీపీ కంచి శ్రీనివాసరావును బదిలీ చేశారు. అధిరాజ్‌సింగ్ రాణాను నంద్యాల ఎస్పీగా నియమించారు. కంచి శ్రీనివాసరావుకు పల్నాడు ఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. అధిరాజ్‌సింగ్ రాణా స్థానంలో గౌతమీశాలికి పోస్టింగ్ ఇచ్చారు.

ఉద్యోగాల పేరిట టోకరా..!

విదేశాల్లో ఉద్యోగాలపై ఆశతో వందలాది మంది పట్టభద్రులు నకిలీ కన్సల్టెన్సీల బారిన పడి మోసపోతున్నారు. తాజాగా నగరంలోని బ్రైట్ కెరియర్ గ్రూపు సంస్థ బారినపడి సుమారు 200 మంది నిరుద్యోగులు రూ.2 కోట్ల పైచిలుకు నష్టపోయారు.



గాంధీనగర్‌లోని బ్రైట్ కెరియర్ గ్రూపు కార్యాలయం

నగరంలో బోర్డు తిప్పేసిన మరో కన్సల్టెన్సీ

- నిరుద్యోగులే లక్ష్యంగా రూ.2 కోట్లు లూటీ
- ఉమ్మడి కృష్ణాలో 200 మందికిపైగా బాధితులు
- బ్రైట్ కెరియర్ పేరుతో గాంధీనగర్‌లో కార్యాలయం
- పదిరోజుల కిందట మూసివేత, ఫోన్లు స్విచ్ఛాఫ్

లబోదిబోమంటున్న బాధితులు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ఏడాది కిందట గాంధీనగర్‌లో బ్రైట్ కెరియర్ గ్రూపు పేరుతో ఓ కన్సల్టెన్సీ వెలిసింది. ఈ గ్రూపు సీఈవో విష్ణుచౌదరి, మేనేజర్లు విజయేంద్రసింగ్, ఆకాశ్‌సింగ్ స్థానికులు ఏడుగురిని ఉద్యోగులుగా నియమించుకున్నారు. నెదర్లాండ్‌లోని ఆర్కో ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నెలకు 3,000 యూరోలు (భారతీయ కరెన్సీలో రూ.2,89,000) ఇప్పిస్తామని వీరు నిరుద్యోగులకు ఆశ చూపారు. ఏపీ, తెలంగాణాకు చెందిన సుమారు 500 మంది వీరి బారినపడి మోసపోయినట్లు సమాచారం. ఉమ్మడి కృష్ణాజిల్లావాసులు సుమారు 200 మంది వరకు ఉన్నారు. నిరుద్యోగులు ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష వరకు వసూలు చేశారు. ఒక్క ఉమ్మడి కృష్ణాజిల్లాలోని నిరుద్యోగుల నుంచే సుమారు రూ.2 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. డబ్బు వసూలు చేశాక పది రోజుల క్రితం సంస్థ ప్రతినిధులు బోర్డు తిప్పేశారు. హెల్త్ చెకప్‌లు, ఫిజికల్ టెస్టులు అంటూ హడావిడి చేశారు. డబ్బు వసూలు చేసి, త్వరలో కాల్ లెటర్లు వస్తున్నాయంటూ మభ్యపెట్టి తమను మోసం చేశారని బాధితులు వాపోయారు. ప్రస్తుతం కార్యాలయాన్ని మూసేశారని, ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నకిలీ కన్సల్టెంట్లపై నిఘా ఏదీ?

నకిలీ కన్సల్టెంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి నిరుద్యోగులను మోసం చేస్తున్నా వాటిపై సరైన పర్యవేక్షణ ఉండట్లేదు. దీంతో వేలాది మంది నిరుద్యోగులు మోసపోతున్నారు. సుమారు రెండేళ్ల క్రితం విజయవాడలో నకిలీ కన్సల్టెంట్ల వరుస మోసాలు వెలుగు చూశాయి. డయిల్ ఇన్‌స్టిట్యూట్ పేరుతో బందరు రోడ్డులో కార్యాలయం ఏర్పాటుచేసి అమెరికా, ఇంగ్లండ్, దుబాయి, మలేషియాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఓ సంస్థ బోర్డు తిప్పేసింది. నిరుద్యోగులు ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల చొప్పున వసూలు చేసి అప్పట్లో సుమారు 100 మంది నిరుద్యోగులను నిలువునా ముంచేశారు. 2022, డిసెంబరులో ఈ మోసం బయటపడింది. అప్పట్లో నిరుద్యోగులు సూర్యారావుపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే ఏడాది ఏప్రిల్‌లో స్ప్రింగ్‌ఫీల్డ్ ఓవర్సీస్ కన్సల్టెంట్ పేరుతోనూ మోసాలు వెలుగుచూశాయి. నకిలీ సర్టిఫికెట్లతో తెలుగు విద్యార్థులను విదేశాలకు పంపుతున్న ఈ సంస్థ గుట్టును ఢిల్లీ పోలీసులు రట్టు చేశారు. 2023, జనవరిలో చెన్నైలోని ఓ జాబ్ కన్సల్టెన్సీ సంస్థ విజయవాడకు చెందిన ఓ మహిళకు విదేశాల్లో సాఫ్ట్‌వేర్ జాబ్ ఇప్పిస్తామని చెప్పి రూ.2.50 లక్షలకు టోకరా వేసింది. నకిలీ కన్సల్టెన్సీలపై పోలీసులు నిఘా ఏర్పాటు చేయాలని, వాటి నిర్వాహకులు ఎవరు?, వారికి నిజంగానే విదేశీ సంస్థలతో ఒప్పందాలు ఉన్నాయా? వంటి అంశాలను పరిశీలిస్తే ఇలాంటి మోసాలు చోటుచేసుకోవని నగరానికి చెందిన ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు పేర్కొన్నారు. కాగా, బ్రైట్ కెరియర్ గ్రూపు బాధితులకు న్యాయం జరిగే వరకు ఆందోళన చేపడతామని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు లంకా గోవిందరాజులు తెలిపారు.

రూ.75 వేలు చెల్లించాను



నేను బీటెక్ చేశాను. నా స్నేహితుడు చెప్పడంతో ఈ సంస్థ ప్రతినిధులను కలిశాను. నెదర్లాండ్స్‌లో ఉద్యోగాలు ఉన్నాయని చెప్పారు. తొలి విడతగా రూ.75 వేలు కట్టాను. జూలై 15న వీసా స్టాంపింగ్ చేస్తానని చెప్పారు. అప్పుడు మరో రూ.75 వేలు ఇవ్వాలన్నారు. కానీ, 10 రోజులుగా ఆఫీసు మూసేశారు. సంస్థ ప్రతినిధులు ఫోన్లు స్విచ్చాఫ్ చేశారు. నిర్వాహకులను పట్టుకుని మరోసారి మాలాంటి నిరుద్యోగులను మోసం చేయకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలి. **- ఆదిత్య, విజయవాడ**



దుర్గమ్మ పూలతో అగరుబత్తీలు

తిరుమల తరహాలో తయారీ

ఆర్జిత సేవలు, అలంకరణకు వాడిన పుష్పాలతో..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానంలో స్వామి వారికి అలంకరించే ఆర్జిత సేవలకు వాడే పూలను, తులసిని వినియోగించి అగరుబత్తీలు తయారు చేసి విక్రయిస్తున్నారు. దాన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో అదే విధానాన్ని అనుసరిస్తున్నారు. నగరంలో కొలువుదీరిన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో సైతం అమ్మవారికి అలంకరించే పుష్పాలు, తులసిమాలలను ఒకప్పుడు వ్యర్థంగా పడేసేవారు. ఇప్పుడు వాటితో అగరుబత్తీలను తయారు చేస్తున్నారు. అమ్మవారికి వినియోగించిన పూలను బహిరంగ వేలం నిర్వహించి తద్వారా దేవస్థానానికి ఆదాయం దక్కేలా చేస్తున్నారు. పుష్పాలను, తులసి దండలను మూడు రోజులు ఎండబెట్టి, ఆ తర్వాత యంత్రం ద్వారా పొడిగా మార్చి అందులో సుగంధద్రవ్యాలు జిగురు మిశ్రమంగా చేసి అగరుబత్తీలు, దూప్‌స్టిక్‌లుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. ఇంద్రకీలాద్రి, ముద్దమల్లి, శ్రీకామధేనువు, స్వచ్ఛ సంపంగి, నాగవల్లి, పారిజాత పరిమళం, శ్రీచందనం, త్రిశూల్ పేరుతో ఎనిమిది రకాల అగరుబత్తులను అమ్ముతున్నారు.

కొడాలి నాని సన్నిహితుడి బంకులో కల్తీ పెట్రోలు విక్రయం



సగం నీటితో ఉన్న పెట్రోల్ బాటిల్‌ను చూపిస్తున్న వాహనదారుడు

మొరాయించిన వాహనాలు..

వాహనదారుల్లో ఆందోళన

- బాటిల్ పెట్రోలులో సగానికిపైగా నీళ్లే..
- కొంచెం దూరం వెళ్లి ఆగిపోయిన బైకులు
- చీకట్లో ఇబ్బందులు పడిన ద్విచక్రవాహనదారులు
- కొడాలి సన్నిహితుడు కీర్తికుమార్ బంకులో ఘటన

4లో..

గుండెల్లో రైళ్లు



విజయవాడ రైల్వే డివిజన్‌పై సీబీఐ దృష్టి

- గుంటూరు, గుంతకల్లు డివిజన్లలో ఇప్పటికే దాడులు
- విజయవాడ డివిజన్‌లో వేళ్లూనుకున్న అవినీతి
- వరుస దాడులతో ఇక్కడి అధికారుల్లో బెంబేలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : దశాబ్దకాలంగా విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో వేళ్లూనుకున్న అవినీతి రారాజులపై సీబీఐ వద్ద పూర్తి సమాచారం ఉందని తెలుస్తోంది. ఈ మేరకు సీబీఐకి కొన్ని ఫిర్యాదులు కూడా వెళ్లాయి. ప్రధానంగా రైల్వే కమర్షియల్ విభాగంలో కొందరు అవినీతి అధికారులపై సీబీఐకి ఫిర్యాదులు వెళ్లినట్టు తెలుస్తోంది. రైల్వే కమర్షియల్ విభాగంలో దశాబ్దకాలానికిపైగా జరుగుతున్న వ్యవహారాలు, రైల్వేస్టేషన్ కేంద్రంగా సాగుతున్న అక్రమాలపై పూర్తి సమాచారం ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో వరుస సీబీఐ దాడులతో విజయవాడ రైల్వే డివిజన్ కమర్షియల్ విభాగంలోని కొందరు అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

పక్కా 'కమర్షియల్'

విజయవాడ డివిజన్‌లో రైల్వే కమర్షియల్ విభాగంలోని కొందరు అధికారులు కాంట్రాక్టర్ల నుంచి మామూళ్లు తీసుకోవటం దశాబ్దకాలంగా జరుగుతోంది. రైల్వే అధికారులు బదిలీ అయినా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఒకప్పుడు విజయవాడలో అవినీతి రాజ్యమేలిన కమర్షియల్ అధికారి ఒకరు గుంతకల్లు వెళ్లారు. అక్కడ జరిగిన సీబీఐ దాడుల్లో సదరు అధికారి పట్టుబడతారని అందరూ భావించారు. ప్రస్తుతం విజయవాడలో ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తున్న అధికారులు కొందరున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్‌ను అడ్డాగా చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా పాసింజర్ రైళ్లలో గూడ్స్‌ను తరలిస్తున్నారు. వీరిపై కేసులు రాయటానికి వీల్లేదు. కేసులు రాసిన టీటీపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేయటంతో పాటు వారిపై చర్యలు తీసుకునే పరిస్థితి ఇక్కడ ఉంది. దీంతో రైల్వేస్టేషన్ కేంద్రంగా కొందరు ప్రైవేట్ వ్యక్తులు రైల్వే సిబ్బందిని ఎదిరించే స్థాయి దాటి, బెదిరించే వరకు వెళ్లారు. పాసింజర్ రైళ్లలో నిషేధిత వస్తువులు రవాణా చేసినవారు కూడా ఉన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రమాదం కలిగించే వస్తువులను రవాణా చేసే వారికి కమర్షియల్ విభాగంలోని కొందరు అధికారులు సహకరిస్తున్నారు.

బెజవాడ రైల్వే డివిజన్‌లో భారీ ఎత్తున వస్తున్న అవినీతి ఆరోపణలపై సీబీఐ దృష్టి సారించినట్టు తెలుస్తోంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు, గుంతకల్లు డివిజన్లలో అవినీతి రైల్వే అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సీబీఐ తాజాగా విజయవాడ రైల్వే డివిజన్‌పై కూడా దృష్టి సారించిందని సమాచారం.

స్టాళ్ల కేటాయింపులో అవినీతి

విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఫుడ్ స్టాళ్ల కేటాయింపుల్లో భారీ ఎత్తున అవినీతి జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. టెండర్లలో షాపులు దక్కించుకున్నవారు సబ్ కాంట్రాక్టులకు ఇచ్చేస్తున్నారు. తనిఖీలు పెద్దగా ఉండవు. ఎప్పుడైనా తనిఖీలు జరిపితే తమ గుమాస్తాలు ఉన్నారని చెబుతారు. స్టాళ్లలో ఎంతమంది గుమాస్తాలు ఉంటారు? ఎంతమందికి రైల్వే అధికారులు అనుమతులిచ్చారు? ఎంతమంది సిబ్బందికి అనుమతించారు? కాంట్రాక్టు సంస్థ ఎంతమందిని నియమించుకుంది? వంటి వివరాలు ఎవరికీ తెలియవు. వీటిని పరిశీలిస్తే.. దొంగలెవరనేది తేలిపోతుంది. కానీ పట్టించుకునేవారు లేరు. కమర్షియల్ విభాగంలోని అధికారుల అండదండలు ఉండటం వల్ల ఇతర రైల్వే సిబ్బంది వీరిపై చర్యలు తీసుకోవటానికి సహకరించట్లేదు. స్టాళ్ల కేటాయింపుల్లో అడ్డగోలు వ్యవహారాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. తమ వ్యాపారాల్లో కొంత వాటా ఇచ్చే వారితో కొంతమంది అధికారులు టెండర్లు వేయిస్తున్నారనేది అందరికీ తెలిసిన విషయమే. టెండర్లలో మిగిలిన సంస్థలకు అది లేదు.. ఇది లేదు.. అని చెప్పి, వారిని అనర్హతకు గురి చేసి, తాము అనుకున్న వారికి కట్టబెట్టేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఇంజనీరింగ్ పనుల్లో చేతివాటం

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులకు సంబంధించి కూడా కమీషన్లు తీసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఆర్వీఎన్ఎల్ చేపట్టే పనులు కూడా సబ్ కాంట్రాక్టులకు వెళ్లిపోతున్నాయని, ఈ ముసుగులో భారీ ఎత్తున అవినీతికి పాల్పడుతున్నారని చెబుతున్నారు. రైల్వే ఆసుపత్రిలో రిఫరల్ ఆసుపత్రులకు సిఫార్సు చేయటంలోనూ, వాటికి బిల్లులు చెల్లించే విషయంలోనూ అవినీతి వ్యవహారాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. గతంలో రైల్వే హాస్పిటల్ అక్రమాలపై సీబీఐ తనిఖీలు కూడా నిర్వహించింది. అలాగే, మందుల కొనుగోళ్లలో కూడా గోల్‌మాల్ వ్యవహారాలు జరిగాయి.

ఫ్యాక్టరీలపై ఏదీ పర్యవేక్షణ?

- ప్రమాదాలు జరిగినప్పుడే అధికారుల హడావుడి
- ఆ తర్వాత అంతా గప్‌చుప్.. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలంటున్న కార్మికులు

కర్మాగారాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే ఆయా శాఖల అధికారులు ఆగమేఘాలపై అక్కడకు రావడం, హడావుడి చేయటం తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై ప్రెస్‌మీట్ పెట్టడం, వెళ్లిపోవడం జరుగుతోందని, అక్కడితోనే బాధ్యత తీరిందని అధికారులు చేతులు దులుపుకొని వెళ్లడం పరిపాటిగా మారిందని కార్మికులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల జరిగిన ఆల్ట్రాటెక్ కర్మాగార ప్రమాద ఘటనలో యాజమాన్యం నిర్లక్ష్యమా.. ప్రభుత్వ శాఖల వైఫల్యమా తేల్చాలని నిలదీస్తున్నారు. నిబంధనలు పాటించని కర్మాగారాల యాజమాన్యాలతో అధికారులు లాలూచీ పడుతున్నారని ఇది కార్మికుల పాలిట శాపంగా మారుతోందని ఆరోపిస్తున్నారు.

జగ్గయ్యపేట రూరల్, జూలై 13: జగ్గయ్యపేట ప్రాంతంలో పలు సిమెంట్, రసాయన, లైట్‌వెయిట్ సిమెంట్, అల్యూమినియం, ప్లాస్టిక్ కర్మాగారాలున్నాయి. ఈ కర్మాగారాల్లో స్థానికులకంటే ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా పని చేస్తుంటారు. వారి వివరాలు సేకరించాల్సిన బాధ్యత కార్మికశాఖపై ఉంది. కానీ ఆ పని సరిగా చేయకపోవడంతో ప్రమాదం జరిగినప్పుడు కార్మికుల వివరాలు తెలియక ఇబ్బంది పడుతున్నారు. పరిశ్రమలను పరిశ్రమల శాఖ, పొల్యూషన్, మైనింగ్, విద్యుత్, ఫారెస్ట్, రెవెన్యూ, మెడికల్, రవాణా శాఖలు పర్యవేక్షించాల్సి ఉంది. క్షేత్రస్థాయి అధికారులు కర్మాగారాల యాజమాన్యాలతో అంటకాగుతూ క్షేత్రస్థాయిలో పరిశీలన చేయకుండానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందిస్తున్నారని, దీంతో తమకీ దుస్థితి దాపురిస్తోందని కార్మికులు వాపోతున్నారు. ప్రధానంగా పర్యవేక్షించాల్సిన ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్లకు యాజమాన్యాలు రెడ్‌కార్పెట్ వేసి స్వాగతం పలుకుతాయని, ఆయా శాఖలకు చెందిన అధికారులు ఈ ప్రాంతం గుండా వెళితే అతిథి గృహాల్లో సకల సౌకర్యాలు కల్పిస్తారని కార్మికులు చెబుతున్నారు. ఫ్యాక్టరీల్లో ప్రమాదం జరిగితే ఆయా శాఖల అధికారులను బాధ్యులను చేస్తే తమ కుటుంబాల్లో వెలుగులు నింపిన వారవుతారని అంటున్నారు. కార్మికులు ప్రాణాలు కోల్పోయినా, దివ్యాంగులుగా మారినా అందించే నష్టపరిహారం తమ కుటుంబాలకు సంతోషాన్ని ఇవ్వదని ఇప్పటికైనా నిబంధనలు పాటించని యాజమాన్యాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపి కంపెనీలు సక్రమంగా నడిచేలా చూడాలని కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికి కర్మాగారాల సహకారం శూన్యం

అటవీశాఖకు చెందిన వేలాది ఎకరాల్లో జగ్గయ్యపేట ప్రాంతంలో మైనింగ్ జరుగుతోంది. ఈ మైనింగ్ ప్రాంతాల్లోకి సామాన్యులను కర్మాగారాల యాజమాన్యాలు వెళ్లనీయవు. ఇష్టారాజ్యంగా పర్యావరణాన్ని దెబ్బతీస్తూ కోట్ల విలువ చేసే భూగర్భ సంపదను దోచుకెళ్తున్న కర్మాగారాలు ఆయా గ్రామాల అభివృద్ధికి మాత్రం ఎటువంటి సహకారం అందించటం లేదని స్థానికులు చెబుతున్నారు.



మూసేసిన దుర్గగుడి ఘాట్‌రోడ్డు గేట్లు

దుర్గగుడి ఘాట్‌రోడ్డు మూసివేత

వన్‌టౌన్, జూలై 13: రెండురోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగిపడే అవకాశం ఉండడంతో భక్తుల భద్రత నిమిత్తం ముందుజాగ్రత్తగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, ఇంజనీరింగ్ అధికారులు ఘాట్‌రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి కొండపైకి వాహనాల్లో వెళ్లిన భక్తులను ఉదయం 10గంటలకు కొండ దిగువకు పంపేసి ఘాట్‌రోడ్డును మూసేశారు. కెనాల్ రోడ్డు, వీఎంసీ కార్యాలయం ఎదురుగా ఉన్న దేవస్థానం పార్కింగ్ ప్రదేశాల్లో కార్లను నిలుపుకోవాలని మైకు ద్వారా ప్రచారం చేశారు. ఘాట్‌రోడ్డు ద్వారా భక్తులను అనుమతించకపోవడంతో కనకదుర్గానగర్ నుంచి కొండపైకి వెళ్లే మార్గం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. అమ్మవారికి ఆషాఢమాస సారె సమర్పించే భక్తులు, సామాన్య దర్శనార్థం వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు భక్తులు క్యూలలో బారులు తీరారు. అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు.



అవనిగడ్డలో నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ నేతలు

జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గం

అవనిగడ్డ, జూలై 13: ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్న జీపీఎస్‌ను అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని యూటీఎఫ్ కృష్ణాజిల్లా శాఖ అవనిగడ్డలో నిరసన తెలిపింది. గెజిట్ ప్రతులను దగ్ధం చేసింది. గత ప్రభుత్వం జీపీఎస్‌ను అమలు చేసేందుకు ప్రయత్నించగా, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరాటాల కారణంగా దానిని తాత్కాలికంగా నిలిపివేసిందని, కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పాత తేదీతో జీపీఎస్ అమలు చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం సరికాదని యూటీఎఫ్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కె.ఎ.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కనకరావు, ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు, కార్యదర్శులు గోపాలకృష్ణ, ఎస్.వెంకటేశ్వరరావు, ఎల్.సుభాషి, మండల శాఖ బాధ్యులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసైన

అన్నను కడతేర్చిన తమ్ముడు

- స్నేహితులతో కలిసి ఘాతుకం..ఘటన ఆలస్యంగా వెలుగులోకి
- నిందితుల అరెస్టు..రిమాండ్‌కు తరలింపు

పెనుగంచిప్రోలు, జూలై 13: చెడు వ్యసనాలకు బానిసై కన్నవారిని ఇబ్బంది పెడుతున్న అన్నను ముగ్గురు స్నేహితులతో కలిసి తమ్ముడు హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా చినగంజాం మండలం కడమకుదురు గ్రామానికి చెందిన కంపిరి అనిల్‌నాయుడు(24) ఈనెల 4న శవమై పెనుగంచిప్రోలు మునేటిలో తేలాడు. ఎస్సై పి.రాంబాబు కథనం మేరకు కంపిరి సురేష్‌బాబు ఎస్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అతనికి అనిల్ నాయుడు, అఖిల్ నాయుడు అనే కుమారులున్నారు. వీరిలో అనిల్ నాయుడు పెద్ద కుమారుడు. కొంతకాలంగా మద్యం, గంజాయికి బానిసై డబ్బు కోసం తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. అతని వేధింపులు తట్టుకోలేక తల్లి అనారోగ్యం పాలైంది. అనిల్ నాయుడు ఈనెల 4న హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఇది గమనించి ఆయన సోదరుడు తన స్నేహితులు ఈ రాత్రి హైదరాబాద్ వెళుతున్నాడని వారి కారులో నువ్వు కూడా వెళ్లవచ్చని అన్నకు అఖిల్‌నాయుడు చెప్పాడు. తమ్ముడి మాటలు నమ్మిన అనిల్‌నాయుడు సోదరుడి స్నేహితులైన మచిలీపట్నం (మాచవరం)కు చెందిన సయ్యద్ సమ్రోలు అలి అల్ఫాస్, గంపలగూడెం మండలం ఊటుకూరు చెందిన చెరుకూరి శ్రీకాంత్, యనమలకుదురుకు చెందిన విశ్వనాథపల్లి రాజు, తమ్ముడు అఖిల్ నాయుడుతో కలిసి కారులో హైదరాబాద్ బయలుదేరారు. మార్గం మధ్యలో చిల్లకల్లు సమీపంలో గట్టుభీమవరం సమీపంలో ఖాళీ ప్లాట్లలో అనిల్‌నాయుడిని కత్తులతో వారు హత్య చేసి శవాన్ని అదే రోజు రాత్రి పెనుగంచిప్రోలు మునేటి కాలువ వద్ద వదిలి వెళ్లారు. నిందితుల కాల్‌డేటా ఆధారంగా శనివారం అరెస్టు చేసి జగ్గయ్యపేట కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించాడని ఎస్సై రాంబాబు తెలిపారు.

చేనేతకు పూర్వవైభవం తెస్తాం

- కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతాం
- జగన్‌రెడ్డి చేనేతకు మరణశాసనం రాశారు
- వైసీపీ ప్రభుత్వంలో కుంభకోణాలమయంగా ఆప్కో: మంత్రి సవిత



పెడన సదాశివలింగేశ్వర సొసైటీలో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెడన, జూలై 13: చేనేతకు 2014-19 నాటి పూర్వ వైభవాన్ని తెస్తామని, కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతామని బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత హామీ ఇచ్చారు. శనివారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావుతో కలిసి గూడూరు మండలం పోలవరం, మల్లవోలు, కప్పలదొడ్డి, పెడన పట్టణంలోని చేనేత సహకార సంఘాలను ఆమె సందర్శించారు. చేనేత సంఘాల్లో భారీగా పేరుకుపోయిన వస్త్ర నిల్వలను పరిశీలించారు. చేనేత కార్మికుల స్థితిగతులను, సమస్యలను తెలుసుకున్నారు. ఆయా సంఘాల్లో చేనేత కార్మికులతో నిర్వహించిన సమావేశాల్లో మంత్రి మాట్లాడారు. "ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి చేనేతకు మరణశాసనం రాశారు. 2019కు ముందు టీడీపీ ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేసిన పావలా వడ్డీ, యారన్ సబ్సిడీ, త్రిఫ్టు ఫండ్, రిబేటు పథకాలను వైసీపీ ప్రభుత్వమొచ్చాక నిర్దాక్షిణ్యంగా రద్దు చేసి నేతన్నల ఉసురుపోసుకుంది. వైసీపీ ప్రభుత్వం చేనేత సంఘాలకు జిల్లా వ్యాప్తంగా రూ.35 కోట్లు, రాష్ట్ర వ్యాప్తంగా రూ.106 కోట్లు బకాయిపడింది. వైసీపీ ప్రభుత్వ అమానుష వైఖరి వల్ల చేనేత కార్మికుల ఆత్మహత్యలు, వలసలు, ఇతర వృత్తులలోకి వెళ్లడం జరిగాయి. దీంతో చేనేత రంగం కుదేలయింది. జగన్‌రెడ్డి హయాంలో ఆప్కో కుంభకోణాలమయంగా మారింది. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు." అని సవిత హామీ ఇచ్చారు. వైసీపీ దుర్మార్గపు పాలనలో చేనేత కార్మికులు నానా ఇబ్బందులు పడ్డారని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో చేనేత సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని ఆయన స్పష్టం చేశారు. మంత్రిగా వెలగపెట్టిన పెడన ప్రజాప్రతినిధి చేనేత గురించి ఏనాడు పట్టించుకోకపోగా సమస్యలపై ప్రశ్నించిన కార్మికులపై దురుసుగా ప్రవర్తించాడని బొడ్డు వేణుగోపాలరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పోలవరంలోని శ్యామ్ ప్రసాద్ చేనేత సొసైటీ, కప్పలదొడ్డిలోని దేవలమహర్షి చేనేత సొసైటీ, మల్లవోలు సొసైటీ, పెడన పట్టణంలోని సదాశివలింగేశ్వర చేనేత సొసైటీలను మంత్రి సవిత సందర్శించారు. ప్రసాద్ కలంకారీ యూనిట్‌ను మంత్రి సందర్శించారు. జిల్లా చేనేత జౌళి శాఖ ఏడీ అప్పారావు, యక్కల శ్యామలయ్య, అబ్దుల్ ఖయూం (హన్ను), వహబ్‌ఖాన్, బళ్ల ప్రసాద్, మామిడి లక్ష్మీనారాయణగుప్తా పాల్గొన్నారు.



ఆశ కార్యకర్త రాధ కుటుంబాన్ని పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

విషజర్వాల నివారణకు చర్యలు

ఎ.కొండూరు, జూలై 13: విషజర్వాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. ఎ.కొండూరులో ఆమె మాట్లాడారు. ఎ.కొండూరు, పాత కొండూరు, గోపాలపురం గ్రామాల్లో దోమల నివారణకు పంచాయతీల సహకారంతో మురుగు తీయడం, లార్వా నివారణకు ఎబేట్ పిచికారీ, గురు, శుక్రవారాల్లో ఫాగింగ్ చేయించామని తెలిపారు. వాతావరణంలో మార్పుల వలన జర్వాల తీవ్రత పెరిగిందన్నారు. ప్రజలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని ఆమె సూచించారు. ఎ.కొండూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేయిస్తూ మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. శనివారం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ మలేరియా జోన్-2 అధికారి బీఎల్ఎన్ కుమార్ వైద్య బృందం ఎ.కొండూరు, పాత కొండూరు, గోపాలపురం గ్రామాల్లో పర్యటించి దోమల నివారణ, మలేరియా జర్వాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆరోగ్య సిబ్బందికి వివరించారు.

ఆశ కార్యకర్త రాధ కుటుంబానికి పరామర్శ

ఎ.కొండూరులో ఇంటింటికీ జ్వరాల సర్వే చేస్తూ విషజ్వరంతో మృతి చెందిన తోట రాధ కుటుంబాన్ని డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.15 వేలు అందజేశారు. పెద్దకర్మరోజున మరో రూ.30 వేలు అందజేస్తామన్నారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ మోతిబాబు, ఎ.కొండూరు డాక్టర్ కె.శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసి డిపో గేటు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

జగ్గయ్యపేట డిపోను నిర్వీర్యం చేసే కుట్ర

- హైర్ బస్సు సర్వీసులు విజయవాడకు బదలాయించేందుకు యత్నం: ఈయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.శ్రీనివాసరావు

జగ్గయ్యపేట, జూలై 13: జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోను నిర్వీర్యం చేసేందుకు కుట్ర జరుగుతోందని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు ఆరోపించారు. హైర్ బస్సులను విజయవాడకు బదలాయించొద్దని శనివారం డిపో గేటు ఎదుట కార్మికులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. విజయవాడ హైర్‌బస్సు ఆపరేటర్ల లబ్ధికోసం జగ్గయ్యపేట నుంచి విజయవాడ రూట్‌లో తిరుగుతున్న 25 హైర్ బస్సుల్లో 10 బస్సులను విజయవాడ డిపోకు బదలాయించేందుకు యత్నిస్తున్నారని, పేట డిపో రోజుకు రూ.3 లక్షలకు పైగా ఆదాయం కోల్పోతుందని, 30 మంది సిబ్బంది బదిలీ అయ్యే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నందిగామ సెక్టార్ బస్సులను, విజయవాడ- కోదాడ రూట్ బస్సులను వేరే డిపోలకు బదలాయించటంతో పేట డిపో అన్ని రకాలుగా నష్టపోయిందన్నారు. కాంట్రాక్టర్ల లబ్ధి కోసం తీసుకునే ఈ నిర్ణయంతో జగ్గయ్యపేట డిపో ప్రాధాన్యం తగ్గిపోయి, మిని డిపోగా, శాటిలైట్ డిపోగా మారిపోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైర్ బస్సులు విజయవాడకు బదలాయించొద్దని డిపో అధికారులు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్యకు ఎంప్లాయిస్ యూనియన్ నేతలు వినతిపత్రం అందచేశారు. ఆందోళనలో యూనియన్ నేతలు ఆనంద్, జిలాని, చిలకా నాగేశ్వరరావు, కె.వసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీసీలో అగ్నిప్రమాదంపై దర్యాప్తు

- ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు
- మెయిన్ స్విచ్‌బోర్డులో చనిపోయిన ఎలుక

విజయవాడ, జూలై 13(ఆంధ్రజ్యోతి): మ్యూజియం రోడ్డులోని నీటిపారుదల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో జరిగిన అగ్నిప్రమాదంపై సూర్యారావుపేట పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. గురువారం అర్ధరాత్రి ఈ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగిన జరిగింది. పలు ఫైళ్లు దగ్ధమయ్యాయి. ఫైళ్లను మాయం చేయడానికి ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా ఈ పని చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం ఉదయం పోలీసులు కార్యాలయంలో ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కార్యాలయానికి విద్యుత్ సరఫరా చేసే మెయిన్ స్విచ్‌బోర్డును పరిశీలించగా అక్కడ ఎలుక చనిపోయి ఉంది. ఎలుక లోపలకు వెళ్లడంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగిందని భావిస్తున్నారు. రెండు ప్రధాన స్విచ్‌లకు మధ్యన ఎలుక ఇరుక్కుపోయి ఉన్నట్టు కనిపించింది. ప్రమాదం జరిగిన నేపథ్యంలో పోలీసులు కార్యాలయాన్ని సీజ్ చేశారు. మరోపక్క అగ్నిమాపక అధికారులు దర్యాప్తును సాగిస్తున్నారు.



కేశినేని చిన్నికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎన్నారై వల్లభనేని గిరిబాబు

తిరువూరు నియోజకవర్గ

అభివృద్ధికి సహకరించండి

- ఎంపీ కేశినేని చిన్నిని కోరిన ఎన్నారై గిరిబాబు

విస్సన్నపేట, జూలై 13: తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి సహాయ, సహకారాలందించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని)ని ఎన్నారై, టీడీపీ తిరువూరు నియోజకవర్గ నేత వల్లభనేని గిరిబాబు కోరారు. హైదరాబాద్‌లో ఎంపీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా చిన్నిని గిరిబాబు కలుసుకున్నారు. చిన్నికి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పాలిటెక్నిక్ పరీక్షా ఫలితాల్లో

వికాస్ విద్యార్థుల ప్రతిభ

విస్సన్నపేట, జూలై 13: ఏపీ ఎస్‌బీ టెట్ విడుదల చేసిన మొదటి ఏడాది పాలిటెక్నిక్ పరీక్షా ఫలితాల్లో వికాస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని కళాశాల చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎం.మహలక్ష్మి 97.4 శాతం, యడ్ల అభిరామ్ 96.1శాతం, ఎం.మౌళ్య 94.2 శాతం మార్కులు సాధించి కళాశాలస్థాయిలో తొలి మూడు ర్యాంకుల్లో నిలిచారన్నారు. ఇంజనీరింగ్ డ్రాయింగ్‌లో నూటికి నూరు మార్కులు 10 మంది, బేసిక్ కంప్యూటర్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లలో ముగ్గురు, మ్యాథ్స్‌లో ఒకరు 100 మార్కులు సాధించారన్నారు. ప్రిన్సిపాల్ కె.రమేష్, అధ్యాపకులను, విద్యార్థులను నర్సిరెడ్డి అభినందించారు.

మంగలేరులో యువకుడి గల్లంతు

- గాలిస్తున్న గజ ఈతగాళ్లు





మంగలేరు డ్రెయిన్ వద్ద గాలింపు చర్యల్లో గజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది, ఇన్‌సెట్‌లో మైలా శీను(ఫైల్)

మచిలీపట్నం, జూలై 13(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం 31వ డివిజన్ శివారున ఉన్న మంగలేరు డ్రెయిన్‌లో చేపలవేట చేస్తున్న ఓయువకుడు నీటిలోపడి శనివారం గల్లంతయ్యాడు. ఇనుగుదురుపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శారదానగర్‌కు చెందిన మైలాశ్రీను(28) శనివారం చేపలవేటకోసం మంగలేరు డ్రెయిన్‌వద్దకు వెళ్లాడు. డ్రెయిన్‌లో వలవేసిన సమయంలో నీటిలో వల చిక్కుకుపోయింది. వలను తీసేందుకు నీటిలోకి దిగాడు. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో స్థానికులు అతని బంధువులకు సమాచారం ఇచ్చారు. కొందరు మత్స్యకారులు నీటిలోకి దిగిచూసినా శ్రీను ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులకు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. శనివారం సాయంత్రం నుంచి ఫైర్‌సిబ్బంది, 10మందికి పైగా గజ ఈతగాళ్లు గాలింపుచర్యలు చేపట్టినా శ్రీను ఆచూకీ లభించలేదు. శనివారం రాత్రి 9గంటల సమయంలోనూ గజ ఈతగాళ్లు గాలిస్తూనే ఉన్నారు. మృతునికి భార్య, మూడేళ్లలోపు వయసు ఇద్దరు పిల్లలు న్నారు.

వైసీపీ నేతల మట్టి తవ్వకాలే మింగేశాయా..

వేసవికాలంలో రెండేళ్లుగా మంగలేరు డ్రెయిన్‌లో ఎస్కవేటర్‌ల ద్వారా అడ్డుఅదుపూ లేకుండా వైసీపీ నాయకులు మట్టిని తవ్వి విక్రయించేశారు. డ్రెయిన్‌లో 10 నుంచి 15అడుగుల లోతున మట్టిని తవ్వేస్తున్నారని, శారదానగర్ కాలనీవాసులు అధికారపార్టీ నాయకులకు చెప్పినా తవ్వకాలను నిలిపివేయకపోగా, మరింతగా ఇక్కడినుంచి తరలించారు. గతేడాది ఇక్కడ మట్టి తవ్వకాలు జరుగుతున్న సమయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న కొల్లు రవీంద్ర, పార్టీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వైసీపీ నాయకులు కొల్లు రవీంద్రతో వాగ్వివాదానికి దిగారు. ఆయన వెంట ఉన్న నాయకులపై దాడి చేశారు. రెవెన్యూ అధికారులను సైతం నెట్టేశారు. దీనిపై అప్పటి కలెక్టర్‌కు నేరుగా కొల్లు రవీంద్ర ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు తవ్వకాల వైపునకు రాకుండా వైసీపీ నాయకులు అడ్డుకున్నారు. మట్టి తవ్వకాలను ఆపకుండా కొనసాగించారు. డ్రెయిన్‌లో లోతుగా తవ్వడంతో ఎంత లోతు గోతులు ఉన్నాయో తెలియడం లేదని, నీటిలో దిగిన శ్రీను మునిగిపోయాడని, వైసీపీ నేతల తవ్వకాల కారణంగానే గల్లంతయ్యాడని యువకుడి బంధువులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో నూజివీడు పేరుతో రైల్వే స్టేషన్

రైల్వేస్టేషన్ పేరు మార్చండి

- పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న నూజివీడు పేరుతో జంక్షన్‌లో రైల్వేస్టేషన్
- హనుమాన్‌జంక్షన్ రైల్వేస్టేషన్‌గా మార్చాలని డిమాండ్
- హామీలతోనే సరిపెడుతున్న ప్రజాప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్: హనుమాన్‌జంక్షన్‌లో నూజివీడు పేరుతో ఉన్న రైల్వేస్టేషన్ దశాబ్దాలుగా ప్రయాణికులకు సేవలందిస్తోంది. పాతిక కిలోమీటర్ల దూరంలో ఉన్న నూజివీడు పేరుతో ఉన్న స్టేషన్ పేరును హనుమాన్‌జంక్షన్‌గా మార్చాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నారు. పాలకులు ఐదేళ్లకొకసారి హామీలతో సరిపెడుతున్నారు. నూజివీడులో ట్రిపుల్ ఐటీ ఉండడంతో రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చి వెళుతుంటారు. ఇక్కడ నాలుగు సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు, మరో నాలుగు ఆర్డీనరి ఎక్స్‌ప్రెస్‌లు ఆగుతుంటాయి. రవాణా చార్జీలు రూపంలో కోట్లాది రూపాయలు ఆదాయాన్ని సమకూర్చి పెడుతున్న నూజివీడు రైల్వేస్టేషన్‌కు హనుమాన్‌జంక్షన్‌గా పేరు మార్చాలని రెండు దశాబ్దాలుగా ప్రజాప్రతినిధులను స్థానిక ప్రజానీకం కోరుతోంది. ఎన్నికైన ప్రజాప్రతినిధులు పేరు మార్పించడానికి హామీలు ఇస్తూనే ఉన్నారు. కానీ పేరు మారడంలేదు.

కొడాలి నాని సన్నిహితుడి బంకులో

కల్తీ పెట్రోల్ విక్రయం

- కీర్తికుమార్ బంకులో పెట్రోల్ కొట్టించుకుని కొద్ది దూరం వెళ్లగానే ఆగిన బైక్‌లు
- బంక్ వద్దకు బైక్‌లు తీసుకొచ్చిన వినియోగదారులు



బైక్‌లు ఆగిపోవడంతో బంకు వద్దకు తీసుకొచ్చిన వినియోగదారులు, ఇన్‌సెట్‌లో ఇథనాల్, నీటితో కలిసి ఉన్న పెట్రోలు

గుడివాడ: మల్లాయిపాలెం పరిధిలోని ముదినేపల్లి రోడ్డులో మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని సన్నిహితుడు షా కీర్తికుమార్ జీవావత్‌కు చెందిన షా గులాబ్‌చంద్ జీవావత్ అండ్ కో పెట్రోలు బంకులో కల్తీ పెట్రోలు విక్ర యం కలకలం సృష్టించింది. శనివారం సాయంత్రం 50 మందికి పైగా బైక్‌లలో 75 లీటర్ల మేర పెట్రోలు కొట్టించుకున్నారు. కొద్దిదూరం వెళ్లగానే వాహనాలు ఆగిపోయాయి. వాహనాలు స్టార్ట్ అవ్వలేదు. దీంతో బైక్‌లను బంకు వద్దకు తీసుకొచ్చి సిబ్బంది ఎదుట పెట్రోలు ట్యాంకులను తెరచి చూపించారు. కంపెనీ ప్రతినిధి తమ తప్పేం లేదని, పెట్రోలుతో పాటు ఇథనాల్ కలవకపోవడంతో వాహనాలు ఆగిపోతున్నాయని, బైక్‌కు ఏ ఇబ్బందీ ఉండదని 75లీటర్లు పెట్రోలు అమ్మకాలు జరిగాయని, తిరిగి వచ్చిన వారందరికి పవర్ పెట్రోలును కొట్టించి పంపుతున్నట్లు తెలిపారు. మరికొందరు పాత ద్విచక్రవాహనదారులు వాహనం ఎందుకు ఆగిందో తెలియక మెకానిక్‌లను ఆశ్రయించారు. ట్యాంకు నుంచి పెట్రోలును తీసి కల్తీపెట్రోలు కారణంగానే ఆగిపోయాయని, నెలలో రెండోసారి వాహనాల ట్యాంకులను శుభ్రపరిచామని మెకానిక్‌లు చెబుతున్నారు.

నెలలో రెండోసారి..

15 రోజుల క్రితం గుడ్లవల్లేరు కళాశాలలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉండటంతో పెట్రోలు కొట్టించుకుని అంగలూరు వద్దకు వెళ్లేసరికి బైక్ ఆగిపోయిందని ఓ విద్యార్థి తెలిపాడు. మెకానిక్ వద్దకు తీసుకువెళ్లి చూపిస్తే కల్తీ పెట్రోలు వల్లే ఆగిపోయిందని చెప్పాడని, వాహనాన్ని బాగు చేయించుకున్నానని వాపోయాడు.

పట్టించుకోని పౌరసరఫరాలు, తూనికల శాఖ అధికారులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో కొడాలి నాని అండతో ఆ బంకులో పలు అక్రమాలు జరిగినా అధికారులు మిన్నకుండిపోయారని, పలుమార్లు పెట్రోలు కొలతల్లో తేడా ఉందని, కల్తీ పెట్రోలు కొడుతున్నారని అధికారులకు ఫిర్యాదు లందినా నానికి సన్నిహితుడు కావడంతో తనిఖీలు చేసేందుకు పౌరసరఫరాలు, తూనికలు కొలతల శాఖ అధికారులు సాహసించలేదని వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

తోసుకుంటూ వచ్చాం

కల్తీ పెట్రోలుతో తామంతా ఇబ్బందులు పడ్డామని, వాహనాలను తోసుకుంటూ వచ్చామని, మెకానిక్ వద్ద బాగు చేయించుకోవలసిన దుస్థితి ఏర్పడిందని వినియోగదారులు వాపోయారు. విజయవాడ నుంచి మల్లాయిపాలెం వెళుతూ బంకులో పెట్రోలు కొట్టించుకున్నానని మహ్మద్ ఇషాక్ తెలిపారు. మల్లాయిపాలెం గేటు దాటగానే అరకిలోమీటర్ దూరానికే ఆగిపోయిందని, దీంతో ఆటోలో వాహనాన్ని మెకానిక్ వద్దకు తీసుకెళ్లానని ఇప్పటికే 15వాహనాలు ఇలా వచ్చాయని మెకానిక్ చెప్పాడని తెలిపారు. 30 మందికిపైగా ద్విచక్రవాహనదారులు వేరే వాహనాల సహకారంతో బంకు వద్దకు చేరుకున్నారు.

జారుకున్న పోలీసులు

బంకు వద్ద ద్విచక్రవాహనాలు బారులు తీరి, ఆందోళనకు సిద్ధమవుతున్నారనే సమాచారంతో గుడివాడ తాలుకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొడాలి నాని సన్నిహితుడు కీర్తికుమార్ బంకు కావడంతో పోలీసు ఉన్నతాధికారి ఆదేశాలతో వచ్చిన ఇద్దరు అక్కడి నుంచి చల్లగా జారుకున్నారు.

మీడియాకు తాయిలాలు ఎర

జరిగింది చిన్న విషయమని, కల్తీ పెట్రోలు విషయాన్ని పేపర్లు, టీవీల్లో రాకుండా చూడాలని మీడియా ప్రతినిధులకు తాయిలాలు ఇచ్చేందుకు సైతం బంకు యాజమాన్యం తెగపడింది.

కొడాలి నాని ఆరా

బంకు వద్ద ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి ఓ వైసీపీ నాయకుడిని కొడాలి నాని పంపించారు. అక్కడి పరిస్థితిని తెలపాలని, వినియోగదారులు ఆందోళన చేయకుండా చూడాలని ఆదేశాలిచ్చినట్లు సమాచారం.

టైలర్స్‌కు విద్య, వైద్యం అందించాలి

భవానీపురం, జూలై 13 : ప్రభుత్వ వాణిజ్య షాపింగ్‌కాంప్లెక్సుల్లో లేడీస్ టైలర్స్, జంట్స్ టైలర్స్ షాపులు కేటాయించాలని, టైలర్స్‌కు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌కు యాక్స్ టైలర్స్ అధినేత యర్రంశెట్టి వాలేశ్వరరావు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం నేరుగా వడ్డీలేని రుణాలను అందించాలని కోరారు. ఈ సమస్యలపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని జనార్దన్ హామీ ఇచ్చారు.



పోలేరమ్మకు అన్నాభిషేకం



భవానీపురం, జూలై 13 : ఊర్మిళానగర్‌లోని గ్రామదేవత పోలేరమ్మ తిరునాళ్లలో భాగంగా శనివారం అన్నాభిషేకాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమ పూజా జరిపించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ సూరసాని రామిరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాల పంపిణీ చేపట్టారు. అమ్మవారికి ఆదివారం కృష్ణానదీ జలాలతో అభిషేకం నిర్వహించనున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

విద్యాధరపురం, జూలై 13 : విద్యాధరపురం కామకోటి నగర్ ఆంజనేయస్వామి వీధిలో కొన్ని రోజుల నుంచి తాగునీరు రంగు మారడం వల్ల స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై స్థానిక 39వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు రేగళ్ల లక్ష్మణరావు స్పందించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు సమస్యను పరిష్కరించారు.

పైలా దాస్‌పై చర్యలు తీసుకోవాలి

సత్యనారాయణపురం, జూలై 13: బ్రాహ్మణ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పైలా దాస్‌పై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా పరుశురామసేనా ఫౌండర్ యేలేశ్వరపు జగన్మోహనరాజు డిమాండ్ చేశారు. సత్యనారాయణపురం జీఎస్ రాజు రోడ్డులోని గాయత్రి కన్వెన్షన్ హాల్‌లో శనివారం మాట్లాడుతూ, ఈ సంఘటనతో బ్రాహ్మణుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. సమావేశంలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి, బ్రాహ్మణ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, జూలై 13 : రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల సామర్థ్యం ముఖ్యమంత్రి చంద్రబాబుకే ఉందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 4వ డివిజన్ ఫిల్మ్ కాలనీలో ఎమ్మెల్యే కార్పొరేటర్ జాస్తి సాంబశివరావుతో కలిసి పర్యటించారు. కాలనీ అభివృద్ధిపై స్థానికులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పలు వీధులు తిరిగి ప్రధాన సమస్యలను గుర్తించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాభివృద్ధి కల సాకారమవుతుందన్నారు. సుమారు లక్ష కోట్ల రూపాయలు వడ్డీలేని రుణంగా రాష్ట్ర ఖజానాకు రానుందన్నారు. తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి నిధుల కొరతలేకుండా ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వర రెడ్డి, నర్రా శ్రీనివాసరావు, సాయిరామ్, చెన్నుపాటి ప్రసాద్, బత్తిన కిషోర్, గద్దే రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వరలక్ష్మీనగర్‌లో కమ్యూనిటీ హాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కమ్యూనిటీహాలు పరిశీలన

భారతీనగర్ : వరలక్ష్మీనగర్‌లోని కమ్యూనిటీ హాలును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 4వ డివిజన్ వరలక్ష్మీనగర్ కాలనీలో శనివారం పర్యటించారు. కాలనీలోని నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2014-19 సంవత్సరంలో చంద్రబాబు ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసేవారన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సబ్ ప్లాన్ అనేదిలేకుండా పోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. తిరిగి చంద్రబాబు అధికారంలోకి రావడంతో కమిషనర్‌ను కలసి కమ్యూనిటీహాల్ అభివృద్ధి చేయాల్సిందిగా కోరామన్నారు. కార్యక్రమంలో ప్రకాష్, రాజ్‌కుమార్, నగేష్, ఇసాక్, గద్దె రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నత చదువుకు సాయం



పటమట, జూలై 13 : నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఉన్నత చదువు కోసం మేమున్నా అంటూ హ్యాపీఫీట్ ఆర్గనైజేషన్ సంస్థ రూ.40వేల ఆర్థిక సహాయాన్ని కానూరుకు చెందిన జి. అశ్వినికి శనివారం అందజేశారు. మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో డిగ్రీలో సీటు సాధించినా చదువుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతోంది. ఈ విషయం తెలుసుకున్న హ్యాపీఫీట్ సంస్థ పటమట కార్యాలయంలోని విద్యార్థిని మొదటి సంవత్సరం ఫీజు కింద రూ.40వేలను సభ్యులు అందించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు గుడిసేవ హరీష్, రాజేష్, రోహిత్, బసవ వెంకటకృష్ణ, పోతురాజు, రేవంత్, అశోక్ పాల్గొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి జనసేన నేతలు



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న జనసేన నేతలు

వన్‌టౌన్, జూలై 13 : నగరంలోని ఓ హోటల్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను శనివారం జనసేన పార్టీ ప్రచార కమిటీ విజయవాడ అర్బన్ కో ఆర్డినేటర్ తిరుపతి సురేష్, 42వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు తిరుపతి అనూష మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించి మొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ ఆయాజ్, పసుపులేటి నాగకృష్ణ, కొల్లు నాగవివేక్, భాగ్యరాజ్ ఉన్నారు.

సాంకేతిక నైపుణ్యాలతో దేశాభ్యున్నతి



వన్‌టౌన్, జూలై 13 : డేటా ఎనలిటిక్స్ సాంకేతిక నైపుణ్యాలతో దేశం అభ్యున్నతి చెందుతుందని అకాడమిక్ ఓవర్సీస్ ఇన్‌స్టిట్యూట్ హెచ్ఆర్ కె.కావ్య అన్నారు. వన్‌టౌన్‌లోని గాంధీజీ మహిళా కళాశాలలో శనివారం డేటా ఎనలిటిక్స్ సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా కావ్య పాల్గొని మాట్లాడుతూ డేటా ఎనలిటిక్స్ సాంకేతిక నైపుణ్యాలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తుతో పాటు దేశం అభ్యున్నతి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సీఎల్ కాంతారావు, వైస్ ఛైర్మన్ కేవీ పిచ్చయ్య, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమణి పాల్గొన్నారు.

ధరల స్థిరీకరణకు ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, జూలై 13 : నిత్యావసర ధరల స్థిరీకరణకుప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని రైతు బజార్‌లో కందిపప్పు, బియ్యం అందించే ప్రత్యేక కౌంటర్‌ను శనివారం ప్రారంభించారు. బొండా ఉమా మాట్లాడుతూ సామాన్య ప్రజలకు నిత్యావసర సరుకులు సరసమైన ధరల్లో అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో ఈ ప్రత్యేక కౌంటర్లను ప్రారంభించినట్లు తెలిపారు.



బొండా ఉమాను మర్యాదపూర్వకంగా కలసిన క్రైస్తవ సంఘ సభ్యులు

క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

పాస్టర్లు, క్రైస్తవుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని ఇమ్మానియేల్ బాప్టిస్ట్ చర్చి సంఘం కార్యదర్శి అలపర్తి రాజేంద్రప్రసాద్ బొండా ఉమా నివాసంలో ఆయనను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. చర్చి ట్రెజరర్ అలపర్తి హనోక్, టీడీపీ ఎస్సీ సెల్ నేత చల్లగాలి డేవిడ్ పాల్గొన్నారు.

ప్రభాస్ మరిన్ని విజయాలు సాధించాలి

సత్యనారాయణపురం : నటుడు ప్రభాస్ మరిన్ని విజయాలు సాధించాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు దెందుకూరి మురళీకృష్ణంరాజు ఆధ్వర్యంలో కల్కి సినిమా 1000కోట్లు కలెక్షన్ సాధించిన సందర్భంగా శనివారం ముత్యాలంపాడులో గౌరవాధ్యక్షుడు బొండా ఉమా కేక్ కట్ చేసి ,స్వీట్లు పంచారు. నవనీతం సాంబశివరావు, , జమ్మి కిరణ్, సాయి మనీష్, రాజేష్, అనిల్, మారుతి, రామకోటయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ మందిరంలో ప్రత్యేక పూజలు

రామలింగేశ్వరనగర్, జూలై 13: జగన్నాథ రథయాత్ర ఉత్సావాల్లో భాగంగా రెండో రోజు రామలింగేశ్వరనగర్ లోనినిర్వహించారు. ఇస్కాన్ మందిర ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన గుండిచా మందిరంలో ఏర్పాటు చేసిన రత్న సింహాసనంపై స్వామి ఆశీనులు కాగా శనివారం ఉదయం నుంచి సంకీర్తనలు, అఖండ హారతులు, 108 రకాల భోగాను (ప్రసాదాలు) సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 4.30నుంచి దీప ధూప హారతులు, కీర్తనలు, భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం సాయంత్రం 200రకాల పిండివంటలను సమర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



నలంద డిగ్రీ కళాశాలలో యానిమేషన్‌పై వర్క్‌షాప్

లబ్బీపేట, జూలై 13 : నలంద డిగ్రీ కళాశాలలో శనివారం విజువల్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎక్స్‌ప్రెసివ్ 2డీ యానిమేషన్ వర్క్‌షాప్ జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో ప్రముఖ చిత్రకారుడు ఎన్.శ్రీధర్ విద్యార్థులకు 2డీ యానిమేషన్‌కి సంబంధించి పలు అంశాలని, క్యారెక్టర్ ఆర్ట్, ఎనాటమి, ఎక్స్‌ప్రెషన్స్ వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడుతూ యానిమేషన్ రంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఇటు వంటి వర్క్‌షాపులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో విజువల్ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీలు బి.శ్రీనివాసరావు, ఫిరోజ్‌ఖాన్, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

నలందలో సీసీఏ వేడుకలు

గవర్నర్‌పేట : నలంద విద్యానికేతన్ ప్రైమరీ విభాగంలో శనివారం కో-కరిక్యులర్ యాక్టివిటీస్ (సీసీఏ) ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ) మైలవరపు రాగదీప జ్యోతి వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం దీక్ష, మైత్రి, సహన, తేజస్ హౌస్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. సీఏ రాగదీప మాట్లాడుతూ, విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, ఎదుగుదలకు సీసీఏ ఎంతో తోడ్పడుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ మాదల పద్మజ, హెడ్ మిస్ట్రెస్ చెరుకూరి ఉషారాణి పాల్గొన్నారు.



నలంద విద్యానికేతన్‌లో జరిగిన సీసీఏ కార్యక్రమాలను ప్రారంభిస్తున్న సీఏ రాగదీప

మహిళలపై అశ్లీల వ్యాఖ్యలు చేసేవారిని శిక్షించాలి

పటమట, జూలై 13 : మహిళలపై లైంగిక, అశ్లీల వ్యాఖ్యలు చేసే యూట్యూబర్లపై చర్యలు తీసుకోవాలని తరుణీ తరంగాలు ఆధ్వర్యంలో ఈ నెల 15న విజయవాడ సర్వోత్తమ గ్రంథాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు రావి శారద ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విష సంస్కృతిని కూకటి వేళ్లతో పెకలించి, మహిళలకు, చిన్నారులకు రక్షణ కల్పించేందుకు జరిగే ఈ సమావేశంలో పెద్ద ఎత్తున మహిళలు, విద్యార్థినులు పాల్గొనాలని కోరారు.

వర్షం నీరు రోడ్లపై నిల్వకుండా చూడాలి

భారతీనగర్ : నగర పర్యటనలో భాగంగా నగపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ ఎ.మహేష్ శనివారం బెంజ్ సర్కిల్ నుంచి గురునానక్ సెంటర్ వరకు పర్యటించారు. రోడ్లపై నిల్వ ఉన్న వర్షం నీటిని, డ్రెయిన్‌లో వ్యర్థాలను తొలిగించి మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మూడు సర్కిల్ జోనల్ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.




అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనర్ మహేష్








అమరావతిలో చంద్రబాబు బయోపిక్ ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ 'ధర్మ చక్ర' షూటింగ్‌ను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి శనివారం ప్రారంభించారు. రాజధాని గ్రామం మల్కాపురం వి స్క్వేర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో మనోహర్ నాయుడు నిర్మిస్తున్నారు. పది రోజుల పాటు అమరావతిలో షూటింగ్ జరుగుతుంది. ఇందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా కళాకారులతో నటిస్తారు.

- తుళ్లూరు(ఆంధ్రజ్యోతి)

రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో కల్కి




ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపే వసూళ్లతో దూసుకుపోతోంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా హిందీ బెల్ట్‌లో, విదేశాల్లోనూ సంచలన వసూళ్లను సాధిస్తోంది. తాజాగా 'కల్కి' చిత్రం కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్లను అందుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ శనివారం తెలిపింది. విడుదలైన మూడు వారాల తర్వాత కూడా బాక్సాఫీసు దగ్గర నిలకడైన వసూళ్లతో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దిశాపటానీ కీలకపాత్రలు పోషించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు.

మోసపోయా.. ఆత్మహత్య చేసుకుంటా




నటుడు రాజ్ తరుణ్, అతని ప్రియురాలు లావణ్య వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాజ్ తరుణ్ 11 ఏళ్లు తనతో సహజీవనం చేసి.. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా అనే హీరోయిన్‌తో తిరుగుతూ తనను దూరం పెడుతున్నాడంటూ కేసు పెట్టిన లావణ్య.. శుక్రవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన న్యాయవాదికి వాట్సాప్ చాటింగ్‌లో చెప్పడం.. ఆయన 112కు ఫోన్ చేయడంతో నార్సింగ్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు రూ.5 కోట్లు ఇస్తామని, కేసు వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయవాదితో చాటింగ్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్ తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాయని, ప్రతిదీ ఓ పథకం ప్రకారం జరిగిందన్నారు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, తన చావుకు రాజ్ తరుణ్, అతని తల్లిదండ్రులతో పాటు మాల్వీ మల్హోత్రా కారణమని పేర్కొన్నారు. లావణ్య శనివారం తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై రాజ్ తరుణ్‌తో తనకు ఉన్న సంబంధంపై పలు విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. నార్సింగ్ పోలీసులు పలు సెక్షన్ల కింద మాల్యా, మయాంక్, రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ సిటీ/నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)







సర్వదర్శనానికి 30 గంటలు
తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ


కృష్ణతేజ విశ్రాంతి భవనం వెనుకభాగం వరకు ఉన్న సర్వదర్శన క్యూలైన్

తిరుమల, జూలై 13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. రెండవ శనివారంతో పాటు ఆదివారం సెలవుదినాలు కావడంతో శనివారం ఉదయం నుంచే తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, అన్నప్రసాద కేంద్రం, లడ్డూకౌంటర్లు, బస్టాండ్ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి పార్క్‌లోని షెడ్లు భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ విశ్రాంతి భవనం వెనుకభాగంలోని రింగురోడ్డు మీదుగా శిలాతోరణం సర్కిల్, బాటగంగమ్మ, ఆక్టోపస్ భవనం వరకు వ్యాపించింది. వీరికి 30 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ ప్రకటించింది. స్లాట్ దర్శన భక్తులకు కూడా 2 నుంచి 3 గంటల దర్శన సమయం పడుతోంది. కాగా, తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 16వ తేదీన ఆణివార ఆస్థానం నిర్వహించనున్న క్రమంలో 15న వీఐపీ బ్రేక్ దర్శనాలకు ఎలాంటి సిఫారసు లేఖలను స్వీకరించబోమని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది.

భక్తుల నిరీక్షణ సమయాన్ని తగ్గించండి: సీఎస్

శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు నిరీక్షణ సమయాన్ని తగ్గించేదిశగా చర్యలు తీసుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులకు ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ సూచించారు. శ్రీవారి దర్శనార్థం శనివారం సాయంత్రం తిరుపతికి చేరుకున్న ఆయన తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి గృహంలో టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, టీటీడీ జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీఈ నాగేశ్వరరావుతో కలిసి భక్తుల సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మారిన తర్వాత గత నెలరోజుల్లో భక్తుల సౌకర్యాల కల్పనకు తీసుకున్న నిర్ణయాలు, అమలుచేస్తున్న విధానాలపై సీఎస్‌కు ఈవో వివరించారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు


తిరుమల ఆలయం ముందు జస్టిస్ రవీంద్రబాబు, జస్టిస్ శ్యాంసుందర్

తిరుమల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్యాంసుందర్, జస్టిస్ రవీంద్రబాబు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్న న్యాయమూర్తులకు అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు


శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప


జస్టిస్ వెంకట రమణకు స్వామిఅమ్మవార్ల చిత్రపటం అందజేస్తున్న ఈవో పెద్దిరాజు

శ్రీశైలం, జులై 13: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జస్టిస్ దుప్పల వెంకటరమణ శనివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. స్వామివారికి అభిషేకం నిర్వహించుకుని భ్రమరాంబికాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వారికి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఎన్టీఆర్ హయాంలో విలువల రాజకీయాలు

- మాజీ ఐఏఎస్ లక్ష్మీనారాయణ వ్యాఖ్య
- మాజీ మంత్రి గుర్రం నారాయణప్పకు నివాళి


మాజీ మంత్రి గుర్రం నారాయణప్ప సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఐఏఎస్ లక్ష్మీనారాయణ

విడపనకల్లు, జూలై 13: ఎన్టీఆర్ అధికారంలో ఉన్న సమయంలో విలువలతో కూడిన రాజకీయాలు, నిబద్ధతతో కూడిన రాజకీయాలు ఉండేవని మాజీ ఐఏఎస్ లక్ష్మీనారాయణ వ్యాఖ్యానించారు. ప్రజలకు సేవ చేయాలనే తపన రాజకీయ నాయకులకు ఉండేదన్నారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి గ్రామంలో శనివారం మాజీ మంత్రి గుర్రం నారాయణప్ప 30వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, వాటిని పరిష్కరించేందుకు పాత తరం నాయకులు శ్రద్ధ పెట్టేవారని, నాటి నాయకులకు ఉండే నిబద్ధత, నిజాయతీ ప్రస్తుత రాజకీయాల్లో కనిపించటం లేదన్నారు. విలువలు లేని రాజకీయాలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడి, అనేక విధాలుగా నష్టపోయారని చెప్పారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజానీకానికి నిజాయతీ, నిబద్ధతతో కూడిన పరిపాలన అందిస్తుందన్నారు. ఎన్టీఆర్ పాత పాలనను ప్రజలకు అందిస్తూ, మంచి పాలన కొనసాగిస్తారని ఆశిస్తున్నామన్నారు.

ఆగస్టులో 'బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్'

- పోస్టర్లు విడుదల చేసిన సాహితీ ప్రముఖులు


ఉత్సవ్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సాహితీవేత్తలు

బెంగళూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద భారతీయ భాషా సాహిత్య ఉత్సవాన్ని 'బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ 2024' పేరిట ఆగస్టులో బెంగళూరులో నిర్వహించనున్నారు. ఉత్సవ్‌లో తెలుగు, కన్నడ, మళయాళం, తమిళం, ఇంగ్లీషు భాషలకు సంబంధించి 300 మందికిపైగా సాహితీవేత్తలు భాగస్వాములు అవుతారు. 80కు పైగా చర్చాగోష్ఠులు జరగనున్నాయని సీనియర్ సాహితీ పరిశోధకుడు నాడోజా హంపా నాగరాజయ్య వెల్లడించారు. బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో శనివారం బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ 2024కు సంబంధించి ప్రత్యేక పోస్టర్‌ను సాహితీవేత్తలు, పరిశోధకులు డాక్టర్ మల్లేపురం జి. వెంకటేశ్, డాక్టర్ నడహళ్లి బాలసుబ్రహ్మణ్యం, సాహిత్య ఉత్సవ్ డైరెక్టర్, రచయిత సతీశ్ చప్పరికె విడుదల చేశారు. నగరంలోని కోరమంగల ప్రాంతం సెయింట్ జాన్ ఆడిటోరియంలో ఆగస్టు 9 నుంచి మూడు రోజుల పాటు సాహిత్య ఉత్సవ్ జరగనుంది. డాక్టర్ నడహళ్లి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రపంచ సాహిత్యానికి కన్నడ, తెలుగు, తమిళ, మళయాళం భాషల సేవలు అపారమైనవని అన్నారు. చారిత్రాత్మకంగా మహత్తరమైన నాలుగు భాషలను ఒకే వేదికకు తీసుకొచ్చి పరస్పరం చర్చాగోష్ఠులు జరపడం ఈ ఉత్సవం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. భారతీయ భాషల్లో మహత్తరమైన సాహితీకృతులను గుర్తించి వాటిని ఆంగ్లభాషకు తీసుకెళ్లే ప్రయత్నానికి చికాగో విశ్వవిద్యాలయం సిద్ధమైందని అన్నారు. అందుకోసమే ఎస్ఏఎల్‌టీ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. డాక్టర్ మల్లేపురం జి. వెంకటేశ్ మాట్లాడుతూ ఇది కేవలం సాహిత్య ఉత్సవం మాత్రమే కాదని దక్షిణభారత కళలు, సంస్కృతి సాహిత్య మహాసంగమమని తెలిపారు.

ముడసర్లోవ పార్కు వద్ద నిర్మాణాలొద్దు

- జీవీఎంసీ అధికారులను వివరణ కోరిన పవన్‌కల్యాణ్

అమరావతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ ముడసర్లోవ పార్కు పరిసరాల్లో పర్యావరణానికి హాని కలిగించే చర్యలు చేపట్టవద్దని జీవీఎంసీ అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి, పర్యావరణవేత్త ఈఏఎస్ శర్మ ఫిర్యాదుపై స్పందించిన ఆయన జీవీఎంసీ అధికారులను వివరణ కోరారు. ముడసర్లోవ పార్కులో జీవీఎంసీ కట్టడాలు చేపడితే పర్యావరణ విధ్వంసానికి దారి తీస్తుందని శర్మ రాసిన లేఖపై పవన్ స్పందించారు. నిత్యం వందలాది మంది ప్రజలు సందర్శించే ముడసర్లోవ పార్కు 105 రకాల పక్షులకు ఆవాస ప్రాంతమని, జీవీఎంసీ ఆ పార్కులో భవన నిర్మాణాలకు సిద్ధమవుతోందని వచ్చిన వార్తలను ఉటంకిస్తూ ముడసర్లోవ పార్కును పరిరక్షించాలని కోరారు. అయితే అలాంటి ప్రతిపాదనలేవీ లేవని జీవీఎంసీ అధికారులు పవన్‌కల్యాణ్‌కు తెలిపారు.

ఏయూలో ఫైళ్లు దహనం?!

- నెల క్రితం సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం
- రెండు కంప్యూటర్లు, ఇతర సామగ్రి దగ్ధం
- పీహెచ్‌డీలు, ప్రొఫెసర్‌షిప్‌లు, గైడ్ల నియామకంపై కొన్నాళ్లుగా ఆరోపణలు
- దాని ఆధారాలను మాయం చేసే క్రమంలోనే ప్రమాదం జరిగినట్లు అనుమానాలు



సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయం ఈ బ్లాక్‌లోనే ఉంటుంది

విశాఖపట్నం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 18వ తేదీన ప్రిన్సిపాల్ కార్యాలయంలో కంప్యూటర్లు, స్కానర్, ఇంటర్నెట్ బాక్స్‌తోపాటు రెండు ఏసీలు, కర్టెన్లు, స్టెబిలైజర్లు పూర్తిగా కాలిపోయాయి. దీనికి షార్ట్ సర్క్యూట్ కారణంగా చెప్పుకొస్తున్నారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ ఎంవీఆర్ రాజు బాధ్యతలు స్వీకరించడానికి వారం ముందు ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. అయితే, అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తూ సంభవించిందా? లేక మరేదైనా జరిగిందా?.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదం జరిగిన మరుసటిరోజే ప్రిన్సిపాల్ కార్యాలయంలో రంగులు కూడా వేయించేశారు. కాగా, ఏయూలో పీహెచ్‌డీల వ్యవహారంపై కొన్నాళ్లుగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. అడ్డగోలుగా పీహెచ్‌డీలను ఇచ్చారని ఆరోపణలు వస్తున్నాయి. యూనివర్సిటీలో గైడ్లుగా నియమించాలన్నా, ప్రొఫెసర్‌షిప్ ఇవ్వాలంటే వారికి కొన్ని అర్హతలు, అనుభవం ఉండాలి. డిపార్టుమెంట్ రిసెర్చ్ కౌన్సిల్, కాలేజీ రిసెర్చ్ కౌన్సిల్ అనుమతి కూడా ఉండాలి. వీటి అనుమతి తరువాత బోర్డు ఆఫ్ రిసెర్చ్ కౌన్సిల్ (బీఆర్‌సీ) అనుమతి కూడా తప్పనిసరి. ఈ బీఆర్‌సీకి వీసీ ఛైర్మన్‌గా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అంటే, వర్సిటీలోని ఏ డిపార్టుమెంట్‌కు సంబంధించిన పీహెచ్‌డీ గ్రేడ్, ప్రొఫెసర్‌షిప్‌కు సంబంధించిన ఫైల్ అయినా సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కార్యాలయానికి చేరాల్సిందే. గడచిన ఐదేళ్ల కాలంలో జరిగిన పరిశోధనలు, గైడ్ల నియామకం, గౌరవ ప్రొఫెసర్ల నియామకానికి సంబంధించిన ఫైళ్లన్నీ అక్కడే ఉంటాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, పీహెచ్‌డీలు, ప్రొఫెసర్‌షిప్‌లపై ఆరోపణలు వస్తుండడంతో అడ్డగోలు నియామకాలకు సంబంధించిన ఆధారాలు బయటపడకూడదనే ఫైళ్లు దహనం చేసేందుకు యత్నించి ఉంటారని, ఆ క్రమంలోనే మంటలు ఎగసి ప్రమాదం సంభవించి మిగిలిన చాలా ఫైళ్లు దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఏదోవిధంగా సమాచారం మాత్రం అందుబాటులో లేకుండా చేశారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై వర్సిటీ అధికారులు మాత్రం మాట్లాడడం లేదు. ప్రస్తుతం సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న ఎంవీఆర్ రాజును దీనిపై వివరణ కోరగా మాట్లాడేందుకు నిరాకరించారు.

క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో.. ఇద్దరిపై కేసు

- తిరుమల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో టీటీడీ అధికారుల ఫిర్యాదు
- అదుపులోకి తీసుకునేందుకు తమిళనాడు వెళ్లిన పోలీసులు

తిరుమల, జూలై 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా క్యూలైన్‌లో ప్రాంక్ వీడియో చేసి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఇద్దరిపై తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. 'టీటీఎఫ్ ఫ్యామిలీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో ఈ ప్రాంక్ వీడియో వైరల్‌గా మారింది. ఈ విషయం 11వ తేదీన మీడియాలో రావడంతో టీటీడీ స్పందిస్తూ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో టీటీడీ సైబర్ సెక్యూరిటీ, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జ్ ఫిర్యాదు మేరకు టీటీఎఫ్ పేజ్‌ను నడుపుతున్న తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన వి.వైకుంఠవాసన్, అతని స్నేహితుడు గోవిందరాజ రామస్వామి అనే యువకులపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, ప్రాంక్ వీడియో చేసిన వ్యక్తుల కోసం ఓ బృందం తమిళనాడుకు వెళ్లింది.

వీడియో తీసినందుకు క్షమించండి: వాసన్

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వీడియో ఉంటే తనను క్షమించాలంటూ ప్రాంక్ వీడియో పోస్టు చేసిన పేజ్ క్రియేటర్ వాసన్ శనివారం ఓ సెల్ఫీ వీడియోను విడుదల చేశాడు. తాను తన స్నేహితులతో కలిసి భక్తిభావంతోనే తిరుమలకు వచ్చామన్నాడు. నారాయణగిరి షెడ్లలో తమ స్నేహితులతో సరదాగా ఓ వీడియో చేశామని, ఈ వీడియో తప్పుగా ప్రజల్లోకి వెళ్లిపోయిందన్నారు. నిజానికి అది ప్రాంక్ కాదని, తాము కంపార్టుమెంట్లలో వేచిఉన్నప్పుడు కొందరు ఉద్యోగులు తాళాలు తీస్తున్నట్టు దగ్గరకు వచ్చి వెళ్లిపోయారని, దాన్నే సరదాగా రీక్రియేట్ చేశామని సమర్థించుకునే ప్రయత్నం చేశాడు.

జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

- ముక్కులో 'కణితి' తొలగింపు
- పాల్గొన్న ఈఎన్‌టీ, కార్డియాలజీ వైద్యులు


రోగి గౌస్ పీర్‌తో గుంటూరు ప్రభుత్వాస్పత్రి వైద్యులు

గుంటూరు (మెడికల్) జూలై 13: నాసిక కుహరంలో నోరు, ముక్కు కలిసే ప్రాంతంలో ఏర్పడిన వ్యాస్క్యులర్ ట్యూమర్‌తో (హార్మోన్ సెన్సిటివ్ ట్యూమర్) బాధపడుతున్న యువకుడికి గుంటూరు ప్రభుత్వ వైద్య బోధన ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఈఎన్‌టీ, కార్డియాలజిస్టులు కలసి ఈ సర్జరీ చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రూ.5 లక్షల విలువైన ఆపరేషన్‌ను ఉచితంగా చేశారు. వివరాల్లోకి వెడితే... కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గౌస్ పీర్ అనే యువకుడు కొంతకాలంగా ముక్కులో ఏర్పడిన కణితితో బాధపడుతున్నాడు. తరచు ముక్కు నుంచి రక్తం కారడం, ముక్కు బిగేయడం, తలనొప్పి, ముఖం ఉబ్బరించడం, వాసన తెలియకపోవడం వంటి సమస్యలు అతడిని వేధించేవి. వైద్య పరిభాషలో ఈ కణితిని నాసోఫారింజియల్ యాంజియోఫైబ్రోమాగా పిలుస్తారు. కణితిలో పలు రక్తనాళాలు కలసి ఉండటంతో సర్జరీ సమయంలో ఏ కాస్త అజాగ్రత్తగా ఉన్నా విపరీతమైన రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది. ఈ కారణంగా చికిత్స కోసం పీర్ పలు ఆసుపత్రులుకు వెళ్లినా సర్జరీకి వైద్యులు ధైర్యం చేయలేకపోయారు.

సమష్టిగా శస్త్రచికిత్స...

బాధితుడు చివరి ప్రయత్నంగా గత నెల 22న చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఈఎన్‌టీ విభాగానికి వచ్చారు. ఈఎన్‌టీ ప్రొఫెసర్ ఉప్పాల శ్రీనివాసరావు, రోగికి వైద్య పరీక్షల నిర్వహించి ముక్కులో ఏర్పడిన కణితి పరిణామం పెద్దదిగా ఉందని గుర్తించారు. కుటుంబ సభ్యుల ఆమోదంతో ఆపరేషన్‌కు సిద్ధం చేశారు. తొలుత కార్డియాలజీ ప్రొఫెసర్ ఎస్.శ్రీకాంత్, యాంజియోగ్రామ్ చేసి కొన్ని ప్రత్యేక పద్ధతుల ద్వారా ఈ కణితికి వెళ్లే రక్తప్రసారం తగ్గించారు. అనంతరం ఈఎన్‌టీ వైద్యులు ఎండోస్కోప్, మైక్రోడీబ్రైటర్ పరికరాలు ఉపయోగించి కణితిని తొలగించారు.

ఎంఈఓ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

గుంటూరు(విద్య), జూలై 13: ఎంఈవో అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని శనివారం గుంటూరులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా టీవీ రామకృష్ణ (పశ్చిమగోదావరి), జనరల్ సెక్రటరీగా ఆర్.సుబ్బారావు (గుంటూరు), కోశాధికారిగా కె.కొండారెడ్డి (ప్రకాశం), సహాధ్యక్షులుగా హెచ్.గురుప్రసాద్ (అనంతపురం), గౌరవాధ్యక్షుడిగా ఎస్‌వీసీ హెచ్ సుబ్రహ్మణ్యం (ప్రకాశం), మహిళా కార్యదర్శిగా రామామణి, రాష్ట్ర సలహాదారునిగా డాక్టర్ రామచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆదివారం

ప్రథమార్థం... పరిశ్రమకో వివాదం

ఎంతో గౌరవాన్ని అందుకున్న సౌత్ సినిమా తన స్థాయిని తానే తగ్గించుకుంటోందా! డ్రగ్స్, వివాహేతర సంబంధాలు, లైంగిక వేధింపులు, బహిరంగ దూషణలు.. ఒకటేమిటి రకరకాలుగా వివాదాలతో వార్తల్లో నిలుస్తూ నిత్యం జనం నోళ్లలో నానుతోంది. టాలీవుడ్ ఒక్కటే కాదు, మాలీవుడ్, శాండల్‌వుడ్, కోలీవుడ్... పరిశ్రమ ఏదైనా ఈ ఏడాది ఆరంభం నుంచి ఏదో ఒక వివాదంతో జనం నోళ్లలో నానుతోంది.

2017లో టాలీవుడ్ మెడకు చుట్టుకున్న డ్రగ్స్ కేసు ఇప్పటికీ వదలడం లేదు. పరిశ్రమలోని కొన్ని పెద్ద తలకాయలే పోలీసుల విచారణకు హాజరయ్యారు. నెలల తరబడి విచారణ, రక్త నమూనాల సేకరణ, న్యాయస్థానాల విచారణలతో వార్తల్లో నిలిచింది. నిజానిజాల సంగతి ఎలా ఉన్నా టాలీవుడ్ ఇమేజ్‌ను దెబ్బతీసింది. ఇప్పటికీ పరిస్థితిలో మార్పేం లేదు. ఏదో ఒక సందర్భంలో ఎవరో ఒకరు డ్రగ్స్ కేసులో దొరకడం, అరెస్టవడం లాంటి సంఘటనలతో పరిశ్రమ వైపు వేలెత్తి చూపే పరిస్థితి ఏర్పడింది. ఇటీవలే బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన నటి హేమ వ్యవహారంలో హడావిడి తెలిసిందే. ఇదిలా సద్దుమణిగిందో లేదో రాజ్‌తరుణ్ అతని మాజీ ప్రియురాలు లావణ్య కేసు తెరపైకి వచ్చింది. ఇందులో వర్ధమాన కథానాయిక మాల్వీ మల్హోత్రా పేరు తెరపైకి వచ్చింది. కేసులు, విమర్శలు, పోటాపోటీ ఇంటర్వ్యూలతో ట్రెండింగ్‌లో నిలుస్తున్నారు. ప్రేమ, పెళ్లి, వివాహేతర సంబంధం ఇలా పలు కోణాల్లో ఆరోపణలు, ప్రత్యారోపణలతో వినోదం పంచుతున్నారు.



అభిమానినే హత్య చేసిన హీరో

ప్రియురాలు కోసం సొంత అభిమానినే చంపుకున్న హీరోగా ఛీత్కారాలకు గురవుతున్నాడు కన్నడ హీరో దర్శన్. రేణుకా స్వామి అనే అభిమానిని చిత్ర హింసలు పెట్టి చంపిన ఘటన కన్నడ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించింది. హత్య కేసులో ప్రస్తుతం జైల్లో ఊచలు లెక్కబెడుతున్నాడు దర్శన్. తొలుత ఈ కేసులో కన్నడ అగ్రహీరో కిచ్చా సుదీప్ పేరు వినిపించినా, ఆ తర్వాత ఆయన ప్రమేయం లేదని విచారణలో తేలింది.

మరోసారి బెడ్ రూమ్ వీడియోలతో

కొన్నేళ్ల క్రితం కోలీవుడ్ హీరోలు, హీరోయిన్ల బెడ్‌రూమ్ వీడియోలు లీక్ అవ్వడం సంచలనం సృష్టించింది. తాజాగా తమిళ చిత్ర పరిశ్రమలో మళ్లీ ఆ వీడియోల గొడవ మొదలైంది. సుచీ లీక్స్ పేరుతో కొన్నేళ్ల క్రితం తమిళ హీరో, హీరోయిన్ల శృంగార వీడియోలు, రహస్యాలు బయటకు వచ్చి సన్సేషన్ క్రియేట్ చేశాయి. అయితే ఆ వీడియోలు బయటకు రావడంలో త్రిష, ధనుష్ పాత్ర ఉందంటూ గాయని సుచిత్ర తాజాగా ఆరోపణలు చేస్తున్నారు.

గతేడాదిచివర్లో కోలీవుడ్ నటుడు మన్సూర్ అలీఖాన్ కథానాయిక త్రిషపై తన వాచాలత్వాన్ని ప్రదర్శించాడు. 'త్రిషతో బెడ్‌రూమ్ సీన్ కావాలి' అని ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం రేపాయి. 'లియో' సినిమాలో తాను త్రిషపై అత్యాచారం చేసే సన్నివేశం లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. 'గతంలో ఖుష్బూ, రోజా లాంటి నటీమణులతో రేప్ సీన్లు చేశాను. లియోలో అవకాశం వచ్చినప్పుడు అలాంటి సీన్ ఉంటుందని ఆశించాను. అది జరగ్గపోవడంతో నిరాశపడ్డాను' అని ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తమిళ పరిశ్రమ ప్రముఖులు కొందరు మన్సూర్ వ్యాఖ్యలను ఖండించారు.

మాలీవుడ్‌లో మల్టీప్లెక్స్ వివాదం

అయితే వీటన్నింటికి భిన్నమైన వివాదంతో ఈ ఏడాది మలయాళ చిత్ర పరిశ్రమ వార్తల్లో నిలిచింది. పరిమిత బడ్జెట్‌తో తెరకెక్కిన మాలీవుడ్ చిత్రాలు పర భాషల్లోకి డబ్ అయ్యి మంచి వసూళ్లను సాధిస్తున్నాయి. 'ప్రేమలు, భ్రమయుగం, మంజుమ్మెల్ బాయ్స్' లాంటి మలయాళ సినిమాలు పరభాషల్లోనూ ఆదరణ పొందాయి. అయితే పృథ్వీరాజ్ కథానాయకుడిగా నటించిన 'ఆడుజీవితం' చిత్రం ప్రదర్శనను మల్టీప్లెక్స్‌లు నిలిపివేశాయి. వర్చువల్ ప్రింట్ ఫీజుకు సంబంధించి మల్టీప్లెక్స్ సంస్థలు, కేరళ సినీ నిర్మాతల సంఘానికి మధ్య ఏర్పడిన వివాదమే దీనికి కారణం. అకస్మాత్తుగా సినిమాను ఎత్తేయడంతో నిర్మాతలకు నష్టం వాటిల్లింది. దీంతో ఇకపై ఏ మలయాళ సినిమాను మల్టీప్లెక్స్‌ల్లో ప్రదర్శించేందుకు ఇవ్వబోమని కేరళ సినీ నిర్మాతల సంఘం హెచ్చరించడం, కేరళ ప్రభుత్వం రంగంలోకి దిగి చర్చలు జరపడంతో ఈ వివాదం సద్దుమణిగింది.

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
కోబ్రా కై	వెబ్‌సిరీస్	జూలై 18
త్రిభువన్ మిశ్రా సీఏ	హిందీ సిరీస్	జూలై 18
ఫైండ్ మీ ఫాలింగ్/	హాలీవుడ్ మూవీ	జూలై 19
స్వీట్ హోమ్	కొరియన్ సిరీస్	జూలై 19
అమెజాన్ ప్రైమ్		
షై స్పై	హాలీవుడ్ మూవీ	జూలై 18
జీ 5		
బహిష్కరణ	తెలుగు సిరీస్	జూలై 19
బర్జాబ్/	హిందీ సిరీస్	జూలై 19
లయన్స్ గేట్ ప్లే		
అర్కేడియన్	హాలీవుడ్ మూవీ	జూలై 19
జియో సినిమా		
మిస్టర్ బిగ్‌స్టఫ్	వెబ్‌సిరీస్	జూలై 18
ఆపిల్ టీవీ ప్లస్		
లేడీ ఇన్ ది లేక్	వెబ్‌సిరీస్	జూలై 19
డిస్కవరీ ప్లస్		
ది బ్లాక్ విడోయర్	వెబ్‌సిరీస్	జూలై 18
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
నాగేంద్రన్స్ హనీమూన్స్	మలయాళ చిత్రం(తెలుగులో)	జూలై 19







మన దేశం గర్వించదగిన నటులలో **నవాజుద్దీన్ సిద్ధిఖీ** ఒకరు. 'భజరంగ్ భాయిజాన్' సినిమాలో ఒక చిన్న పాత్రలో అందరినీ ఆకర్షించిన నవాజుద్దీన్ ఆ తర్వాత అనేక సినిమాల్లో.. ఓటీటీ వెబ్‌సిరీస్‌లలో తన నటనా కౌశల్యాన్ని ప్రదర్శించారు. ప్రేక్షకుల మన్ననలు పొందారు. తాజాగా జీ5 ఓటీటీలో వస్తున్న 'రౌతావు కా రాజ్' అనే సిరీస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా నటిస్తున్న నవాజుద్దీన్‌ను 'నవ్య' పలకరించింది.

ఎలా నటించకూడదనే విషయాన్నే ఆలోచిస్తా


సండే సెలబ్రిటీ

ఈ వెబ్ సిరీస్‌లో నటించటం ఎలా అనిపిస్తోంది?

చాలా బావుంది. ఈ సిరీస్‌లో నాది ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ పాత్ర. ఒక చిన్న ఊరు. అక్కడ నివసించే ప్రజలు. అక్కడో మర్డర్. దానిని పరిష్కరించాలి. నా ఉద్దేశంలో చాలా సింపుల్‌గా కనిపించే పాత్రలను ప్రేక్షకులు ఇష్టపడతారు. నేను కూడా అలాంటి పాత్రలే చేయాలని కోరుకుంటూ ఉంటా!

మీరు సినిమాల్లోనూ, ఓటీటీల్లోనూ నటించారు. ఈ రెండింటికీ ఏదైనా తేడా కనిపించిందా?

నా ఉద్దేశంలో ఒక మంచి నటుడికి ఓటీటీ అయినా.. సినిమా అయినా ఒకటే. కెమెరా ముందు నిలబడినప్పుడు- నటనలో ఎటువంటి తేడా ఉండదు. అయితే ఈ రెండింటికీ కొన్ని మౌలికమైన తేడాలున్నాయి. సినిమా బావుంటే ప్రేక్షకుల స్పందన వెంటనే తెలిసిపోతుంది. ఓటీటీలో



అయితే కొద్ది సమయం పడుతుంది. ఉదాహరణకు ఒక సినిమా శుక్రవారం విడుదలయిందనుకుందాం. బావుంటే ఓకే! లేకపోతే ఫ్యాన్స్ నిర్మాతలు కలిపి శని, ఆదివారాలు బలవంతంగా ఆడించగలరు. సోమవారం మాత్రం ఆడించలేరు. అప్పటికి ప్రపంచమంతా ఆ సినిమా బాలేదని తెలిసిపోతుంది. అంటే కంటెంట్ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారు. లేకపోతే మనం ఎంత బలవంతంగా వాళ్లపై రుద్దినా ప్రయోజనం ఉండదు.

నటుడిగా పైకి రావటం కష్టమా.. వచ్చిన తర్వాత ఆ స్థానాన్ని నిలబెట్టుకోవటం కష్టమా?

దీనికి సమాధానంగా నా కథనే తీసుకుందాం. నేను ఒక చిన్న పట్టణం నుంచి వచ్చాను. చాలా ఆటుపోట్లు ఎదుర్కొని నటుడిని అయ్యాను. విజయం సాధించాను. ఇప్పుడు అనేక ప్రాజెక్టుల్లో నటిస్తున్నాను. అంటే పైకి వచ్చినట్లే కదా! నా వరకూ ఆ తర్వాత ఏం జరుగుతుందనే విషయాన్ని నేను ఆలోచించను. నటనకు సంబంధించిన విషయాల్లో- మొదటి రోజు ఎంత నిజాయితీగా ఉన్నానో ఇప్పుడు కూడా అంతే నిజాయితీగా ఉన్నాను. నాకు ఫలితం ముఖ్యం కాదు. నిర్మాణ ప్రక్రియను ఎంజాయ్ చేస్తాను. నా చుట్టుపక్కల ఏమవుతోంది? ఇండస్ట్రీలో ఏం జరుగుతోంది? సినిమా రిలీజ్ ఎలా?- ఇలాంటి విషయాలను నేను పట్టించుకోను. నా పాత్రకు నేను ఎంత న్యాయం చేస్తున్నాను.. అనే అంశంపై నా దృష్టంతా ఉంటుంది. అయితే ఎవరైనా

> ఆంథోని హాప్‌కిన్స్, కమల్ హాసన్, నజీర్‌సాబ్... వీళ్లందరూ నా అభిమాన నటులు. వీరు సహజనటులు. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోతారు.

> దక్షిణాది భాషల్లో కూడా నటించాలనుకుంటున్నాను. తెలుగులో కూడా మంచి పాత్ర వస్తే చేస్తాను. నా వద్ద కొన్ని స్క్రిప్ట్స్ ఉన్నాయి. మిగిలిన వివరాలు ఇప్పుడే చెప్పలేను.

> మళయాళం సినిమాలంటే నాకు చాలా ఇష్టం. వాటిలో కొన్ని ప్రయోగాలు జరుగుతున్నాయి. అక్కడ తీసేవన్నీ చిన్న సినిమాలే. కానీ ప్రేక్షకులపై అవి చూపే ప్రభావం మాత్రం చాలా ఎక్కువగా ఉంటుంది. నిజ జీవితంలో సంఘటనలే వారు చూపిస్తారు. ఇక పాన్ ఇండియా అనే భావనపై నాకు అంత ఆసక్తి లేదు.

వచ్చి- 'మీరు బాగా చేశారు' అని పొగిడితే మాత్రం చాలా ఆనందంగా అనిపిస్తుంది. మంచి మోటివేషన్ వస్తుంది.

మీ ఉద్దేశంలో ప్రేక్షకులకు ఎలాంటి పాత్రలు నచ్చుతాయి..?

సినిమాలో ఒక పాత్రను చూసిన తర్వాత- 'ఇది ఫలానా వాళ్లలా ఉంది.. ఇలాంటి వాళ్లను మా సొసైటీలో చూశాను..' అని ప్రేక్షకులు అనుకుంటే- ఒక నటుడు విజయవంతమయినట్లే! అయితే ఈ తరహా నటన అంత సులభం కాదు. చాలా కష్టం. పది మందిని కొట్టడం.. జెండాను పట్టుకొని పరిగెత్తడం.. ఇలాంటివి చేయటం సులభం. ప్రేక్షకుల హృదయాలను తాకటం మాత్రం చాలా కష్టం.

మీరు చేసిన పాత్రల్లో అతి కష్టమైనది ఏమిటి?

చాలా ఉన్నాయి. 'హడ్డి'లో పాత్ర చాలా కష్టం. 'బాల్ థాకరే'.. 'రామన్ రాఘవ్'లలో పాత్రలు కూడా చాలా కష్టం. ఉదాహరణకు బాల్ థాకరేనే తీసుకుందాం. దీనిని చూసిన వారికి- బాల్ థాకరేను నేను అనుకరిస్తున్నాననో.. ఆయన గొంతును మిమిక్రీ చేస్తున్నాననో అనుకోకూడదు. నవాజ్ ఈ పాత్రను చేస్తున్నాడు అనుకోవాలి. అదే సమయంలో బాల్ థాకరే కూడా వారికి కనిపించాలి. ఇది చాలా కష్టమైన ప్రక్రియ. మెథడ్ యాక్టింగ్‌లో కష్టం ఇదే! ప్రేక్షకులకు- 'నేను బాల్ థాకరేలా' నటిస్తున్నానని ఒక ఇంప్రెషన్ ఇవ్వాలి. కానీ ప్రేక్షకులకు తాము చూసే వ్యక్తి- బాల్‌థాకరే, నవాజ్ ఇద్దరూ అని భావించాలి. అలాగే హడ్డిని కూడా తీసుకుందాం. ఇందులో నేను ట్రాన్స్‌జెండర్ పాత్రలో నటించాను. నేను ట్రాన్స్‌జెండర్‌లను కాపీ కొట్టకూడదు. కానీ వాళ్లలాగా కనిపించాలి. నేను ఏదైనా పాత్రను చేసేటప్పుడు- దీనిలో ఎలా నటించాలనే విషయం కన్నా 'ఎలా నటించకూడదు' అనే విషయాన్ని ఎక్కువగా ఆలోచిస్తా.

ఇలాంటి పాత్రల కోసం ఎలాంటి హోంవర్క్ చేస్తారు?

ఆ పాత్ర గురించి లోతుగా తెలుసుకుంటా. దానికి తగినట్లుగా నా బాడీ లాంగ్వేజ్ మార్చుకుంటా.

• సీవీఎల్ఎన్ ప్రసాద్

కథానాయికగానే కాదు... నిర్మాత, వ్యాపారవేత్తగానూ పేరు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ప్రీతి జింతా. ఐపీయల్‌లో పంజాబ్ జట్టు సహ యజమాని కూడా అయిన ఆమెది అటు కెరీర్‌లో... ఇటు వ్యక్తిగత జీవితంలో విజయవంతమైన ప్రయాణం.

వారే నా ప్రపంచం

ప్రీతి జింతా అంటే సొట్టబుగ్గల అందం. బాలీవుడ్ కథానాయికగా ఆమె క్రేజ్ విభిన్నం. పక్కా క్రికెట్ ఫ్యాన్. ఐపీఎల్ ఫ్రాంఛైజీ సహ యజమానిగా ఆమె చేసిన సాహసం కొనియాడాల్సిందే. ఇన్‌స్టాలో ఆమెను కోటిమందికి పైగా ఫాలో అవుతున్నారు. అందులో తన కెరీర్‌తో పాటు లైఫ్‌స్టయిల్ విషయాలనూ షేర్ చేస్తుంటుంది. 'ప్రతి రోజూ కొత్త ఛాలెంజ్. నటిగా అయినా, పారిశ్రామికవేత్తగా అయినా పని విషయంలో రాజీ ఉండదు' అంటుందీమె.

అలా వెండితెరకు...

హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో పుట్టింది ప్రీతి. రాజ్‌పుత్ వంశానికి చెందిన వ్యక్తి. ఆమె తండ్రి మిలిటరీలో ఆఫీసర్‌గా పని చేశారు. 'సిమ్లా లాంటి అందమైన ప్రదేశంలో పుట్టి పెరగటం అదృష్టం' అంటుందీమె. ప్రీతికి ఇద్దరు అన్నదమ్ములు. చిన్నప్పటి నుంచే టామ్‌బాయ్‌లా పెరిగింది. జీసెస్ అండ్ మేరీ బోర్డింగ్ స్కూల్‌లో చదవటం వల్ల ఆమెకు క్రమశిక్షణ అబ్బింది. ముఖ్యంగా బోర్డింగ్ స్కూల్‌లో ఒంటరిగా ఉండటం వల్ల బయటి ప్రపంచంతో ఎలా మెలగాలో తెలుసుకుంది. కవిత్వం అంటే ప్రేమ అక్కడే పుట్టింది. వాలీబాల్ ఆడేది. షేక్స్‌పియర్ పోయెట్రీని విపరీతంగా ఇష్టపడేది. డిగ్రీ అయ్యాక.. క్రిమినల్ సైకాలజీ చదివింది. ఆ తర్వాత మోడలింగ్ చేసింది. చాక్లెట్ యాడ్‌లో నటించిన తర్వాత ఆమెకు బ్రాండ్స్‌తో పాటు సీరియల్స్‌లో కూడా అవకాశాలు వచ్చాయి. అలా ఆమె కెరీర్ ప్రారంభమైంది. దర్శకులు శేఖర్ కపూర్ ఓ సినిమాకి

> కేవలం నటనకే పరిమితం కాకుండా ఎప్పటికప్పుడు తన పయనాన్ని మార్చుకుంది ప్రీతి. అడుగెట్టిన ప్రతిచోటా విజయం అందుకుంది. కొన్ని సామాజిక కార్యక్రమాల్లో కూడా పాల్గొంది. ముఖ్యంగా చైల్డ్, విమెన్ ట్రాఫికింగ్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో భాగమైంది.

అవకాశం ఇచ్చారు. అయితే ఆ సినిమా ఆగిపోయింది. శేఖర్‌కపూర్ రిఫరెన్స్‌తో మణిరత్నం 'దిల్ సే'లో అవకాశం వచ్చింది. 'సోల్జర్' అనే చిత్రం ప్రారంభమైనా ఆలస్యంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. అయితే ఈ రెండు చిత్రాలకూ 'ఫిల్మ్‌ఫేర్ బెస్ట్ డెబ్యూట్ యాక్ట్రెస్'గా అవార్డు దక్కించుకుంది. దీంతో ప్రీతి కెరీర్ ఊపందుకుంది.

ఎక్కడా ఆగలేదు...

ఈలోపు 'ప్రేమంటే ఇదేరా', 'రాజకుమారుడు'.. లాంటి తెలుగు చిత్రాలతో దక్షిణాది ప్రేక్షకులకు దగ్గరైంది. బాలీవుడ్‌లో 'మిషన్ కాశ్మీర్', 'చోరీ చోరీ చుప్కే



చుప్కే', 'దిల్ చాహతా హై', 'కోయి మిల్ గయా', 'వీర్ జారా', 'సలామ్ నమస్తే', 'కభీ అల్విదా నా కెహనా' లాంటి విజయాలు అందుకుంది. 2007 తర్వాత ఆమె హవా తగ్గింది. అయినా టెలివిజన్ లైవ్‌షోస్‌లో కనిపించింది. అక్కడితే కెరీర్‌కు ఫుల్‌స్టాప్ పెట్టకుండా అతిథి పాత్రల్లో కనపడేది. 2011లో ప్రొడక్షన్ కంపెనీ పెట్టింది. ఆ తర్వాత క్రికెట్ వీరాభిమాని కావటంతో నెస్‌వాడియా, మోహిత్ బర్మన్‌లాంటి పెట్టుబడిదారులతో కలసి కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఐపీయల్ జట్టు బాధ్యతలు తానూ తలకెత్తుంది. పబ్లిసిటీ ఇవ్వటానికి తానూ భాగమై నడిచింది.

'ఇంత ప్రేమ నాకెక్కడా దొరకదు'...

2016లో అమెరికన్‌ను పెళ్లిచేసుకుంది ప్రీతి. అతను బిజినెస్‌మాన్. పవర్ కంపెనీకి వైస్‌ప్రెసిడెంట్. పెళ్లి తర్వాత ప్రీతిజింతా పూర్తిగా లాస్‌ఏంజెల్స్‌కే పరిమితమైంది. తరచుగా మన దేశానికి వచ్చిపోతోంది. అన్నట్లు సరోగసీ పద్ధతిలో ఒక కొడుకు, కూతురు. ప్రస్తుతం రాజ్ కుమార్ సంతోషి దర్శకత్వంలో 'లాహోర్ 1947' చిత్రంలో నటిస్తోంది. ఇదో పీరియాడిక్ ఫిల్మ్. 'ఇకమీదట సినిమాలు వచ్చినా చేయలేను. బిజినెస్‌తో పాటు పర్సనల్ లైఫ్ ముఖ్యం అనిపిస్తోంది. హీరోయిన్లను జనాలు త్వరగా మర్చిపోతారు. ఏమీ చేయలేం. ఇప్పటికైతే పిల్లలే నాప్రపంచం. ఇంత ప్రేమ నాకెక్కడ దొరకదు' అంటోంది ప్రీతి జింతా.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Jo9LuP1లో చదవండి.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2K7rzhGలో చదవండి.

శాకుంతలం... కాళిదాసు సృజించిన అద్భుతం!



అలనాటి కథ

వానాకాలం వచ్చిదంటే... 'శాకుంతలం'లోని మేఘ సందేశం జ్ఞాపకం వస్తుంది. మహాకవి కాళిదాసు వర్ణనలు గుర్తుకొస్తాయి. ప్రపంచమంతా మెచ్చుకున్న 'అభిజ్ఞాన శాకుంతలం' గురించి ఇప్పటి కవులకు పెద్దగా తెలియకపోవచ్చు. కానీ తప్పనిసరిగా తెలుసుకోవాల్సిన అవసరం మాత్రం ఎంతైనా ఉంది. 'శాకుంతలం' అనగానే... నేను, శేషేంద్ర కలిసి ఉజ్జయినిలోని 'ప్రేమ్‌చంద్ పీఠాన్ని' సందర్శించిన రోజులు గుర్తుకొచ్చాయి.

ఉజ్జయినీ అనగానే గుర్తుకొచ్చేవి రెండు.. ఒకటి మహాకాల్ గుడి. రెండోది శాకుంతలం. ఈ అద్భుత గ్రంథంలోని మేఘదూతంలో మహాకవి కాళిదాసు ఉజ్జయినీ వర్ణిస్తాడు. ఉజ్జయినీలోని ప్రేమచంద్ పీఠం ఆహ్వానించటంతో నేను శేషేంద్ర ఉజ్జయినీకి వెళ్లాం. అక్కడ మమల్ని స్వాగతించటానికి- పీఠం అధ్యక్షుడు, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత నరేష్ మెహతా వచ్చారు. మమల్ని హోటల్‌కు తీసుకువెళ్లారు. ఆ హోటల్ అంతా ఒకటే ఫ్లోర్. పక్కనే అందమైన మొక్కలతో గార్డెన్. ఆ రోజు రాత్రి ఇద్దరు గ్రీకు ఆర్టిస్టులు- 'శాకుంతలం' ఇంగ్లీషు నాటకాన్ని వేశారు. ఎన్ని భాషల్లోకి తర్జుమా అయినా ఆత్మను కోల్పోని నాటకమది. నేను కూడా హిందీ అనువాదాన్ని చదివాను. ఆ మర్నాడు ఉదయాన్నే లేచాం. ఉదయాన్నే పీఠంలో కార్యక్రమం. మేము తయారవుతున్నాం. హోటల్ అంతా హడావిడిగా ఉంది. ఎందుకో నాకు అర్థం కాలేదు. బయటకు వచ్చి చూశాను. ఒక ఫ్రెంచి అమ్మాయి నా దగ్గరకు వచ్చి- 'మీకు ఎగ్ ప్లాంట్ ఎక్కడ దొరుకుతాయో తెలుసా? హోటల్ వాళ్లు చెప్పలేకపోతున్నారు' అంది. మన వంకాయను ఇంగ్లీషులో ఎగ్ ప్లాంట్ అంటారని హోటల్ వాళ్లకు తెలియకపోవటం వల్ల ఆ అమ్మాయి హడావిడి చేస్తోంది. ఎగ్‌ప్లాంట్‌ను హిందీలో అంటారని చెప్పిన తర్వాత ఆమె హోటల్ కిచెన్‌లోకి వెళ్లి వాటిని తెచ్చుకుంది. హమయ్య! హడావిడి అయిపోయిందనుకొనే సరికి పొడవుగా ఉన్న ఒకాయన మా రూమ్‌కు వచ్చాడు. "నా పేరు రాధ వల్లభ త్రిపాఠి.. శేషేంద్రజీని కలవటానికి వచ్చాను" అన్నాడు. ఆయనను రూమ్‌లోపలికి తీసుకువెళ్లి కూర్చోబెట్టాను. శేషేంద్ర, ఆయన మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. త్రిపాఠి నాట్యశాస్త్రం గురించి మాట్లాడటం మొదలుపెట్టారు. శేషేంద్ర కూడా ఆయనకు ధీటుగా తన వద్దనున్న సమాచారాన్ని చెప్పటం మొదలుపెట్టాడు. శేషేంద్రకు నాట్యశాస్త్రం గురించి అంత విపులంగా తెలుసని నేను ఎప్పుడూ అనుకోలేదు. ఈ లోపులో టీ వచ్చింది. త్రిపాఠి టీ తాగి లేచి వెళ్లిపోయాడు. శేషేంద్ర జ్ఞానాన్ని పరీక్షించటానికి ఆయన మా గదికి వచ్చాడా అనిపించింది.

మేము పీఠానికి వెళ్లాం. మా సెషన్‌కు ప్రముఖ



కర్ణాటక సంగీత విద్వాంసుడు బాలమురళీ సహా అనేక మంది ప్రముఖులు వచ్చారు. ఢిల్లీలోని జేఎన్‌యూ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆ సెషన్‌కు అధ్యక్షుడు. ఒక దేశ అంబాసిడర్ భార్య అన్న కూడా ఉపన్యాసాలు వినటానికి వచ్చింది. సెషన్ ప్రారంభమవుతుందనగా- ఎవ్వరూ ఊహించని విధంగా- 'రచయితలు ముందుగా తయారు చేసుకున్న పత్రాలు చదవద్దు. ఉపన్యాసం మాత్రమే ఇవ్వండి' అని త్రిపాఠి కోరారు. దానితో శ్రోతల్లో కూడా కలకలం రేగింది. శేషేంద్ర వంతు వచ్చింది. శేషేంద్ర లేచి తన ప్రసంగాన్ని ఒక సంస్కృత శ్లోకంతో ప్రారంభించాడు. దానికి ప్రతిగా శ్రోతల్లో ఒకరు మరో శ్లోకాన్ని చదివారు. దానికి కొనసాగింపుగా శేషేంద్ర మరో శ్లోకాన్ని చదివాడు. సభ అంతా ఇలా రంజుగా సాగింది. ఒక అంబాసిడర్ భార్య ముందు పరువు పోనందుకు నాకు చాలా ఆనందం వేసింది. ఆ సెషన్ ముగిసే ముందు- పీఠం అధ్యక్షుడు నరేష్ మెహతాను- శాకుంతలం గురించి కొన్ని మాటలు మాట్లడమని అడిగారు. "నేను కాళిదాసును చదవలేదు. నేను ఏం మాట్లాడతాను" అన్నారు నరేష్ మెహతా. అక్కడున్న ప్రేక్షకులు అవాక్కయ్యారు.

ఆ రోజు సాయంత్రం మెహతా మా రూమ్‌కు వచ్చారు. "అసలు నేను చదవని పుస్తకం గురించి మాట్లాడమని నన్ను ఎలా అడుగుతారు" అని గొణగటం మొదలుపెట్టాడు. శాకుంతలం గ్రంథాన్ని మెహతా చదవలేదనే విషయం నాకు ఆశ్చర్యమేసింది. "నన్ను అడిగితే- నా దగ్గరున్న హిందీ ట్రాన్స్‌లేషన్ అయినా ఇచ్చేదాన్ని కదా.." అనుకున్నా. సాధారణంగా హిందీ రచయితలు- గొప్ప సంస్కృత గ్రంథాలన్నింటినీ చదువుతారని అనుకుంటారు. కానీ అది వాస్తవం కాదనే విషయం నాకు ఆ రోజు తెలిసింది. ఆ మర్నాడు అంబాసిడర్ భార్య అన్నా ఢిల్లీకి వెళ్లిపోయింది. ఆమెను అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావును కలవమని చెప్పాం. ఆమె ఢిల్లీ నుంచి మద్రాసు వెళ్లి ప్రొఫెసర్ పానీకర్ అనే మళయాళం రచయితను కలిసింది. ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చి నన్ను కూడా కలిసింది.

> ఉజ్జయినికి సమీపంలో ఉన్న పెద్ద నగరం ఇండోర్. ఇండోర్ రాజకుటుంబంతో మాకు సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఇండోర్ మహారాజు శ్రీమంత్ టుకోజీ రావ్ మహారాజ్, ఆయన శర్మిష్ట దేవి ముంబయిలోని ధన్‌రాజ్ మహల్‌కు వస్తూ ఉండేవారు. ఒక దశలో వారి కుమార్తె సుశీలారాజే హోల్కర్‌ను మా తమ్ముడికి ఇచ్చి పెళ్లి చేద్దామనుకున్నారు కూడా.

విశ్వవిదిత 'శాకుంతలం'

శాకుంతలాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆదరించారు. ఆదరిస్తున్నారు. ఇంగ్లీషు నుంచి జర్మన్‌కు అనువాదమయిన తొలి గ్రంథం శాకుంతలం. ప్రఖ్యాత జర్మన్ రచయిత గోథే- శాకుంతలాన్ని చదివి ఆనందంతో డ్యాన్స్ చేశాడని చెబుతారు. "శాకుంతలాన్ని చదివేటప్పుడు కలిగే అనుభూతి అసామాన్యం" అంటాడా కవి. ఆయనే కాళిదాసును 'షేక్స్పియర్ ఆఫ్ ఇండియా' అని పిలిచాడు కూడా! జర్మన్ తత్వవేత్త ఆర్థర్ షోపెనూర్ కూడా శాకుంతలంపై ప్రశంసల జల్లు కురిపించాడు. ఆర్థర్ రాసిన పుస్తకాలలో మన చందోగనిషత్‌కి చెందిన 'తత్వమసీ' అనే భావన... విల్ అండ్ రిప్రజంటేషన్‌గా కనిపిస్తుంది. "దుష్యంతుడి కోసం వెళ్లే ముందు వశిష్టుడి కోసం శకుంతల వేచి చూస్తూ ఉంటుంది. ఆయన వచ్చిన తర్వాత శకుంతల నమస్కారం చేసి- 'తెలియనితనంతోను.. అమాయకత్వంతోను 'నేను నిన్ను నాన్న అని పిలిచాను. నువ్వు మహాముని వశిష్టుడివి అనే మాట మరిచాను..' అంటుంది. అప్పుడు వశిష్టుడి కంట నీరు కారుతుంది. శకుంతల ఆయనకు మూడు ప్రదక్షిణలు చేసి, కాళ్లకు నమస్కారం చేసి బయలుదేరుతుంది. ఈ ఒక్క ఘట్టంలో అనేక కోణాలు మనకు తెలుస్తాయి" అంటారు ఆర్థర్.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్

ఆండ్రాయిడ్ యూజర్లకు హెచ్చరిక!



పలు వ్యవస్థల్లో తీవ్ర లోపాలు.. 12, 12ఎల్, 13, 14 వెర్షన్లకు ప్రమాదం

- హ్యాకర్లు పంజా విసిరే చాన్స్.. సెర్ట్ హెచ్చరిక
- ప్యాచ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని సూచన

న్యూఢిల్లీ, జూలై 13: భారత సైబర్ సెక్యూరిటీ సంస్థ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్ ఇండియా) దేశంలోని ఆండ్రాయిడ్ యూజర్లకు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. 10 కోట్లకు పైగా ఆండ్రాయిడ్ ఫోన్లు ప్రమాదంలో ఉన్నట్లు అప్రమత్తం చేసింది. ఈ కోవలో దిగ్గజ సంస్థలు సామ్‌సంగ్, రియల్‌మీ, షామీ, వివో, వన్‌ప్లస్ స్మార్ట్‌ఫోన్లు కూడా ఉన్నాయి. ఆండ్రాయిడ్ ఫోన్లలోని సిస్టమ్ ఫ్రేమ్ వర్క్, గూగుల్ ప్లే సిస్టమ్ అప్‌డేట్‌లు, కర్నల్, ఏఆర్ఎం కాంపొనెంట్లు, మీడియాటెక్ కాంపొనెంట్లు, క్వాల్కమ్ కాంపొనెంట్లు, క్వాల్కమ్ క్లోజ్-సోర్స్ కాంపొనెంట్లలో లొసుగులను గుర్తించినట్లు సెర్ట్ వివరించింది. ఆండ్రాయిడ్ వెర్షన్లు 12, 12ఎల్, 13, 14లో గుర్తించిన ఈ లొసుగులను ఆసరాగా చేసుకుని, హ్యాకర్లు పంజావిప్పే ప్రమాదముందని హెచ్చరించింది. యూజర్లు అప్రమత్తమవ్వకుంటే.. వారి సున్నితమైన డేటాను హ్యాకర్లు తస్కరించవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. పైన పేర్కొన్న వెర్షన్ల ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను వినియోగించే స్మార్ట్‌ఫోన్ యూజర్లు వెంటనే సెక్యూరిటీ ప్యాచ్‌లను అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది. నైజీరియాలో ఈ నెల 10న ఆండ్రాయిడ్‌లోని లొసుగులతో హ్యాకర్లు 70 వేల స్మార్ట్‌ఫోన్లపై పంజా విసిరినట్లు ఆ దేశ ప్రభుత్వ సైబర్ సెక్యూరిటీ సంస్థ వెల్లడించింది. ప్రస్తుతం గుర్తించిన ఆండ్రాయిడ్ లొసుగుల తీవ్రతను 'అత్యధికం(హై)'గా పేర్కొంది. హ్యాకర్లు 'అనస్తా బ్యాంకింగ్' పేరుతో ఈ 70 వేల ఫోన్లలో ట్రోజన్లను చొప్పించారని వివరించింది. ఈ ట్రోజన్ ద్వారా యూజర్ల బ్యాంకింగ్ వివరాలను కొల్లగొట్టినట్లు గుర్తించినట్లు తెలిపింది.

అప్‌డేట్ ఒక్కటే పరిష్కారం

ఆండ్రాయిడ్ ఫోన్లలో సెక్యూరిటీ ఫీచర్లను అప్‌డేట్ చేసుకోవడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని సెర్ట్-ఇండియా, సైబర్ సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు..

- యూజర్లు తమ స్మార్ట్‌ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి.. సిస్టమ్ అప్‌డేట్ ఆప్షన్‌ను ఎంచుకోవడం ద్వారా సాఫ్ట్‌వేర్‌ను, సెక్యూరిటీ ప్యాచ్‌లను అప్‌డేట్ చేసుకోవచ్చు.
- పలు స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఇప్పటికే సెక్యూరిటీ ప్యాచ్‌లను విడుదల చేశాయి. మిగతావి కూడా ఈ వారంలో వాటిని అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశాలున్నాయి.
- ట్రోజన్ దాడులను అడ్డుకోవడానికి.. స్మార్ట్‌ఫోన్‌లో ఏవైనా కొత్త యాప్‌లు ఇన్‌స్టాల్ అయ్యాయా? అనే విషయాన్ని గుర్తించి, వాటిని అన్‌ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- వాట్సాప్, సోషల్ మీడియా, ఈ-మెయిల్ ద్వారా వచ్చే అపరిచిత, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదు.

లోకం తీరు



స్కైడైవింగ్ చేసిన గజేంద్రసింగ్ షెకావత్

భారత్‌లో తొలి స్కైడైవింగ్ కేంద్రాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి



న్యూఢిల్లీ, జూలై 13: కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్ర షెకావత్ స్కై డైవింగ్ చేశారు. 'ప్రపంచ స్కై డైవింగ్ డే' సందర్భంగా శనివారం ఆయన ఈ అరుదైన సాహసం చేశారు. సముద్ర మట్టానికి 14 వేల అడుగుల ఎత్తులో ఎగురుతున్న విమానంలోంచి నిపుణుడి సహాయంతో డైవింగ్ చేసి సురక్షితంగా ల్యాండ్ అయ్యారు. హర్యానాలోని నార్నౌల్‌లో దేశంలోనే మొట్టమొదటిసారి ఏర్పాటు చేసిన ప్రైవేటు స్కై డైవింగ్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. స్కై డైవింగ్ చేయడం అద్భుతంగా అనిపించిందని 56 ఏళ్ల షెకావత్ తన అనుభవాన్ని పంచుకున్నారు.

గుజరాత్‌లో చందీపురా వైరస్.. నలుగురి మృతి

హిమ్మత్‌నగర్, జూలై 13: గుజరాత్‌ను చందీపురా వైరస్ కలవరపెడుతోంది. ఆ వైరస్ బారిన పడి ఇప్పటికే నలుగురు పిల్లలు మృతి చెందగా మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చనిపోయిన పిల్లల్లో ఒకరు గుజరాత్‌లోని సబార్‌కంఠా జిల్లాకు, ఇద్దరు ఆరావళి జిల్లాకు చెందినవారని, మరొకరు రాజస్థాన్‌కు చెందిన చిన్నారి అని అధికారులు తెలిపారు. ఈ వైరస్ బారిన పడిన పిల్లలు హిమ్మత్‌నగర్‌లోని చిన్నపిల్లల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారని చెప్పారు. రాజస్థాన్‌కు చెందిన మరో ఇద్దరు పిల్లలు ఇదే వైరస్ లక్షణాలతో హిమ్మత్‌నగర్ ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారని తెలిపారు. ర్యాబిడో విరిడే కుటుంబానికి చెందిన ఈ వైరస్ దోమలు, రెక్కల పురుగులతో వ్యాపిస్తుందని, వైరస్ బారిన పడిన వారిలో ఫ్లూ లక్షణాలు ఉంటాయని డాక్టర్లు పేర్కొన్నారు.

యూట్యూబర్ ధ్రువ్ రాఠీపై కేసు నమోదు

ముంబై, జూలై 13: ప్రముఖ యూట్యూబర్ ధ్రువ్ రాఠీపై మహారాష్ట్ర సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ధ్రువ్ రాఠీ పేరిట ఉన్న ఓ పేరడీ 'ఎక్స్' ఖాతా నుంచి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కుమార్తెకు సంబంధించి తప్పుడు సమాచారం పోస్టు చేసిన నేపథ్యంలో.. బిర్లా బంధువుల ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదు చేశామని శనివారం పోలీసులు వెల్లడించారు. 'లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కుమార్తె అంజలి యూపీఎస్సీ పరీక్షకు హాజరవ్వకుండానే ఉత్తీర్ణురాలయ్యారు' అంటూ తప్పుడు సమాచారం పోస్టు చేసినట్లు వివరించారు. అయితే ఆ ఖాతా బయోలో 'ఇది ఫ్యాన్, పేరడీ ఖాతా', అని ఉంది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా.. దీన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అదే ఖాతా నుంచి.. 'సైబర్ క్రైం పోలీసుల సూచనల మేరకు అంజలిపై చేసిన పోస్టును తొలగించాను. వాస్తవం తెలుసుకోకుండా వేరొకరి ట్వీట్‌ను కాపీ చేసి పోస్టు చేసినందుకు క్షమాపణలు' అని తాజా పోస్టులో పేర్కొన్నారు.

ట్రైయినీ కలెక్టర్ పూజ తల్లిపై కేసు నమోదు

పుణె, జూలై 13: వివాదాస్పద ట్రైయినీ కలెక్టర్ పూజా ఖేద్కర్ తల్లి మనోరమ ఖేద్కర్‌పై కేసు నమోదైంది. మనోరమ ఖేద్కర్ ఓ రైతును తుపాకీ చూపిస్తూ బెదిరించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో తాజాగా వైరల్‌గా మారింది. ఆ వీడియో ఆధారంగా బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి పుణెలోని పాడ్ పోలీసులు కేసు నమోదు చేశారు. పూజ తండ్రి దిలీప్ ఖేద్కర్ ప్రభుత్వ అధికారిగా పనిచేస్తున్న సమయంలో ధాడ్‌వాలీ గ్రామంలో కొంత భూమిని కొన్నారు. అయితే దాని పక్కనున్న రైతుల భూమిని ఖేద్కర్ కుటుంబం ఆక్రమించేందుకు ప్రయత్నించిందనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే ఏడాది కింద మనోరమ బౌన్సర్లతో అక్కడికెళ్లి తుపాకీతో హల్‌చల్ చేస్తూ ఓ రైతును బెదిరించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో దిలీప్‌తో పాటు మరో ఐదుగురిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదైంది.

ఉప ఎన్నికల్లో 'ఇండియా' హవా

13 స్థానాలకు 10 కైవసం.. బీజేపీ రెండింటికే పరిమితం.. పశ్చిమబెంగాల్‌లో నాలుగుకు నాలుగూ టీఎంసీకే

- బీజేపీ సృష్టించిన భయం, భ్రమలు పటాపంచలు: రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత తొలిసారిగా పలు రాష్ట్రాలలో జరిగిన ఉప ఎన్నికలలో ఇండియా కూటమి సత్తా చాటింది. 7 రాష్ట్రాలలోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలలో పది సీట్లను కూటమి గెలుచుకుంది. కాంగ్రెస్ 4, తృణమూల్ కాంగ్రెస్ 4, డీఎంకే, ఆప్ ఒక్కో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బీజేపీ కేవలం రెండు సీట్లకు పరిమితం కాగా, మరొకటి స్వతంత్ర అభ్యర్థి గెల్చుకున్నారు. పశ్చిమ బెంగాల్ (4), హిమాచల్ ప్రదేశ్ (3), ఉత్తరాఖండ్ (2), పంజాబ్ (1), మధ్యప్రదేశ్ (1), బిహార్ (1), తమిళనాడు (1) రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు శనివారం వెలువడ్డాయి. పశ్చిమబెంగాల్‌లో నాలుగు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థులు తమ సమీప ప్రత్యర్థులైన బీజేపీ అభ్యర్థులపై విజయం సాధించారు. హిమాచల్ ప్రదేశ్‌లో బీజేపీలో చేరిన ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు రాజీనామా చేయటంతో ఆ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. రెండింటిని అధికారపక్షమైన కాంగ్రెస్ కైవసం చేసుకుంది. వీటిలో ఒకటైన డెహ్రా స్థానం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖు భార్య కమలేశ్ ఠాకూర్ గెలిచారు. తాజా ఫలితాలతో, 68 సీట్లున్న రాష్ట్ర అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 40కి చేరుకుంది. దీంతో ప్రభుత్వం సుస్థిరంగా ఉంటుందని రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. ఇక బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో ఎన్నికలు జరిగిన రెండు స్థానాలనూ కాంగ్రెస్ గెల్చుకుంది. బీజేపీ హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తమ్మీద రెండు స్థానాల్లో విజయం సాధించింది. తమిళనాడులో ఒక స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఇండియా కూటమికి చెందిన డీఎంకే అభ్యర్థి.. ఎన్‌డీఏ కూటమికి చెందిన పీఎంకే అభ్యర్థిని ఓడించారు. కాగా, పంజాబ్‌లో పశ్చిమ జలంధర్ నుంచి గతంలో ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) తరఫున గెలిచిన శీతల్ అంగురల్ మార్చి నెలలో రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అక్కడ తాజాగా జరిగిన ఉప ఎన్నికల్లో శీతల్‌పై ఆప్ అభ్యర్థి మొహిందర్ భగత్ ఘన విజయం సాధించారు. ఉత్తరాఖండ్‌లో బద్రీనాథ్ నుంచి కాంగ్రెస్ తరఫున గెల్చిన అభ్యర్థి రాజీనామా చేసి, లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీలో చేరారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ఆ స్థానాన్ని కాంగ్రెస్ తిరిగి గెల్చుకుంది. బిహార్‌లో ఒక స్థానానికి జరిగిన ఎన్నికలో జేడీయూ అభ్యర్థిపై స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు.



జలంధర్‌లో ఆప్ అభ్యర్థి భగత్ గెలుపుతో ఢిల్లీలో ఆ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్ సంబరాలు

కేజ్రీ ప్రాణాలతో బీజేపీ చెలగాటం

కేజ్రీవాల్ ప్రాణాలతో బీజేపీ చెలగాటమాడుతోందని ఆప్ ఆరోపించింది. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేజ్రీవాల్‌ను అనారోగ్యానికి గురిచేస్తూ బాధపెట్టేందుకు కుట్ర పన్నుతోందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ అన్నారు. ఈ ఏడాది మార్చి 21న ఈడీ అరెస్టు చేసిన రోజు కేజ్రీవాల్ 70 కేజీల బరువున్నారని జైల్లో ఆయన ఆరోగ్యం క్షీణించి 8.5 కిలోల బరువు తగ్గారని తెలిపారు. ఆయన షుగర్ లెవల్స్ సాధారణ స్థాయి కంటే 5రెట్లు పడిపోయాయన్నారు.

ప్రజలు నియంతృత్వాన్ని రూపుమాపాలనుకుంటున్నారు: రాహుల్

ఉప ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా స్పందించారు. బీజేపీ సృష్టించిన భయం, భ్రమలను ఎన్నికల ఫలితాలు పటాపంచలు చేశాయన్నారు. రైతులు, యువత, కూలీలు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు సహా దేశంలోని ప్రతీ వర్గం.. నియంతృత్వాన్ని రూపుమాపి న్యాయపాలనను నెలకొల్పాలని కోరుకుంటున్నారని తెలిపారు. తమ జీవితాలను మెరుగుపరుచుకోవడానికి, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి ప్రజలు ఇండియా కూటమి పక్షాన ఉన్నారని రాహుల్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ స్పందిస్తూ.. దేశంలో మారుతున్న రాజకీయ వాతావరణానికి ఈ ఫలితాలు సంకేతమన్నారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో బీజేపీ చేసిన అన్ని కుట్రలనూ ఓటర్లు తిప్పికొట్టారని చెప్పారు.

యూపీ యువకుడిపై పాముల పగ..

7 సార్లు కాట్లు



ఫతేపూర్, జూలై 13: ఉత్తరప్రదేశ్‌లోని ఫతేపూర్‌లో ఓ యువకుడిని పాము లు ఏడుసార్లు కాటు వేశాయి. వీటిలో ఆరుసార్లు శనివారం నాడే.. ఇదంతా నలభై రోజుల వ్యవధిలో జరిగింది. ప్రతిసారీ కోలుకున్న అతడు.. ఇటీవల తన కలలోకి పాము వచ్చిందని, మరో రెండుసార్లు కూడా కాటేస్తానని, తర్వాత మాత్రం ప్రాణాలు దక్కవని అది చెప్పిందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. సౌరా గ్రామానికి చెందిన అతడి పేరు వికాస్ దూబే (24). మంచం దిగుతుండగా జూన్ 2న తొలిసారి ఇతడిని పాము కరిచింది. ఈ నెల 6వ తేదీ నాటికి ఆరుసార్లు కరిచాయి. తాజాగా మరోసారి బంధువు ఇంటి వద్ద కాటుకు గురయ్యాడు. ప్రతిసారీ ఘటనకు మూడు-నాలుగు గంటల ముందు తనకు పాము కరవబోతుందనే సంకేతాలు వస్తున్నట్లు దూబె చెప్పాడు. పదేపదే ఆస్పత్రి పాలవడంతో తన ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారిందని అధికారులకు మొరపెట్టుకున్నాడు. కాగా, దూబెను ఇన్నిసార్లు పాము కరవడంపై అధికారులు అనుమానాలు వ్యక్తం చేశారు. వాస్తవాలు తేల్చాలని ముగ్గురు వైద్యులతో కమిటీ వేశారు.

అదిగో జగన్నాథుడి ఖజానా!

నేడు తెరుచుకోనున్న పూరీ ఆలయ రత్నభాండాగారం.. రహస్య గదిలోకి వెళ్లనున్న 16మంది సభ్యుల బృందం

- 46 సంవత్సరాల తర్వాత సంపద లెక్కింపునకు ఏర్పాట్లు

భువనేశ్వర్, జూలై 13: ఒడిశా రాష్ట్రం పూరీ శ్రీక్షేత్ర రత్నభాండాగారం నేడు తెరుచుకోనుంది. దాదాపు 46 సంవత్సరాల తర్వాత ఈ గదిలో భద్రపరిచిన విలువైన ఆభరణాలను, ఇతర వస్తువులను లెక్కించడానికి ఒడిశా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. చివరిసారిగా ఈ ఖజానాను 1978లో తెరిచి, అందులోని సంపదను లెక్కించారు. అప్పట్లో ఈ లెక్కింపు ప్రక్రియ 70 రోజుల పాటు కొనసాగింది. తాము అధికారంలోకి వస్తే భాండాగారాన్ని తెరిపిస్తామని ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో బీజేపీ హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలోనే ఒడిశా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బిశ్వనాథ్ రథ్ అధ్యక్షతన 16 మంది సభ్యుల ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. జూలై 14న భాండాగారాన్ని తెరవాలని ఈ కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. 14న ఉదయం కమిటీ సభ్యులంతా సంప్రదాయ వస్త్రధారణలో ఆలయంలోకి ప్రవేశించి తొలుత జగన్నాథ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఖజానా ఉన్న గదిలోకి అధీకృత సిబ్బందితో పాటు పాములు పట్టే వ్యక్తి మొదటగా ప్రవేశిస్తారు. నాలుగు దశాబ్దాలకు పైగా మూసి ఉన్న గదిని తెరవనుండటంతో అందులో భారీ విష సర్పాలు ఉంటాయన్న ఆందోళన నెలకొంది. ఒకవేళ విషపురుగు కాటు వేసినా సత్వర చికిత్స కోసం వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. భాండాగారంలోకి ప్రవేశించే కమిటీ సభ్యులందరూ గత వారం రోజులుగా శాకాహారం మాత్రమే భుజిస్తూ, పూర్తి నియమ నిష్టలు పాటిస్తున్నారు. ఖజానాలోని ఆభరణాల గుర్తింపు ప్రక్రియను స్వర్ణకారులతో పాటు వాతావరణ శాస్త్రవేత్తల బృందం పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు జస్టిస్ రథ్ తెలిపారు. రహస్య గదులకు ఏఎస్ఐ మరమ్మతులు చేపట్టనుండటంతో అక్కడే లెక్కింపు సాధ్యం కాదని, అందులోని సంపదను ఆలయంలోనే మరో సురక్షితమైన ప్రాంతానికి తరలించి పటిష్ఠ భద్రత ఏర్పాట్ల నడుమ లెక్కిస్తామని వివరించారు. ఈ మొత్తం ప్రక్రియను వీడియో రూపంలో భద్రపర్చనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమయంలో భక్తులకు దర్శనాలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు.



రత్నభాండాగారం విశేషాలివీ...

- జగన్నాథుడి ఆలయంలోని జగమోహన సమీపంలో రత్నభాండాగారం ఒక చిన్న ఆలయం తరహాలో ఉంటుంది. దీని ఎత్తు 11.78 మీటర్లు. ఇందులో దేవతా మూర్తుల ఆభరణాలను భద్రపరిచేందుకు బహరా భాండార్ (బాహ్య గది), భితరా భండార్ (లోపలి గది) అనే రెండు గదులు ఉంటాయి. బయటి గది కంటే లోపలి గది బాగా విశాలంగా ఉంటుంది. స్వామివారి నిత్య పూజల్లో ఉపయోగించే ఆభరణాలు బయటి గదిలో ఉంటాయి.
- గత కొన్ని శతాబ్దాలుగా ఒడిశాను పాలించిన అనేక రాజవంశాలకు చెందిన రాజులతో పాటు నేపాల్ పాలకులు సైతం ఇక్కడి స్వామికి 'అరుదైన వాటిలో అత్యంత అరుదైన' బంగారు, వెండి, వజ్రాలు వంటి విలువైన సంపదను విరాళంగా ఇచ్చారు. యుద్ధాల్లో గెలుచుకున్న అంతులేని ధనరాశులను స్వామికి కానుకలుగా సమర్పించారు. వీటిని లోపలి గదిలో భద్రపరిచారు.
- 2018లో 16మంది సభ్యుల బృందం రహస్య గది తలుపులు తెరిచేందుకు వెళ్లింది. అయితే అప్పట్లో భాండాగారం తాళం చెవి అందుబాటులో లేకపోవడంతో వారు లోపలకు ప్రవేశించడం సాధ్యపడలేదు. కేవలం ఫ్లాష్ లైట్ల వెలుగులో కిటికీ ద్వారా గది లోపలి భాగాన్ని పరిశీలించి వెనుదిరిగారు.

రహస్య గదిలో ఏముందంటే

- జగన్నాథ స్వామికి చెందిన వజ్ర వైఢ్యూర్యాలు, స్వర్ణాభరణాలు, వెండి వస్తువులను 15 చెక్క పెట్టెల్లో భద్రపరిచారు. ఒక్కో పెట్టె 9 అడుగుల పొడవు, 3 అడుగుల ఎత్తు ఉంటుంది.
- 1805లో అప్పటి పూరీ కలెక్టర్ చార్లెస్ గ్రోమ్ రూపొందించిన నివేదికలో రత్నభాండాగారపు అధికారిక సమాచారం మొదటిసారిగా బహిర్గతమైంది. రత్నాలు, మేలిమి బంగారం, వెండితో కూడిన 64 ఆభరణాలతో పాటు 128 బంగారు నాణేలు,1,297 వెండి నాణేలు, 106 రాగి నాణేలు ఉన్నాయని ఆ నివేదికలో పేర్కొన్నారు.
- 1950 తర్వాత శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన చట్టం అమలులోకి వచ్చినప్పుడు రూపొందించిన రికార్డు ఆఫ్ రైట్స్ ప్రకారం.. బయటి గదిలో 150 బంగారు ఆభరణాలు, లోపలి గదిలో 180 రకాల ఆభరణాలు, 146 వెండి వస్తువులున్నాయి.
- 1978లో చివరిసారిగా రూపొందించిన జాబితా ప్రకారం రత్నభాండాగారంలోని రెండు గదుల్లో విలువైన రాళ్లు పొదిగిన 128.380 కిలోల బరువైన 454 బంగారు ఆభరణాలు, 221.530 కిలోల వెండి వస్తువులు ఉన్నాయి. ఆ తర్వాత 1982, 1985లలో రెండుసార్లు లోపలి గదిని తెరిచినా ఆభరణాల ఆడిట్ నిర్వహించలేదు.

వేలకోట్లు కొట్టేశారు

(మొదటి పేజీ తరువాయి)

అడ్వాన్స్‌గా చెల్లించింది. టెండర్ ప్రక్రియ లేకుండా, కనీసం సెక్యూరిటీ డిపాజిట్ లేకుండానే మొత్తం 3.50 లక్షల ఇళ్లకు గాను రూ.2450 కోట్లు కాంట్రాక్టర్లకు ఇచ్చింది. అలాగే ఒక్కో ఇంటికి 342 కేజీల ఇనుము (స్టీలు), 40 బస్తాల సిమెంట్ చొప్పున లక్షలాది టన్నుల స్టీలు, సిమెంటు అందజేసింది. అయితే కాంట్రాక్టర్లు సగానికి పైగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. పునాదులు వేసినవి కూడా నాసిరకంగా ఉన్నాయి. ఎన్నికలకు కొన్ని నెలల ముందే కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు ఆపేసి ఉడాయించారు.

వైసీపీ నేతలే కాంట్రాక్టర్లు

రాష్ట్రవ్యాప్తంగా ఆప్షన్-3 ఎంపిక చేసుకున్న ఇళ్ల లబ్ధిదారులను 30 మంది చొప్పున గ్రూపులుగా ఏర్పాటు చేసి.. వారి ఇళ్ల నిర్మాణ బాధ్యతలను స్థానికంగానే మేస్త్రీల (మేసన్స్)కు అప్పగించాలని జగన్ ప్రభుత్వం తొలుత మార్గదర్శకాలను జారీ చేసింది. ఆ తర్వాత ఈ ప్రతిపాదనను పక్కనపెట్టి కాంట్రాక్టర్లను రంగంలోకి దించింది. కాంట్రాక్టర్ల ముసుగులో వైసీపీ నేతలు రంగంలోకి దిగారు. ఇళ్ల కాంట్రాక్టులను తీసుకున్న వైసీపీ నేతలకు, లబ్ధిదారులకు మధ్య హౌసింగ్ కార్పొరేషన్ అధికారులే మధ్యవర్తిత్వం నడిపారు.

- వైసీపీకి చెందిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి బంధువులు, అనుచరులు డైరెక్టర్లుగా ఉన్న రాక్రీట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు విజయనగరం, విశాఖపట్నం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, అనంతపురం, కడప జిల్లాల్లో ఏకంగా 52,262 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును కట్టబెట్టారు. ఈ కాంట్రాక్టు విలువ దాదాపు రూ.1,500 కోట్లు.
- వైసీపీ అస్మదీయులకు చెందిన జేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అనే మరో సంస్థకు విశాఖపట్నం, కాకినాడ, తూర్పుగోదావరి, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల్లో 78,065 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును అప్పగించారు. కాంట్రాక్టు విలువ సుమారు 2 వేల కోట్లు.
- అజాయా వెంచర్స్ అనే మరో కాంట్రాక్టు సంస్థ విశాఖపట్నం, కాకినాడ, డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్‌టీఆర్, నెల్లూరు జిల్లాల్లో 23,571 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టును దక్కించుకుంది.

అడ్వాన్సు పేరిట దోపిడీ

సాధారణంగా కాంట్రాక్టర్లు దశలవారీగా పనులు పూర్తి చేసి బిల్లులు సమర్పిస్తే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది. ఆప్షన్-3 ఇళ్ల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లకు మాత్రం అసలు పనులు మొదలు పెట్టకుండానే అడ్వాన్సులుగా ఒక్కొక్కరికి రూ.వందల కోట్లు దోచిపెట్టారు. కాంట్రాక్టర్లతో అగ్రిమెంట్ చేసుకున్నప్పుడు కనీసం సెక్యూరిటీ డిపాజిట్ కూడా చేయించుకోలేదు. ఇళ్ల నిర్మాణాలకు పునాది రాయి కూడా వేయకున్నా బేస్‌మెంట్ల స్టేజ్ వరకు అడ్వాన్సు పేమెంట్లు చేసేశారు. తొలుత బేస్‌మెంట్ స్టేజ్ పేమెంట్ కింద రూ.53 వేలుగా నిర్ణయించారు. ఆ తర్వాత దీన్ని రూ.70 వేలకు పెంచారు. ఇలా ఎందుకు చేశారు? యూనిట్ వ్యయం పెరిగిందా? బేస్‌మెంట్ డిజైన్ ఏమైనా మార్చారా? అంటే.. ఏమీ లేదు. నిజానికి పేదలకు ఇచ్చిన సెంటు, సెంటున్నర స్థలాల్లో కాలమ్ ఫుటింగ్స్, ప్లింత్ బీమ్‌లు వేసినా బేస్‌మెంట్ కట్టడానికి 30-40 వేలుకు మించి ఖర్చు కాదని ఇంజనీర్లు చెబుతున్నారు. ఓపెన్ ఫౌండేషన్‌లో అయితే 20-25 వేలకు మించదని అంటున్నారు. అయినా కాంట్రాక్టర్లకు ఒక్కో ఇంటికి ఏకంగా రూ.70 వేలు చొప్పున అడ్వాన్సులు ఎందుకు చెల్లించారో? హౌసింగ్ అధికారులు భారీ స్థాయిలో కమీషన్లు తీసుకుని కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులు మొదలు పెట్టకుండానే అడ్వాన్సు కింద రూ.కోట్లలో ఇస్తున్నారన్న విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు.. కాంట్రాక్టర్ల అవతారమెత్తి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయానికి క్యూ కట్టేశారు. ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన దాదాపు 900 మంది కాంట్రాక్టర్లకు పప్పుబెల్లాల్లాగా పంచేశారు. అలాగే ఒక్కో ఇంటికి 342 కేజీల ఇనుము (స్టీలు), 40 బస్తాల సిమెంట్ చొప్పున లక్షలాది టన్నుల స్టీలు, సిమెంటుతో పాటు ఉచితంగా ఇసుకను కూడా కాంట్రాక్టర్లకు ఇచ్చేశారు.

పేరుకే పనులు


ఆప్షన్-3 ఇళ్ల పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు భారీగా అడ్వాన్సులు, మెటీరియల్ తీసుకుని సొమ్ము చేసుకున్నారు. పేరుకు అక్కడక్కడా కొన్ని ఇళ్లకు పునాదులు వేసి జారుకున్నారు. అది కూడా ఒక ఇంటి కోసం తీసుకున్న సిమెంటు, స్టీలు, ఇసుకను మూడేసి ఇళ్లకు వాడేసి నాసిరకంగా పునాదులు వేశారు. వేల కోట్ల విలువైన సిమెంటు, స్టీలు, ఇసుకను బయట మార్కెట్లో అమ్ముకున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి కొన్ని నెలల ముందే కాంట్రాక్టర్లందరూ దుకాణాలు సర్దేసుకున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావడంతో హౌసింగ్ అధికారుల్లో టెన్షన్ మొదలైంది. ఇళ్లు కట్టాలని ఒత్తిడి చేస్తున్నా కాంట్రాక్టర్లు పలకడం లేదు. కాంట్రాక్టర్లకు టెండర్ ప్రక్రియ లేకుండా పనులు అప్పగించడం, ఎలాంటి సెక్యూరిటీ తీసుకోకపోవడంతో ఇప్పుడు బైండోవర్ చేయడానికి కూడా అవకాశం లేదు.

అవకతవకలపై విచారణ

"పేదలకు ప్రభుత్వమే కట్టించి ఇస్తుందని చెప్పిన ఆప్షన్-3 కేటగిరి ఇళ్ల కాంట్రాక్టు తీసుకున్న కొన్ని పెద్ద సంస్థలు, చిన్నాచితకా కాంట్రాక్టర్లు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ నుంచి అడ్వాన్సులుగా రూ.వేల కోట్లు తీసేసుకున్నారు. ఆయా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.వందల కోట్ల విలువైన సిమెంట్, ఇసుక, స్టీలు, ఇతర మెటీరియల్‌ను పట్టుకెళ్లారు. చాలావరకు బేస్‌మెంట్ లెవెల్ వరకు లాభదాయకంగా ఉన్న పనులు మాత్రమే పూర్తి చేసి, ఆ తర్వాత పనులు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారు. తీసుకెళ్లిన మెటీరియల్‌ను ఉపయోగించారా? దుర్వినియోగం చేశారా? అన్నది పరిశీలించి ఈ నెలాఖరు కల్లా ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించాం. ఇళ్ల నిర్మాణంలో అవకతవకలపై విచారణ చేయాలని ఆదేశించాం. ఇళ్లు నిర్మించకుండా ఇబ్బందులు పెడుతున్న కాంట్రాక్టర్ల వివరాలు, ఆరోపణలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తాం. ఆప్షన్-3 ఇళ్లను కొనసాగించాలా? లేక లబ్ధిదారులే కట్టుకునేలా చేయాలా? అనే దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది".. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఇటీవల సమీక్షలో చెప్పిన వాస్తవాలు ఇవి.

కాంగ్రెస్ తప్పులు మనం చేయొద్దు

- సమాజ సంస్కరణకే రాజకీయాలు
- కుల రాజకీయాలకు నేను దూరం
- భిన్నమైన పార్టీగా బీజేపీని నిలపాలి
- గోవాలో పార్టీ భేటీలో గడ్కరీ వ్యాఖ్యలు



పణజీ, జూలై 13 : భారతీయ జనతాపార్టీలో భిన్నమైన నేత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ. తనదైన శైలిలో గోవాకు చెందిన బీజేపీ నేతలను శనివారం ఆయన అప్రమత్తం చేశారు. "కాంగ్రెస్ చేసిన తప్పులను మనమూ చేస్తే బీజేపీ అధికారంలో ఉండి ప్రయోజనం ఏమీ ఉండదు" అని ఆయన తేల్చేశారు. ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ మెజారిటీని కోల్పోయి, మిత్రపక్షాలతో కలిసి ప్రభుత్వంలోకి రావాల్సిన పరిస్థితిపై ఆయన పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు. గోవా రాజధాని పణజీలో జరిగిన బీజేపీ కార్యవర్గ సభ్యులతో జరిగిన ఈ భేటీకి గడ్కరీ హాజరయ్యారు. ఈ సమావేశంలో గడ్కరీ.. బీజేపీ నడవడికపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. "మిగతా పార్టీల కంటే బీజేపీ భిన్నంగా రాజకీయాల్లో కొనసాగుతోంది. అందువల్లే మనం వరుసగా గెలుస్తున్నాం. ఓటర్ల విశ్వాసాన్ని పొందగలుగుతున్నాం. కాంగ్రెస్ తప్పులు చేయడం వల్లే మనల్ని ప్రజలు ఎన్నుకొన్నారు. అందువల్ల ఆ పార్టీ చేసిన తప్పిదాలను మనం కొనసాగించరాదు. అలా చేస్తే కాంగ్రెస్ పోయి, బీజేపీ అధికారంలోకి రావడం వల్ల ఒరిగింది ఏముంటుంది?" అని గడ్కరీ వ్యాఖ్యానించారు. 'బీజేపీ భిన్నమైన రాజకీయ పార్టీ' అని ఆడ్వాణీ అనేవారంటూ ఆ పార్టీ కురువృద్ధనేతను ఆయన గుర్తుచేసుకున్నారు. రాజకీయాలు అనేవి సమాజంలో సామాజిక, ఆర్థిక సంస్కరణలను తీసుకురావడానికి ఒక సాధనమనే విషయం పార్టీ కార్యకర్తలు అవగాహనలో ఉంచుకుని రాబోయే కాలంలో పనిచేయాలని ఆయన సూచించారు. అవినీతి లేని భారతం లక్ష్యసాధనగా నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని కోరారు. మహారాష్ట్రలోని నాగపూర్ లోక్‌సభ స్థానం నుంచి భారీ మెజారిటీతో గడ్కరీ గెలిచారు. మహారాష్ట్ర కులాల రాజకీయాల్లో చిక్కుకుపోయిందంటూ.. "నేను మాత్రం ఆ రొంపిలో దిగదలుచుకోలేదు. కుల రాజకీయాలు నాకు సరిపడవని ప్రజలకు స్పష్టంగా చెప్పేశాను. విలువలే మనిషిని నిలబెడతాయి... కులం కాదు. 'కులాల గురించి మాట్లాడేవారి అధికారం కూలిపోతుంది' అని నేను బలంగా నమ్ముతాను" అని తెలిపారు. 2027లో గోవాలో జరిగే అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటినుంచే కసరత్తు ప్రారంభించాలని బీజేపీ నేతలు, శ్రేణులను గడ్కరీ కోరారు.

కేశవరెడ్డి రాజకీయ అరంగేట్రం

- బీజేపీలో చేరిన కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత
- రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో భేటీ



బీజేపీ చీఫ్ పురందేశ్వరిని కలిసిన కేశవరెడ్డి

కర్నూలు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటైన కేశవరెడ్డి విద్యా సంస్థల అధినేత ఎస్.కేశవరెడ్డి రాజకీయ అరంగేట్రం చేశారు. ఇటీవలే ఆ పార్టీ సభ్యత్వం తీసుకున్న ఆయన శనివారం విజయవాడలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కలిశారు. విద్యారంగంలో సాధించిన విజయాల స్ఫూర్తితో క్రియాశీల పాత్ర పోషించి ప్రజలకు తనవంతు సేవలందించే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు ఆయన తెలిపారు.విద్యా రంగంలో 30 ఏళ్లకు పైగా సుదీర్ఘ అనుభవం కలిగిన కేశవరెడ్డి.. ఆర్ఎస్ఎస్ భావజాలం, విద్యా రంగంలో సాధించిన విజయాలు స్ఫూర్తిగా రాజకీయాల వైపు అడుగులు వేసేలా చేశాయని 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం కాకరవాడ గ్రామానికి చెందిన కేశవరెడ్డి చదువుకునే రోజుల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా పని చేశారు. 1983లో బీఈడీ పూర్తి చేసిన ఆయన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో ఉపాధ్యాయునిగా పని చేసిన అనుభవంతో 1993లో నంద్యాల పట్టణంలో కేశవరెడ్డి స్కూల్ పేరిట ఉన్నత పాఠశాలను ప్రారంభించారు. అది అనతికాలంలోనే తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ విద్యా సంస్థల్లో ఒకటిగా ఎదిగింది. ప్రస్తుతం రెండు రాష్ట్రాల్లో 30 శాఖల్లో ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు 30 వేల మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. టీచింగ్, నాన్ టీచింగ్ రంగాల్లో 3 వేల మందికిపైగా ఉద్యోగ ఉపాధి కల్పిస్తున్నారు.

ప్రజా సేవ లక్ష్యంగా రాజకీయాల్లోకి..: కేశవరెడ్డి

విద్యా రంగంలో 30 ఏళ్లకు పైగా విశిష్ట సేవలు అందిస్తూ లక్షలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దాను. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చాను. గతంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా, సరస్వతి విద్యా మందిరాల్లో ఉపాధ్యాయుడిగా పని చేసిన అనుభవం, ఆ సంస్థలతో ఉన్న అనుబంధంతో బీజేపీలో చేరాను. ఏ మాత్రం రాజీపడకుండా కులమతాలకు అతీతంగా ప్రజా సేవ చేయడంతో ముందుంటాను. బీజేపీ ఆశయాలకు, తన మనోభావాలకు ఎంతో సారూప్యత ఉండడంతోనే ఆ పార్టీలో చేరాను. ఓ వైపు విద్యా సేవలు, మరో ప్రజా సేవలో ముందుంటూ పార్టీ అభివృద్ధికి నా వంతు కృషి చేస్తాను.

నాని, అమర్నాథ్‌లకు మతి భ్రమించింది!: బుద్దా

విజయవాడ(వన్‌టౌన్), జూలై 13: మాజీ మంత్రులు పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న విమర్శించారు. శనివారం విజయవాడలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ నాయకులు సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని దుష్ప్రచారం చేస్తే రోడ్ల మీద తిరగలేరని హెచ్చరించారు. ఎన్నికలలో ప్రజలు ఛీ కొట్టిన వైసీపీ నాయకులు నాని, అమర్నాథ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. పవన్‌కల్యాణ్‌పైనా నోరు పారేసుకుని, వారి కులం వారితో ఛీ కొట్టించుకుంటున్నారన్నారు. ఆరడుగుల నిజాయితీకి చంద్రబాబు నిదర్శనమని, ఐదడుగుల తాచుపాము జగన్ అని వ్యాఖ్యానించారు. అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌గా చంద్రబాబు మారిస్తే, జగన్ అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారన్నారు. చంద్రబాబుపై ఉన్న నమ్మకంతోనే రాష్ట్రంలో రిఫైనరీ ఏర్పాటుకు బీపీసీఎల్ ముందుకు వచ్చిందని తెలిపారు.

'ఆప్కాస్'లో ఆక్టోపస్!

(మూడో పేజీ తరువాయి)

మార్చుకుని ఆయన ఏటా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి వస్తున్న ఒక్కశాతం నిర్వహణావ్యయాన్ని రకరకాల బిల్లులు పెట్టుకుని అప్పనంగా భోం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ సంస్థగా ఏర్పాటైన ఆప్కాస్‌కు ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడంతో ఇష్టారాజ్యంగా నిధులు దుర్వినియోగమయ్యాయని పేర్కొంటున్నారు. కార్యాలయంలో పూలింగ్ కోసం వాహనం ఏర్పాటు చేశామని చెప్పి ప్రతి నెలా రూ.45 వేలు ఈ సంస్థ ఎండీ బిల్లులు డ్రా చేస్తున్నారు. ఒక్క నెలలోనే రవాణా ఖర్చుల కోసమంటూ రూ.2,07,892 డ్రా చేశారు. ఈ వాహనాలను ఎన్నికల్లో ప్రచారానికి వాడుకున్నారో? లేక ఎండీ దొంగ బిల్లులు పెట్టి స్వాహా చేశారో తెలియని పరిస్థితి. ఈ కార్యాలయంలో సుమారు 45 మందిని నియమించుకుంటే నిబంధనల ప్రకారం వారిలో కేవలం 18 మందిని మాత్రమే నియమించారు. మిగిలిన వారంతా అడ్డగోలుగా వైసీపీ కార్యకర్తలు, జగన్ ఇంట్లో మనుషులు, విజయసాయిరెడ్డి అనుచరులు, బొత్స మనుషులను నియమించుకున్నారు. నిరుద్యోగికి దక్కాల్సిన ఉద్యోగాలు పక్క రాజకీయ నేతలకు, వ్యాపారవేత్తలకు కట్టబెట్టడం బరితెగింపే! కార్పొరేషన్‌లో జనరల్ మేనేజర్లుగా వీరిని రూ.లక్ష జీతం కట్టబెట్టి నియమించుకున్నారు. వీరిలో ఒకరు రాయలసీమలోని ఓ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సోదరుడు. మరొకరు జగన్ నివాసం లోటస్‌పాండ్‌లో పనిచేసిన వ్యక్తి. సదరు మాజీ ఎమ్మెల్యే సోదరుడు ఎన్నికల ప్రచారానికి వెళ్లినా, ఎస్సీ, ఎస్టీలను కించపరిచారన్న ఆరోపణలున్నా.. ఆయనను కొనసాగించడమే కాకుండా ప్రతి నెలా జీతం ఇచ్చి పోషిస్తున్నారు. లోటస్‌పాండ్‌లో పనిచేసిన జగన్ కుటుంబం అనుయాయుడికి ప్రైవేట్ రీసార్ట్ బిజినెస్ ఉన్నప్పటికీ ఆయనను జనరల్ మేనేజర్‌గా తీసుకున్నారు. తద్వారా ఆప్కాస్‌ను పూర్తిగా జగన్ కుటుంబం, వైసీపీ నేతల సొంత కార్పొరేషన్‌గా మార్చేశారని ఆరోపిస్తున్నారు. ఎండీ అనుచరుడితో పాటు మరో ఇద్దరికి విధులకు రాకున్నా ప్రతి నెలా జీతాలివ్వడం ఈ కార్పొరేషన్‌లో జరుగుతోంది. సజ్జల రామకృష్ణారెడ్డి పీఏ భార్యను అవసరం లేకున్నా ఐటీ కన్సల్టెంట్‌గా నియమించుకోవడం విశేషం. ఎన్నికల కోడ్‌ను సైతం ఉల్లంఘించి ఆ సమయంలో నియామకాలు చేపట్టడం గమనార్హం.

ఆప్కాస్ నిధులు జల్సాలకే...

ఆప్కాస్ నిధులతో దొంగ బిల్లులు పెట్టుకుని స్వాహా చేసిన తీరు చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. తన సొంత అవసరాలకు వాడుకునే సెల్‌ఫోన్‌లను సైతం ఆప్కాస్ నిధులతో ఎండీ కొనుగోలు చేసి బిల్లులు పెట్టుకున్నారు. అయితే ఆఫీసు కార్యకలాపాలకు కూడా మరో సెల్‌ఫోన్‌ను రూ.1.14 లక్షలకు కొనుగోలు చేసినట్లు బిల్లులు పెట్టారు. లీగల్ కన్సల్టెన్సీ పేరుతో ప్రతి నెలా రూ.45 వేలు డ్రా చేస్తున్నారు. ఏ శాఖలో లేని విధంగా ప్రతి నెలా బెస్ట్ ఎంప్లాయీ పేరుతో తనకు నచ్చిన ఉద్యోగికి రూ.5 వేలు పారితోషికం అందించడం ఈ కార్పొరేషన్‌లోనే చేస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వ పేపర్‌లెస్ అని చెప్తున్నా జెరాక్స్ పేరిట ఈ కార్పొరేషన్ ఎండీ రూ.లక్షలు స్వాహా చేశారు. జెరాక్స్ మిషన్‌లు తెచ్చి 14 లక్షల కాపీలు జెరాక్స్‌లు తీసి సుమారు రూ.8 లక్షల దాకా ఒకే నెలలో ఖర్చు చేశారు. ఫర్నిచర్ కొనరాదని ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రావత్ స్పష్టంగా ఉత్తర్వులు జారీచేసినా.. లెక్క చేయకుండా ఎండీ రూ.2 లక్షలకు పైగా దానికోసం ఖర్చు చేశారు. స్వీట్లు, ఇతర ఖర్చుల కోసం రూ.లక్షలు తగలేశారు. ఢిల్లీకి వెళ్లే అవసరం ఎండీకి గానీ, కార్యాలయ సిబ్బందికిగానీ ఉండదు. అయినా ఢిల్లీ విమాన టికెట్లు, ఇతర ఖర్చులు కార్పొరేషన్ నుంచి బిల్లులు పెట్టి లాగేశారు. ప్రతి బిల్లూ అశోకా ట్రావెల్స్ పేరుతో పెట్టడం, కొందరు ఉద్యోగుల పేరుతో క్రెడిట్ కార్డుల నుంచి చెల్లించడం, కార్పొరేషన్ సేవింగ్స్ ఖాతాల నుంచి వారికి పంపించడం నిత్య కృత్యంగా మారింది.

కమీషన్ల దెబ్బకు...

రాష్ట్రంలో పలు శాఖలు అవసరం మేరకు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించుకోవాలంటే ఎండీకి కమీషన్ సమర్పించుకోవాల్సిందే. లేకపోతే ఆమోదం దొరకదు. ఎస్ఎస్‌బీ బోర్డులో 17 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల నియామకాల కోసం నోటిఫికేషన్ వేస్తే 7 వేల దరఖాస్తులు వచ్చాయి. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఆప్కాస్ ఎండీకి కమీషన్ ఇవ్వాల్సి రావడంతో పోస్టుల భర్తీ చేసేందుకు బోర్డు అధికారులు సాహసించలేకపోయారు. కొన్ని పోస్టులు తాను చెప్పిన వాళ్లకు ఇవ్వాలని షరతులు పెట్టడంతో నిష్పాక్షిక నియామకాలు చేపట్టలేమన్న ఆందోళనతో బోర్డు అధికారులు నియామకాలను నిలిపేశారు.

ఈపీఎఫ్ విషయంలో ఘోర తప్పిదాలు....

ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కోసం! అంటే వారికి ప్రతి నెలా ఈపీఎఫ్, ఈఎస్ఐ వాటా సకాలంలో సక్రమంగా చెల్లించి. ఠంచనుగా జీతాలు అందేలా చేసేందుకు కార్పొరేషన్ పెట్టారు. అయితే ఈపీఎఫ్ విషయంలో ఆప్కాస్ ఎండీ ఘోర తప్పిదాలకు పాల్పడ్డారు. ప్రతి నెలా సకాలంలో ఉద్యోగుల ఈపీఎఫ్ చెల్లించకపోవడంతో ఇప్పటికే రెండు దఫాలు కార్పొరేషన్.... ఈపీఎఫ్ కార్యాలయానికి జరిమానాగా రూ.10 కోట్లు చెల్లించింది. ఎండీ నిర్లక్ష్యం కారణంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సొమ్ము జరిమానా రూపంలో చెల్లించాల్సి వచ్చింది. మొదట్లో ఈపీఎఫ్ చెల్లించేందుకు కన్సల్టెంట్లను నియమించి నిధులు వృథా చేశారు. వి.ఉదయ్‌కుమార్ అనే ఉద్యోగి జీతం నుంచి కట్ చేసి ఈపీఎఫ్‌కు జమచేసినట్లు రికార్డులు సృష్టించారు. కానీ, ఈపీఎఫ్ కార్యాలయానికి చెల్లించలేదు. దీంతో ఈపీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఆప్కాస్ ఎండీపై కృష్ణలంక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ అధికారి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎండీపై పోలీసులు కేసు నమోదు చేయలేని పరిస్థితి గత ప్రభుత్వంలో నెలకొంది. కార్పొరేషన్ నిర్వహణ తీరుపై పలు ఆరోపణలు చేస్తూ కొందరు మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే... అక్కడ సిబ్బందిని మేనేజ్ చేసి కనీసం నోటీసులు కూడా ఇవ్వనీయకుండా పావులు కదిపారని ఉద్యోగులు చెప్పుకుంటున్నారు.

సార్ పులస ముచ్చటకు 25వేలు

ఆప్కాస్ ఎండీ నివాసం వైజాగ్‌లో ఉంది. ఆయన కుటుంబం కోసం అక్కడకు పులస కూర పంపడానికి కార్పొరేషన్ నిధులు ప్రతి నెలా రూ.25 వేలు ఖర్చవుతున్నాయంటే వారి బరితెగింపు ఏ మేరకు ఉందో అర్థమవుతోంది. తూర్పు గోదావరి జిల్లాలో పులసను కొనుగోలు చేసి కూర తయారుచేయించి వైజాగ్‌కు తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా కారును, మనిషిని ఏర్పాటు చేసుకున్నారు. దానికి ఫీల్డ్ విజిట్ అని పేరుపెట్టారు. ఈ విజిట్ పేరిట ప్రతి దఫా రూ.25 వేలు డ్రా చేస్తున్నారు. అలాగే కార్పొరేషన్ దగ్గర జీతం తీసుకుని ఇద్దరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎండీ వైజాగ్ నివాసంలో పనిచేస్తున్నారు. మరో ఉద్యోగి ఆయన తాత్కాలికంగా ఉంటున్న విజయవాడలోని నివాసంలో పనిచేస్తున్నారు.

డిస్కంలపై జగన్ ఆక్వా భారం

- రాయితీ సొమ్ములో 1447 కోట్లు బకాయి
- పేరుకే 1.50... వసూలు చేసింది రూ.10 పై మాటే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50కే ఇచ్చామంటూ గొప్పలు చెప్పిన జగన్ సర్కార్.. ఆ రాయితీ సొమ్మును డిస్కంలకు ఇవ్వకుండా బకాయి పెట్టింది. ఐదేళ్లలో రూ.3,494 కోట్లు ఆక్వా రైతుల విద్యుత్ రాయితీకి ఖర్చు చేసినట్లు వైసీపీ పాలకులు చూపించారు. దానిలో సుమారు 40 శాతం... రూ.1,447 కోట్లు డిస్కంలకు పెండింగ్ పెట్టారు. వైసీపీ ప్రభుత్వం పెట్టిన బకాయిల మొత్తాన్ని ప్రస్తుత ప్రభుత్వం చెల్లించాల్సి వస్తోంది. ఆక్వా సాగుదారులందరికీ రూపాయిన్నరకే విద్యుత్ అందిస్తామని ప్రగల్భాలు పలికిన జగన్.. వాస్తవానికి కొవిడ్ సమయంలో కుదేలైన ఆక్వా రైతులను ఏమాత్రం ఆదుకోలేదు. 2014-17 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వంలో ఆక్వా సాగుకు యూనిట్ రూ.2.50 ఉండేది. సాగుదారుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొన్న చంద్రబాబు దానిని 2018లో రూ.2కు తగ్గించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 2019, జూలై నుంచి యూనిట్ ధరను రూ.1.50గా నిర్ధారించారు. నోటిఫైడ్ ఆక్వా జోన్లలోని 10 ఎకరాల లోపు సాగు ఉన్న రైతులకు మాత్రమే ఈ రాయితీని వర్తింపజేశారు. జోన్‌తో నిమిత్తం లేకుండా 10 ఎకరాల పైన చేపలు, రొయ్యలు సాగుచేసే రైతుల నుంచి యూనిట్‌కు రూ.3.85 చొప్పున జగన్ ప్రభుత్వం వసూలు చేసింది. ఇదంతా కేవలం కాగితాలకే పరిమితం. వాస్తవానికి ఆక్వా జోన్‌లోని 10 ఎకరాలు లోపు సాగు రైతుకు యూనిట్ ధర... కస్టమర్ చార్జి, విద్యుత్ సుంకం, ఫిక్స్‌డ్ చార్జి, ఆలస్యానికి సర్‌చార్జి, ట్రూ అప్ చార్జీ, అదనపు లోడు వంటి చార్జీలతో కలిపి రూ.10 వరకూ పడింది. నాన్ ఆక్వా జోన్‌లో, 10 ఎకరాలు పైబడిన రైతుకు యూనిట్ రూ.15 వరకూ పడేది. అయినా ఆక్వా రైతులకు రూపాయిన్నరకే విద్యుత్ అంటూ వైసీపీ నేతలు ఊదరగొట్టారు. దీనికితోడు 2022లో సర్వే చేసి ఆక్వా జోన్‌ను కుదించారు. దీంతో ఎక్కువ మందికి లబ్ధి అందకుండా పోయింది.

ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ వివరాలు		
సంవత్సరం	విద్యుత్ కనెక్షన్లు	రాయితీ (రూ.కోట్లలో)
2019-20	54,142	577.03
2020-21	57,882	843.90
2021-22	61,682	956.59
2022-23	29,324	415.36
2023-24	42,712	701.05

టీడీపీ హయాంలోని లబ్ధిదారుల సంఖ్యతో పోల్చితే ఆ సంఖ్య సగానికి సగం తగ్గిపోయింది. దీంతో ఆక్వా రైతులు గగ్గోలు పెట్టారు. అయినా జగన్ సర్కార్ పెద్దగా స్పందించలేదు.

ప్రస్తుతం రూ.1,099 కోట్లు అవసరం

రాష్ట్రంలో ఆక్వా జోన్‌లో 10 ఎకరాలలోపు సాగవుతున్న 3.33 లక్షల ఎకరాలకు 54,072 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి రాయితీకి రూ.877 కోట్లు ఖర్చవుతోంది. ఇవికాక జోన్ పరిధిలోనే 10 ఎకరాలలోపు ఆక్వా సాగవుతున్న మరో 24,270 ఎకరాలకు విద్యుత్ రాయితీ అందడం లేదని అధికారులు చెపుతున్నారు. వీటితో కూడా కలుపుకొని జోన్, నాన్ జోన్‌లోని సీలింగ్‌కు లోబడి మొత్తం 4.68 లక్షల ఎకరాలకు 66,993 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వాటికి యూనిట్ రూ.1.50 చొప్పున విద్యుత్ సరఫరా చేస్తే... రూ.1,099 కోట్లు అవసరమౌతాయని అధికారులు తాజాగా అంచనా వేశారు.

నామినేటెడ్ పోస్టుల వివరాలు ఇవ్వండి

- సాధారణ పరిపాలన శాఖ సర్క్యులర్ జారీ
- రేపు అధికారులతో సమావేశం.. కీలక నిర్ణయం?

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. గతంలో మాదిరిగా కాకుండా మండల స్థాయి నుంచి నామినేటెడ్ పోస్టుల వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. మూడు పార్టీలు కూటమిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన క్రమంలో ప్రతి నామినేటెడ్ పోస్టు భర్తీలో జాగ్రత్తలు తీసుకుంటోంది. ఏ పార్టీకీ ఇబ్బంది లేకుండా సమన్వయం చేసేందుకు వీలుగా మొత్తం నామినేటెడ్ పోస్టుల వివరాలను సేకరిస్తోంది. ఇప్పటికే కొంత సమాచారాన్ని ఉన్నతాధికారులు తెప్పించుకున్నారు.

ఈ నేపథ్యంలో మండలస్థాయిలో పోస్టుల వివరాలు కూడా పంపించాలని అన్ని శాఖల ఉన్నతాధికారులకు సీఎంవో నుంచి సర్క్యులర్ పంపించారు. గత పదేళ్లలో ఏయే నామినేటెడ్ పోస్టులు భర్తీ అయ్యాయి? ఎవరు ఆయా పోస్టుల్లో ఉన్నారు? ఎంత కాలం ఉన్నారు? ఎన్ని ఖాళీలున్నాయన్న సమాచారం పంపించాలని సూచించారు. ఈ మేరకు జీఏడీ సేవల సెక్రటరీ పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం జరిగే సమావేశానికి ఆయా పోస్టుల వివరాలను అందించాలని ఆదేశించారు. ప్రతి విభాగం నుంచి ఒక అధికారిని ఈ సమావేశానికి పంపించి వివరాలను అందించాలని పేర్కొన్నారు.

హమాస్‌పై ఇజ్రాయెల్ దాడులు

71 మంది మృతి.. 289 మందికి గాయాలు

- హమాస్ మిలిటరీ కమాండర్ లక్ష్యంగానే దాడులన్న ఇజ్రాయెల్

జెరూసలేం, జూలై 13 : హమాస్ మిలటరీ కమాండర్ మహమ్మద్ డెయిఫ్ లక్ష్యంగా దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 71 మంది మృతి చెందారు. 289 మంది గాయపడ్డారు. అయితే దాడిలో మహమ్మద్ డెయిఫ్ చనిపోయాడో లేదో తెలియలేదు. డెయిఫ్, హమాస్ మరో కమాండర్ రఫా సలామాలే దాడిలో తమ లక్ష్యమని ఇజ్రాయెల్ అధికారులు ప్రకటించారు. హమాస్ ఈ వాదనను తిరస్కరించింది. ఈ దాడిని సామూహిక హత్యాకాండగా అభివర్ణించింది. చనిపోయిన వారిలో అత్యవసర సేవలు అందించేవారు కూడా ఉన్నట్లు పేర్కొంది. యుద్ధంతో నిరాశ్రయులైనవారు ఖాన్ యూనిస్‌లో టెంట్లతో వేసిన క్యాంపుల్లో ఉంటుండగా వారిపై భారీ ఎత్తున బాంబులతో ఇజ్రాయెల్ విరుచుకుపడిందని ఆరోపించింది. ఈమేరకు హమాస్ నడుపుతోన్న గాజా ప్రభుత్వ మీడియా కార్యాలయం ఒక ప్రకటన వెలువరించింది. కాగా గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై జరిగిన ఆకస్మిక దాడికి ప్రధాన సూత్రధారి డెయిఫేనని పలువురి అభిప్రాయం. ఈ దాడిలో 1,200 మంది మృతి చెందారు. ఈ ఘటనే ఇజ్రాయెల్-హమాస్‌ల యుద్ధానికి దారితీసింది. డెయిఫ్ ఏళ్లుగా ఇజ్రాయెల్ మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు. ఇతడిని చంపేందుకు ఇజ్రాయెల్ గతంలో జరిపిన పలు దాడులను తప్పించుకొన్నాడని సమాచారం. అయితే ఈ కారణంగా కదలలేని స్థితికి చేరుకున్నట్లు అంచనా. రెండు దశాబ్దాలుగా అతడు రహస్య జీవితం గడుపుతున్నాడు. 9 నెలలుగా ఇజ్రాయెల్ జరుపుతోన్న దాడుల్లో ఇతడి నిర్మూలన ఘన విజయంగా భావిస్తున్నారు.

కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌కు మరిన్ని అధికారాలు

- కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల
- తప్పుబట్టిన రాజకీయ పార్టీలు

న్యూఢిల్లీ, శ్రీనగర్, జూలై 13: జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్‌జీ)కు కేంద్ర ప్రభుత్వం తాజాగా మరిన్ని అధికారాలను కట్టబెట్టింది. వివిధ కేసులలో విచారణకు అనుమతి ఇవ్వడం, ఐఏఎస్, ఐపీఎస్ వంటి అఖిల భారత సర్వీసు అధికారులు, పోలీసులపై నిర్ణయం తీసుకోవడంలో ఎల్‌జీకి విస్తృత అధికారాలు కల్పించింది. అలాగే, అవినీతి నిరోధక బ్యూరోకు సంబంధించిన విషయాలతోపాటు అడ్వకేట్ జనరల్, ఇతర న్యాయ అధికారుల నియామకాలకు కూడా ఎల్‌జీ ఆమోదం తప్పనిసరి చేసింది. ఈ మేరకు కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2019లోని నిబంధనలను కేంద్ర హోంమంత్రిత్వశాఖ శుక్రవారం సవరించింది. 'పోలీసు, ప్రజాజీవితం, అఖిలభారత సర్వీసు, అవినీతి నిరోధక బ్యూరోల విషయంలో ఆర్థిక విభాగం ముందుకు పంపే ఏ ప్రతిపాదన అయినా ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ద్వారా లెఫ్టినెంట్ గవర్నర్ ముందు ఉంచే వరకూ ఆమోదించబడదు, లేదా తిరస్కరించబడదు' అని తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. దీంతోపాటు అడ్వకేట్ జనరల్, ఇతర న్యాయ అధికారుల నియామకాల ప్రతిపాదనలను న్యాయవిభాగం, పార్లమెంటరీ వ్యవహారాల విభాగం.. సీఎస్ లేదా సీఎం ద్వారా ఎల్‌జీ ఆమోదం కోసం పంపించాలని పేర్కొంది. అలాగే, విచారణ అనుమతి మంజూరు, లేదా అప్పీలు దాఖలు ప్రతిపాదనలను న్యాయవిభాగం, పార్లమెంటరీ వ్యవహారాల విభాగం సీఎస్ ద్వారా ఎల్‌జీ ముందు ఉంచాలని స్పష్టంచేసింది. జైళ్లు, ప్రాసిక్యూషన్-ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీ డైరెక్టరేట్ వ్యవహారాలను హోంశాఖ పరిపాలన కార్యదర్శి తప్పనిసరిగా సీఎస్ ద్వారా ఎల్‌జీ ముందు ఉంచాలని తెలిపింది. పరిపాలన కార్యదర్శులు, అఖిల భారత సర్వీసు అధికారుల కేడర్ పోస్టుల బదిలీ, పోస్టింగు ప్రతిపాదనలను సాధారణ పరిపాలన విభాగం పరిపాలన కార్యదర్శి సీఎస్ ద్వారా ఎల్‌జీ ముందు ఉంచాలని స్పష్టం చేసింది. ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడమేనని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. దీన్ని బట్టి జమ్మూకశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా సమీప భవిష్యత్తులో రాదని అర్థమవుతోందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం జమ్మూకశ్మీర్ ప్రజలను నిర్వీర్యం చేస్తుందని నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ(పీడీపీ) తప్పుబట్టాయి. ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యేవారు ప్యూన్‌ను నియమించాలన్నా ఎల్‌జీని ప్రాధేయపడాల్సిన దుస్థితి కలుగనుందని ఎన్‌సీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా విమర్శించారు. ఈ ఏడాది నిర్వహించనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-యేతర ప్రభుత్వం ఏర్పడనుందని కేంద్రానికి బాగా అర్థమైందని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ కుమార్తె, ఆమె మీడియా సలహాదారు ఇల్తిజా ముఫ్తీ పేర్కొన్నారు. అన్ని పార్టీలూ విభేదాలను పక్కనపెట్టి సమైక్యంగా ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని అప్నీ పార్టీ పిలుపునిచ్చింది.

విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ లేనట్టే?

- పెట్టుబడుల ఉపసంహరణపై కేంద్రం వెనకడుగు
- గత నిర్ణయాలపై సమీక్ష.. ప్రజావ్యతిరేకతపై విశ్లేషణ
- ప్రభుత్వ రంగ సంస్థలకు పూర్వవైభవం తెచ్చేలా యోచన
- ఈ క్రమంలోనే కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి ప్రకటన



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ ఉండబోదని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి చెప్పిన మాటలు నిజం కాబోతున్నాయి. తాజా ఎన్నికల్లో ఊహించని విధంగా సీట్లు కోల్పోయిన బీజేపీ గతంలో తాను తీసుకున్న నిర్ణయాలపై సమీక్షిస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత రావడానికి దారితీసిన అంశాలేమిటో విశ్లేషించుకుంటోంది. 'పెట్టుబడుల ఉపసంహరణ-ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ' అందులో ప్రధానమైనదిగా గుర్తించి, ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ప్రధాని మోదీ నిర్ణయించినట్లు జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. దీనిపై ఇప్పటికే కొంత సమాచారం ఉండడం వల్లే విశాఖ స్టీల్ ప్లాంటును సందర్శించినపుడు మంత్రి కుమారస్వామి ప్రకటన చేసినట్టు తెలుస్తోంది. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఉండదని, ప్రధానికి అన్నీ వివరించి రెండు నెలల తరువాత సరైన నిర్ణయం ప్రకటించనున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను పక్కనపెట్టి, వాటిని మళ్లీ పట్టాల పైకి తీసుకువచ్చి పూర్తిస్థాయిలో పనిచేసేలా చూడాలని మోదీ ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను మాత్రం నిరర్థక ఆస్తుల విక్రయం ద్వారానే సమకూర్చుకోవాలని భావిస్తున్నారు. ప్రతి ప్రభుత్వ రంగ సంస్థలోనూ ఆదాయం రాని స్థిరాస్తులు ఇప్పటికే గుర్తించారు. వాటిని సరైన రీతిలో విక్రయించి, ఆయా మొత్తాలను వాటిలోనే పెట్టుబడులుగా పెట్టి, శిక్షణ పొందినవారిని ఎగ్జిక్యూటివ్‌లుగా నియమించి, ఆయా సంస్థలు పూర్వం ఎలా సమర్థంగా పనిచేశాయో అదే స్థాయికి తీసుకువెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో విశాఖ స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ, విక్రయ ప్రక్రియ దాదాపుగా ఆగిపోయినట్టేనని అంటున్నారు. అయితే ఇక్కడ పూర్తిస్థాయిలో ఉత్పత్తికి ఎటువంటి విధానాలు అనుసరిస్తారనే దానిపై స్పష్టత లేదు. సెయిల్‌లో విలీనం చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలా వీలుకాకపోతే యాజమాన్య బాధ్యత సెయిల్‌కే ఇచ్చి, ప్లాంటు నడపాలని కోరుతున్నారు. ఈ రెండూ కాకుంటే అవసరమైన రుణాలు తీసుకోవడానికి రాష్ట్రపతి పేరిట ఉన్న భూములను ప్లాంటు పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నారు. వీటిలో ఏదైనా అభ్యంతరం లేదని చెబుతున్నారు. వీటిని ఒకవైపు పరిశీలిస్తూనే, మరో వైపు ప్లాంటుకు చెందిన నిరర్థక ఆస్తులను అమ్మడానికి తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగంగానే చెన్నై, హైదరాబాద్‌లలో మార్కెట్ యార్డులను విక్రయించాలని ప్రతిపాదించారు. ఇలా ఎన్ని ఆస్తులు విక్రయిస్తారో తెలియదు. అయితే విశాఖ స్టీల్‌ప్లాంటు విషయంలో అనుసరించబోయే ప్రణాళిక ఏమిటో వివరించాకే ఈ ఆస్తుల ప్రక్రియ కొనసాగించాలని అధికార, కార్మిక వర్గాలు సూచిస్తున్నాయి.

720 కోట్ల విరాళాలు వెనక్కి!

- ఎన్నికల వేళ బైడెన్‌కు భారీ దెబ్బ
- జో వ్యతిరేకుల వెనుక ఒబామా?

వాషింగ్టన్, జూలై 13: కీలకమైన ఎన్నికల వేళ అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు, డెమొక్రాటిక్ తదుపరి అధ్యక్ష అభ్యర్థి జో బైడెన్ తన మద్దతుదారుల విశ్వసనీయతను కోల్పోతున్నారు. సుమారు రూ.720 కోట్ల(90 మిలియన్ డాలర్లు) మేరకు ఎన్నికల విరాళాలు ఇస్తామని ముందుకు వచ్చిన దాతలు తాజాగా వెనక్కి తగ్గారు. రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో జూన్ 27న నిర్వహించిన బహిరంగ చర్చలో బైడెన్ వ్యవహరించిన తీరు విమర్శలపాలైన విషయం తెలిసిందే. ఆయన ఏమాత్రం తన సామర్థ్యాన్ని ప్రదర్శించలేక పోయారు. దీంతో మద్దతుదారులు, ముఖ్యమైన నేతలు ఒక్కొక్కరుగా బైడెన్‌కు తమ మద్దతును ఉపసంహరించుకుంటున్నారు. ఎన్నికల వేళ ఈ పరిణామం బైడెన్‌కు భారీ దెబ్బేనని అంటున్నారు పరిశీలకులు. భారీ ఎత్తున విరాళాలు ఇవ్వాలనుకున్న వారు ఇప్పుడు ముఖం చాటేస్తున్నారని బైడెన్‌కు అనుకూల వర్గం నాయకులు కొందరు వ్యాఖ్యానించారు. దీనికి ప్రధాన కారణం జూన్‌లో నిర్వహించిన చర్చాకార్యక్రమంలో బైడెన్ వ్యవహరించిన తీరేనని తెలిపారు. బైడెన్‌కు బలమైన మద్దతుదారుగా ఉన్న 'ఫ్యూచర్ ఫార్వర్డ్' సైతం వెనక్కి తగ్గినట్టు చెప్పారు. 250 మిలియన్ డాలర్ల ప్రకటన ఖర్చును భరించేందుకు సిద్ధమని ఈ సంస్థ సభ్యులు గతంలో వెల్లడించారు. కానీ, ఇప్పుడు వీరు కూడా రద్దు చేసుకున్నారు. మరోవైపు.. సొంతపార్టీ డెమొక్రాటిక్ ఎంపీల్లో 18 మంది సైతం బైడెన్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. నవంబరు 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల రేసు నుంచి ఆయన తప్పుకోవాల్సిందేనని వారు పట్టుబడుతున్నారు. ఇలాంటి సమయంలో నిధుల రాకకూడా ఆగిపోవడంతో బైడెన్‌పై మరింత ఒత్తిడి పెరుగుతోంది. అయినప్పటికీ ఆయన మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ట్రంప్‌ను ఓడించి తీరుతానని ప్రకటనలు గుప్పిస్తున్నారు.

ఒబామా ఒత్తిడి?

ప్రస్తుత అధ్యక్ష ఎన్నికల్లో పోటీ నుంచి జో బైడెన్‌ను తప్పుకోవాలంటూ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఒత్తిడి చేస్తున్నట్టు సమాచారం. ట్రంప్‌ను ఓడించడం బైడెన్‌కు సాధ్యం కాదని ఆయన భావిస్తున్నట్టు తెలుస్తోంది. బైడెన్ మానసిక స్థితి బాగోలేదన్న వార్తలు, బహిరంగ చర్చల్లో తడబాటు వంటివి వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఒబామా.. బైడెన్‌ను పోటీ నుంచి విరమించుకునేలా పరోక్షంగా ఒత్తిడి చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. పోటీ నుంచి బైడెన్ తప్పుకోవాలని కోరుతున్న వారి వెనుక ఒబామా, మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ ఉన్నారని, ఆయనే వారిని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని బైడెన్ ప్రచార బృందం కూడా సందేహిస్తోంది. ట్రంప్‌ను ఓడించడం, ముందున్న సవాళ్లను అధిగమించడం బైడెన్‌కు సాధ్యమయ్యే పనికాదని వారు ప్రైవేటు సంభాషణల్లో వ్యాఖ్యానించినట్టు సీఎన్ఎన్ పేర్కొంది.

పాత జీవో కొత్తగా..!

- 'జీపీఎస్' ఉత్తర్వు గెజిట్‌పై ఉద్యోగుల్లో కలకలం
- ఆ విధానంపై జూన్ 12న జీవో.. నాడు ఉన్నది వైసీపీ అనుకూల అధికారులే
- రొటీన్‌గా జరిగిందంతే.. కుట్ర లేదు : ఆర్థిక శాఖ వివరణ

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానన్న జగన్ మాటలు నమ్మిన ఉద్యోగులను వైసీపీ ప్రభుత్వం నట్టేట్లో ముంచింది. సీపీఎస్ రద్దు చేయకపోగా అత్యంత లోపభూయిష్టమైన జీపీఎస్ విధానాన్ని తీసుకొచ్చి దారుణంగా మోసం చేసింది. ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ జీపీఎస్ విధానంపై 2023 అక్టోబరు 24న విధివిధానాలు ప్రకటించింది. ఈ విధానం తప్పనిసరి కాదని.. రావాలనుకుంటే జీపీఎస్ పరిధిలోకి రావొచ్చని.. లేదంటే సీపీఎస్‌లోనే ఉండిపోవచ్చని ఆప్షన్ ఇచ్చింది. ఉద్యోగులు మాత్రం ఓపీఎస్ కావాలన్నారు. అయితే ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన జూన్ 12వ తేదీన.. జీపీఎస్ విధానం 2023 అక్టోబరు 20 నుంచి అమల్లోకి వచ్చినట్లు పేర్కొంటూ ఆర్థిక శాఖ జీవో ఇచ్చింది. ఆ రోజున కీలక బాధ్యతల్లో ఉన్నది వైసీపీ అనుకూల అధికారులే. అప్పటికి కూటమి ప్రభుత్వం ఐఏఎస్‌లను బదిలీ చేయలేదు. జూలై 12వ తేదీన అదే జీవో గెజిట్‌లో ప్రచురితమైంది. పాత తేదీతో కొత్త ప్రభుత్వంలో జీవో రావడంతో ఉద్యోగుల్లో కలకలం రేగింది. పలు ఉద్యోగ సంఘాలు దీనిని వ్యతిరేకించాయి. అయితే ఇది రొటీన్‌గా జరిగిపోయిందని, ఇందులో ఎలాంటి కుట్రా లేదని ఆర్థిక శాఖ అధికారులు వివరణ ఇచ్చారు.

జీపీఎస్‌పై గెజిట్ దుర్మార్గం: ఉపాధ్యాయ సంఘాలు

ప్రభుత్వ ఉద్యోగులంతా పాత పెన్షన్ విధానం కావాలని ఆకాంక్షిస్తుంటే, పాత తేదీతో జీపీఎస్ అమలుకు గెజిట్ జారీచేయడం దుర్మార్గమని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ధ్వజమెత్తారు. ఉద్యోగులందరినీ జీపీఎస్ పరిధిలోకి తేవడం మోసం చేయడమేనని తెలిపారు. సీపీఎస్ స్థానంలో జీపీఎస్ గెజిట్ తేవడాన్ని ఏపీటీఎఫ్ ఖండించింది. ఇది ఉద్యోగుల ఆకాంక్షకు విరుద్ధమని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి పేర్కొన్నారు. జీపీఎస్‌పై పాత తేదీతో విడుదల చేసిన గెజిట్‌ను రద్దు చేయాలని ఆప్టా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏజీఎస్ గణపతిరావు, కె.ప్రకాశ్‌రావు డిమాండ్ చేశారు.

ఇమ్రాన్ ఖాన్ దంపతులకు ఊరట

- 'నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి' కేసులో నిర్దోషులుగా తీర్పు

ఇస్లామాబాద్, జూలై 13 : పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ దంపతులకు న్యాయస్థానంలో శనివారం ఊరట లభించింది, ఇస్లాం నిబంధనలకు విరుద్ధంగా పెళ్లి చేసుకున్నారంటూ వారిపై ఉన్న అభియోగాలను ఇస్లామాబాద్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు శనివారం తోసిపుచ్చింది. ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీని నిర్దోషులుగా ప్రకటించింది. అలాగే, ఈ కేసులో దిగువ కోర్టు వారికి విధించిన ఏడేళ్ల జైలు శిక్షను రద్దు చేసింది. ఇమ్రాన్-బుష్రా ఇస్లాం నిబంధనలకు విరుద్ధంగా వివాహం చేసుకున్నారంటూ బుష్రా మాజీ భర్త ఫరీద్ ఈ కేసు వేయగా దిగువ కోర్టు వారికి జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఇమ్రాన్ దంపతులు ఇస్లామాబాద్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ కేసు వల్లే ఇమ్రాన్‌ఖాన్ గతేడాది ఆగస్టు నుంచి జైలులో ఉన్నారు. ఇప్పుడు విముక్తి లభించినా ఇమ్రాన్ జైలు నుంచి విడుదలయ్యే అవకాశం కనిపించడం లేదు. అవినీతి ఆరోపణల కేసులో ఇమ్రాన్ ఖాన్ అరెస్టు అయిన తర్వాత గతేడాది మే 9న అల్లర్లు జరిగాయి. ఇందుకు సంబంధించిన మూడు కేసుల్లో ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్టు చేసేందుకు లాహోర్‌లోని యాంటీ టెర్రరిజమ్ న్యాయస్థానం శనివారం అనుమతినిచ్చింది. దీంతో ఇమ్రాన్ మరికొద్ది రోజులు జైలులోనే ఉండే అవకాశం ఉంది.

ఆర్‌బీఐ నివేదికతో ప్రతిపక్షాల నోటికి తాళం: మోదీ

ముంబై, జూలై 13: ఉద్యోగాల కల్పనపై ఆర్‌బీఐ ఇటీవల విడుదల చేసిన నివేదిక నిరుద్యోగం పేరిట అవాస్తవాలను ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాల నోటికి తాళం వేసిందని ప్రధాని మోదీ అన్నారు. ముంబైలో చేపట్టిన రూ.29,400 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్‌బీఐ నివేదిక ప్రకారం గత నాలుగేళ్లలో దేశంలో దాదాపు 8 కోట్ల కొత్త ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. ఈ గణాంకాలు ప్రతిపక్షాల నోటికి తాళం వేశాయని, దేశాభివృద్ధిని వ్యతిరేకిస్తున్న వారిని ప్రజలు ముందు నిలబెట్టాయని మోదీ అన్నారు. అలాగే, ముంబైలోని అటల్ సేతు వంతెన విషయంలో ప్రతిపక్షాలు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నాయని మోదీ మండిపడ్డారు. అటల్ సేతు వంతెనపై ప్రతి రోజు 20 వేల వాహనాలు ప్రయాణిస్తున్నాయని, ప్రతి రోజు పెద్ద ఎత్తున ఇంధన ఆదా జరుగుతోందని వివరించారు.



ముకేశ్ అంబానీ ఇంట పెళ్లి వేడుకకు వచ్చిన బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్‌ను మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు కలిశారు. పరిపాలన, విద్య, ఆరోగ్యం, రాజకీయ రంగాల్లో ఏఐ సాంకేతిక వినియోగం తదితర అంశాలపై చర్చించారు. వివిధ రంగాల్లో ఏఐ వినియోగం ద్వారా ఆదాయ సృష్టికి ఉన్న అవకాశాల గురించి మాట్లాడుకున్నారు. లోకేశ్ స్పందిస్తూ ఈ విషయాలపై టోనీ బ్లెయిర్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. బ్లెయిర్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ చేంజ్'తో కలిసి ఉమ్మడి అజెండాతో ముందుకు వెళతామని తెలిపారు. ఆదాయం పెంచే మార్గాలపై బ్లెయిర్ సూచనలను అధ్యయనం చేస్తామని పేర్కొన్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ పాలనలో చేనేత రంగానికి మరణ శాసనం

- బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత
- పెడనలో నేతన్నల సమస్యలు తెలుసుకున్న మంత్రి



పోలవరంలో చేనేత కార్మికులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

మచిలీపట్నం, జూలై 13(ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి వైసీపీ ప్రభుత్వం మరణశాసనం రాసిందని, దోచుకోవడం, దాచుకోవడంతోనే సరిపెట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత అన్నారు. పెడన నియోజకవర్గంలోని పోలవరం, పెడనలోని చేనేత సహకార సంఘాలను శనివారం ఆమె సందర్శించారు. చేనేత కార్మికులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మగ్గంపై కొద్దిసేపు పనిచేశారు. పోలవరంలో ఆమె మాట్లాడుతూ నేతన్న నేస్తం పథకం ద్వారా రాష్ట్రంలో 80 వేల మందికి నగదు బదిలీ చేసినట్లు వైసీపీ ప్రభుత్వం గతంలో ప్రకటనలు జారీ చేసిందన్నారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందిన చేనేత కార్మికులు 36వేల మంది మాత్రమే ఉన్నారని, మిగిలిన వారంతా వైసీపీ కార్యకర్తలేనని పేర్కొన్నారు. ఈ పథకం అమల్లో అక్రమాపై సమగ్ర విచారణ జరిపిస్తామని తెలిపారు. వైసీపీ హయాంలో అక్రమాలకు పాల్పడిన అధికారులు, రాజకీయ నాయకులను వదిలే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అన్న క్యాంటీన్లను మూసేశారన్నారు. పేదవాడు అన్నం తినడం ఇష్టంలేని దుర్మార్గుడు ఎవరంటే, బీసీల ద్రోహి ఎవరంటే వైఎస్ జగనేనన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 151 మంది ఆ పార్టీ ఎమ్మెల్యేలు బాగుపడ్డారని, పేదలకు మాత్రం మేలు జరగలేదన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ సుపరిపాలన దిశగా వినూత్నమైన ఆలోచనలతో ముందుకెళ్తున్నారని తెలిపారు. చేనేత బకాయిలను మాఫీ చేసే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కేబినెట్‌లో చర్చిస్తామని ఆమె హామీ ఇచ్చారు. చేనేత రంగంలో మార్కెటింగ్ సౌకర్యాలను మరింతగా పెంచేందుకు, నూతన డిజైన్ల రూపకల్పనకు కృషి చేస్తామని, చేనేత రంగాన్ని, చేనేత సహకార సంఘాలను అన్నివిధాలా ఆదుకుంటామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, చేనేత విభాగ అధికారులు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల నిర్మాణానికి రాయితీలు: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పశుపోషకులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అచ్చెన్నాయుడు శనివారం ఆయన ఓ ప్రకటన తెలిపారు. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉపాధి హామీ పథకం కింద పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణానికి అర్హులందరికీ రాయితీలు అందిస్తామని వెల్లడించారు. పశువుల షెడ్లకు 90%రాయితీతో గరిష్ఠంగా రూ.2.30లక్షలు, గొర్రెలు/మేకల షెడ్లకు 70%రాయితీతో రూ.2.30లక్షలు, కోళ్ల షెడ్లకు 70% రాయితీతో రూ.లక్షా32 వేల వరకు విలువైన యూనిట్లు మంజూరు చేస్తామని, రాయితీ పోగా, మిగతా విలువను లబ్ధిదారులు భరించాలని తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో ఈ పథకం అమలు చేయనున్నట్లు వివరించారు.

ప్రకృతి సేద్యాన్ని ముందుకు తీసుకెళ్తాం

రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ఏపీ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయానికి గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమనిటీ అవార్డు వచ్చిన సందర్భంగా శనివారం ఆయన ఓ ప్రకటన చేస్తూ, 'రానున్న రోజుల్లో రాష్ట్రంలోని 60లక్షల మంది రైతులు ప్రకృతి సేద్యం వైపు మరలేలా కృషి చేస్తాం. 2024-25లో 13లక్షల మంది రైతులతో 6.64 లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్యం చేయిస్తాం. 4లక్షల మంది రైతులు ఎలాంటి రసాయనాలూ వాడకుండా విత్తనం నుంచి విక్రయం వరకు 1.84లక్షల హెక్టార్లలో ప్రకృతి సేద్య విధానాలు అవలంబించేలా కృషి చేస్తాం. రైతుకూలీ కుటుంబాలతో 5.10లక్షల పెరటి తోటలను పెంచడం, 20వేల ఏ గ్రేడ్ మోడల్స్ తయారు చేయడం, 3.18లక్షల రైతులకు ప్రకృతి వ్యవసాయ అభ్యాసకులుగా సర్టిఫికెట్లు జారీ చేయడం వంటిచర్యలు తీసుకుంటామ'ని పేర్కొన్నారు.

సీదిరి అప్పలరాజుపై చర్యలు తీసుకోవాలి

- పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఫిర్యాదు

పలాస, జూలై 13: టీడీపీ అధినేత చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీమంత్రి సీదిరి అప్పలరాజుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కాశీబుగ్గ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. అప్పటి అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి హోదాలో అప్పలరాజు.. ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబునాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, మీడియాలో కూడా ఆయనపై తప్పుడు ప్రచారం చేసినందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రబాబు మానసిక పరిస్థితి సక్రమంగా లేదని, వైద్యుడికి చూపించాలని అప్పట్లో సీదిరి వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. అసెంబ్లీలో అనుచితంగా వ్యవహరించిన సీదిరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీఐ విజయానంద్‌కు ఫిర్యాదు పత్రాలు అందజేశారు.

18 నుంచి సభ్యత్వ నమోదు

- 9 లక్షల సభ్యత్వాలు లక్ష్యం: మనోహర్

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం మహా క్రతువుగా ప్రారంభం కానుందని జనసేన పార్టీ పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఈ నెల 18 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంపై శనివారం సాయంత్రం ఆయన నాయకులు, పార్టీ శ్రేణులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియ విధివిధానాలను నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమాన్ని 28 వరకూ నిర్వహించాలని పార్టీ అధ్యక్షులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిర్ణయించారని తెలిపారు. వేయి మంది క్రియాశీలక సభ్యులతో మొదలైన పార్టీ ప్రస్థానం ఇప్పుడు 6.47 లక్షల మంది క్రియాశీలక సభ్యులతో కొనసాగుతోందన్నారు. తొమ్మిది లక్షల సభ్యత్వాలు నమోదు చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్సీ హరిప్రసాద్, పార్టీ కోశాధికారి ఏవీ రత్నం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత దాడులొద్దు



కొలనుకొండలో పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ

(మొదటి పేజీ తరువాయి)

కార్యాలయానికి వచ్చి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలని సూచించారు. మంత్రుల్ని పార్టీ కార్యాలయానికి తీసుకొచ్చే బాధ్యతను జోనల్ ఇన్‌చార్జులు తీసుకోవాలన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి వచ్చే వినతుల్ని స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు మంత్రులంతా బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యకర్తలు, ప్రజల నుంచి విజ్ఞాపన స్వీకరణకు ఒక ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ఓ ప్రత్యేక కమిటీ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సమర్థులందరికీ నామినేటెడ్ పదవులు దక్కుతాయని భరోసా ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడిన వారి గురించి ఐదు రకాలుగా సమాచార సేకరణ చేస్తున్నామని, నియోజకవర్గ ఇన్‌చార్జులు, జిల్లా అధ్యక్షులతో పాటు పార్లమెంట్ కోఆర్డినేటర్, నియోజకవర్గ పరిశీలకుడు, ఐవీఆర్ఎస్ ద్వారా ఈ సమాచారం తీసుకుంటున్నామని వివరించారు. దీనిపై నివేదికలు త్వరగా పంపాలని చంద్రబాబు ఆదేశించారు.

కాళ్లు మొక్కే సంస్కృతి వద్దు

ఎవరైనా మొక్కితే నేనూ అదే పనిచేస్తా

- పార్టీ కార్యాలయంలో వినతిపత్రాలు స్వీకరించిన బాబు
- రాజధాని నిర్మాణానికి విరాళాల వెల్లువ

అమరావతి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నేతలు తన కాళ్లకు నమస్కారం చేయవద్దని, ప్రజల సేవకులమైన తాము వారితో కాళ్లకు నమస్కారం పెట్టించుకోవడం తగదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం టీడీపీ ప్రధాన కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. "కాళ్లకు నమస్కారం పెట్టి కుటుంబ పెద్దల నుంచి ఆశీర్వాదం తీసుకుంటాం. మిగతా సందర్భాల్లో అలా చేయడం మంచిది కాదు. ఒక వేళ ఎవరైనా బలవంతంగా కాళ్లకు దండం పెడితే నేను కూడా వారి కాళ్లకు నమస్కారం పెడతా. తల్లిదండ్రులు, గురువులు, దేవుడికి మాత్రమే కాళ్లకు మొక్కాలి...నాయకులకు కాదు. రాజకీయ నాయకులు ఈ సంస్కృతికి దూరంగా ఉండాలి. అందరూ ఆత్మగౌరవంతో నడుచుకోవాలి" అని చంద్రబాబు కోరారు.

వినతిపత్రాల స్వీకరణ...

టీడీపీ ప్రధాన కార్యాలయంలో వందల మంది నుంచి చంద్రబాబు విజ్ఞాపన పత్రాలు స్వీకరించారు. ప్రతి శనివారం ఆయన పార్టీ కార్యాలయానికి వెళుతున్నారు. ఈ శనివారం ఉదయం కూడా అక్కడకు వెళ్లిన ఆయన కోసం ఎదురుచూస్తున్న పార్టీ కార్యకర్తలు, ప్రజలు వినతి పత్రాలు అందించారు. ముందుగా గేట్ వద్ద ఉన్న రాజమండ్రికి చెందిన దివ్యాంగుల నుంచి సీఎం వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం మీడియారూంలో ప్రజలను, కార్యకర్తలను, వివిధ సమస్యలపై వచ్చిన వారిని కలిశారు. ఆరోగ్య సమస్యలు, భూవివాదాలు, వ్యక్తిగత సమస్యలపై ప్రజలు సీఎంకు విన్నవించారు. బొబ్బిలి మండలానికి చెందిన చంద్రమౌళి అనే వ్యక్తి తమ మూడేళ్ల బాలుడి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సాయం కోసం చంద్రబాబును అభ్యర్థించారు. బాలుడిని ఢిల్లీ టాటా ఇన్‌స్టిట్యూట్‌లో వైద్యం కోసం చేర్పించామని, ఇప్పటికే రూ.10 లక్షల దాకా ఖర్చు చేశామని, మరో రూ.10 లక్షలు ఖర్చవుతుందని...సత్వరమే ట్రాన్స‌ప్లాంటేషన్ జరగకపోతే బిడ్డ చనిపోతాడని గోడు వెళ్లబోసుకున్నారు. గుంటూరుకు చెందిన వెచ్చా ప్రీతమ్ దంపతులు తమ పాప హితైషీతో కలిసి చంద్రబాబును కలిశారు. ఏడాది వయసున్న హితైషీ తీవ్రమైన స్పైనల్ మసక్యులర్ అట్రోఫీ అనే ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నదని ఆయన దృష్టికి తెచ్చారు. పాపకు ఉన్న జబ్బు నయం కావాలంటే రూ.16 కోట్ల ధర కలిగిన ఇంజెక్షన్ అవసరం. ఇప్పటికే ఫండ్ రైజింగ్ కార్యక్రమం కూడా చేపట్టారు. మరో నెల రోజుల్లో ఈ చికిత్స అందించాల్సి ఉందని తల్లిదండ్రులు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై వెంటనే పరిశీలన చేస్తామని ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. దివ్యాంగుల కార్పొరేషన్‌లో పనిచేసే ఉద్యోగులు తమ పదవీ విరమణ వయసును 62కు పెంచాలని కోరారు. కాగా, విజయవాడకు చెందిన షేక్ ఆసిన్, మహమ్మద్ ఇంతియాజ్... అమరావతి కోసం రూ.లక్ష అందించారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

తాడేపల్లి, జూలై 13: ధర్మం పట్ల విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండడం అందరి అదృష్టమని సీఎం చంద్రబాబు అన్నారు. పేదరికం లేని సమాజమే తన లక్ష్యమన్నారు. శనివారం గుంటూరు జిల్లా కొలనుకొండ హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ అనంత శేష స్థాపన కార్యక్రమం జరిగింది. చంద్రబాబు మాట్లాడుతూ, హరేకృష్ణ మూమెంట్‌లో సత్య గౌర చంద్రదాస సహా ఐఐటీలో చదివిన 50 మంది ఉన్నారనీ, ఇస్కాన్‌లో కూడా ఐఐటీ గ్రాడ్యుయేషన్ పొందిన వారు ఉన్నారన్నారు. తెలుగువారు నెంబర్ వన్ జాతిలా ఉండాలని తాను కోరుకుంటానని తెలిపారు. మంచిపని చేసేవారికి వచ్చే ఐదేళ్ల స్పీడ్ బ్రేకర్లు ఉండవని, వారికి సహకరిస్తామని చంద్రబాబు అన్నారు. లాలా ప్రభుపాద స్ఫూర్తితో అక్షయపాత్రను ప్రారంభించారని తెలిపారు. అన్న క్యాంటీన్‌కు భోజన సరఫరాను గతంలో అక్షయపాత్రకే అప్పగించానని గుర్తుచేశారు. కాగా, ఆధ్యాత్మికతతోపాటు ఆచార వ్యవహారాలను కాపాడడం ముఖ్యమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు.



విరాళం అందజేస్తున్న శ్రీనివాసరాజు

అన్న క్యాంటీన్‌కు రూ.కోటి విరాళం

- సీఎంకు చెక్కు అందించిన ఎస్ఎల్‌వీ గ్రూపు
- హరే కృష్ణ గోకుల క్షేత్రానికి 3 కోట్ల విరాళాలు

విజయవాడ, జూలై 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల నిర్వహణకు ఎస్ఎల్‌వీ గ్రూపు చైర్మన్ పెన్మత్స శ్రీనివాసరాజు రూ.కోటి విరాళం ప్రకటించారు. గుంటూరు జిల్లా కొలనుకొండలోని హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శనివారం జరిగిన కార్యక్రమంలో చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. గోకుల క్షేత్రానికి మరో రూ.1.08 కోట్లను అందజేశారు. శ్రీనివాసరాజు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం మారగానే... తన ఆస్తుల విలువ రూ.100 కోట్ల మేర పెరిగాయని వివరించారు. 'పూర్ టు రిచ్' స్ఫూర్తితో 100 కుటుంబాలను దత్తత తీసుకుంటామన్నారు. కాగా, హరేకృష్ణ సంస్థకు సక్కు గ్రూప్ రూ.కోటి విరాళాన్ని, యలమంచిలి కృష్ణమోహన్ గ్రూప్ మరో కోటి విరాళాన్ని అందించాయి.



అనంత్-రాధిక జంటను ఆశీర్వదిస్తున్న మోదీ

అనంత్-రాధిక జంటకు మోదీ, బాబు ఆశీర్వాదం

ముంబై, జూలై 13: ముకేశ్ అంబానీ ఇంట జరుగుతున్న కల్యాణమహోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. వివాహ వేడుకల్లో భాగంగా 'శుభ్‌ఆశీర్వాద్' పేరిట శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన వేడుకకు ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా హాజరయ్యారు. నూతన వధూవరులు అనంత్ అంబానీ, రాధిక మర్చంట్‌ను ఆశీర్వదించారు. కాగా ముకేశ్ అంబానీ తనయుడు అనంత్ అంబానీ వివాహ వేడుకలకు శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు, వారి కుమారుడు, మంత్రి లోకేశ్ దంపతులు హాజరయ్యారు. పార్టీ ప్రధాన కార్యాలయంలో మధ్యాహ్నం వినతులను స్వీకరించిన అనంతరం చంద్రబాబు కాసేపు నేతలతో భేటీ అయ్యారు. అనంతరం విమానంలో బయలుదేరి ముంబైకు వెళ్లారు. కాగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ తదితర ప్రముఖులు ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. వీరితోపాటు దేశ విదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులు, క్రికెటర్లు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. అనంత్-రాధిక వివాహ రిసెప్షన్ ఆదివారం జరగనుంది.





అనంత్, రాధిక దంపతులను ఆశీర్వదిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు, అంబానీతో మాటామంతీ

శేషాచలంలో 'పెద్ద పుష్ప'



- వందల కోట్ల ఎర్రచందనం విదేశాలకు
- జగన్ ఏలుబడిలో సినీ ఫక్కీలో దోపిడీ
- స్మగ్లింగ్ సులువుగా జరిగేలా మాస్టర్ ప్లాన్
- ఉద్దేశపూర్వకంగా భద్రతా వ్యవస్థ నిర్వీర్యం
- ఐదేళ్లలో స్మగ్లర్లు దోచుకున్నది 8 వేల టన్నులు సర్కారు అమ్మినదానికంటే ఇదే ఎక్కువ
- పరిరక్షణలో జగన్ సర్కారు విఫలం
- విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

"పుష్ప ఉంటే సరుకు ఉండదు. సరుకు ఉంటే పుష్ప ఉండడు. ఈ రెండూ కలిపి సూడాలంటే మీరెవ్వరూ ఉండరు"... పుష్ప సినిమాలో ఎర్రచందనం స్మగ్లింగ్ చేసే పాత్రధారి పోలీసుతో చెప్పిన డైలాగ్ ఇది. అచ్చం ఇలాంటి సీనే జగన్ ఏలుబడిలో కొనసాగింది. పచ్చని అడవిలో ఎర్రచందనం రక్షణ కోసం ప్రత్యేక పోలీసు బలగం ఉంది. అయినా ఎర్రచందనం ఖాళీ అయింది. వందల కోట్ల విలువైన సరుకు అడవి దాటి వెళ్లిపోయింది. రక్షణ దళం, సెంట్రీ సెక్యూరిటీ, రెగ్యులర్ గార్డులు ఎందరు ఉన్నా ఆపలేకపోయారు. స్మగ్లర్లదే పైచేయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వ్యవస్థీకృతమైన వైసీపీ పెద్దమనిషి నేతృత్వంలో అడవి స్మగ్లర్లకు అడ్డాగా మారిపోయింది. అచ్చం సినిమా ఫక్కీలో వ్యవహారం సాగించారు. ఇటు గనులు, అటు అడవిని గుప్పిట పట్టిన ఆయనే అక్కడ పెద్ద పుష్ప! అడవిని గుల్ల చేసి ఎర్రచందనం దేశాలు దాటించారు. సర్కారు అమ్మిన సరుకు కంటే, దొంగలు దోచుకున్నదే రెట్టింపు. పనిలో పనిగా అడవిలో అడ్డగోలుగా అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో అడవిలోకి వెళ్లి ఎర్రచందనం చెట్లు చూడాలంటేనే భయపడేలా కఠిన చర్యలు తీసుకుంది. స్మగ్లర్లు, దొంగలపై ఉక్కుపాదం మోపింది. అడవిలోకి వెళ్తే ప్రాణాలతో తిరిగి రాలేమనే భయాన్ని చూపించింది. జగన్ సర్కారు వచ్చాక అందుకు పూర్తి భిన్నంగా సాగింది. దోచుకున్నవారికి దోచుకున్నంత అన్నట్లుగా ఎర్రచందనం కొల్లగొట్టారు. ఇందుకోసం వ్యవస్థలను నిర్వీర్యం చేశారు. రక్షణ దళాన్ని బలహీనపరిచారు. స్మగ్లర్లదే పైచేయి అయ్యేలా పెద్ద పుష్ప పెద్ద మంత్రాంగమే నడిపారు.

రక్షణ దళం నిర్వీర్యం

ఎర్రచందనం కోసం శేషాచలం అడవిలోకి వచ్చే స్మగ్లర్లు కరుడుగట్టిన వారు. నాటు ఆయుధాలు, కత్తులు, గొడ్డళ్లతో దాడులు చేసి పోలీసులు, అటవీ సిబ్బందిని హత్య చేసిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. ఇలాంటి క్రూరమైన ముఠాలను ఎదుర్కొనేందుకు 2014-19 కాలంలో తెలుగుదేశం ప్రభుత్వం ఎర్రచందనం సాయుధ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేసింది. అత్యాధునిక ఆయుధాలు సమకూర్చింది. స్మగ్లర్లను ధీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా ప్రత్యేక శిక్షణ ఇప్పించింది. జగన్ సర్కారు వచ్చాక ఈ వ్యవస్థ నిర్వీర్యం అయింది. 463 మంది సభ్యులుండే టాస్క్‌ఫోర్స్‌లో ఇప్పుడు 230 మంది మిగిలారు. అంటే, సగానికి సగం బలం తగ్గిపోయింది. దాన్ని బలోపేతం చేసే ప్రయత్నాలేవీ జగన్ సర్కారు చేయలేదు. అవసరమైన నిధులు కేటాయించలేదు. ఈ విభాగం బిల్లులు కూడా సకాలంలో చెల్లించలేదు. టాస్క్‌ఫోర్స్ బలహీనపడిందని గుర్తించిన స్మగ్లర్లు శేషాచలాన్ని జల్లెడపట్టారు. ఎర్రచందనం చెట్లు నేలకూల్చి సరకును విదేశాలకు తరలించారు. అటవీ, పర్యావరణ శాఖ మంత్రిగా చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డినే ఉన్నారు. ఆయన కూడా ఈ విషయంలో పెద్దగా శ్రద్ధ చూపలేదు. టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేసేలా తగిన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సరుకులో సింహభాగం రెగ్యులర్ పోలీసులు వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుకున్నవే.

సినీ ఫక్కీలో గోల్‌మాల్

సాయుధ బలగాలు అడవిలో గస్తీ తిరిగితే స్మగ్లర్లు స్వేచ్ఛగా ప్రవేశించలేరు. చెట్లు కొట్టేయలేరు. సరకును బయటకు తీసుకెళ్లలేరు. ఎర్రచందనం స్మగ్లింగ్ కోసం అచ్చం సినీ ఫక్కీలో స్క్రీన్‌ప్లే నడిపారు. టాస్క్‌ఫోర్స్ బలం సగానికి సగం తగ్గిపోయినా పునరుద్ధరించలేదు. మరోవైపు అటవీ ప్రాంతంలో ఉండే ఫ్రంట్‌లైన్ ఫారెస్ట్ స్టాఫ్‌ను పక్కకు తప్పించారు. వీరు అడవిలో కీలకమైన పాయింట్లలో గస్తీ తిరుగుతుంటారు. మనుషుల కదలికలను సులువుగా పసిగట్టగల శిక్షణ వారికి ఉంది. అలాంటి వారిని ఇతర విధుల పేరిట జిల్లా సరిహద్దు ప్రాంతాలకు పంపించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లను ఎర్రచందనం బాగా ఉన్న ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు ఉద్దేశ్యపూర్వకంగా పంపించారు. ఎర్రచందనం స్మగ్లింగ్ సులువుగా జరిగేలా ఇలా మాస్టర్ ప్లాన్‌ను అమలు చేశారు. ఫ్రంట్‌లైన్ సిబ్బంది లేకపోవడంతో దర్జాగా సరుకును అడవి నుంచి దాటించేవారు. సినిమాల్లో కూడా ఇంతే. అడవిలో స్మగ్లింగ్ చేయాలనుకున్న గజదొంగకు పోలీసులు ఎదురుపడకుండా చూస్తారు. అటవీ అధికారిని తప్పించడమో లేదా వేరే పని అప్పగించి ఇతర ప్రాంతాలకు పంపించడమో చేస్తారు. ఆ వెంటనే దొంగ తన పని సజావుగా చేసుకుపోతాడు. ఎన్నో సినిమాల్లో ఇలాంటి సీన్లు ఉన్నాయి. చిత్తూరు జిల్లా పెద్ద పుష్ప దీన్నే కాపీ కొట్టారు. ఎర్రచందనానికి కాపాలా ఉన్న ఫారెస్ట్ అధికారులు, సిబ్బందిని తన అధికార బలంతో ఇతర ప్రాంతాలకు ఓడీపై పంపించి స్మగ్లర్ల కొమ్ముకాశారు. వారు దర్జాగా సరుకు ఎత్తుకెళ్లిపోయారు.

జగన్ సర్కారు విఫలం

జగన్ సర్కారు నాలుగున్నరేళ్ల వ్యవధిలో కేవలం 836.12 టన్నుల ఎర్రచందనం విక్రయించింది. కానీ స్మగ్లర్లు దోచుకెళ్లినది 8 వేల మెట్రిక్ టన్నులపైనే ఉంటుందని అటవీ శాఖ వర్గాల అంచనా. అంటే.. జగన్ పాలనలో సర్కారు విక్రయించిన ఎర్రచందనం కంటే, దొంగలు ఎత్తుకెళ్లిన సరుకే చాలా ఎక్కువగా ఉందని నిర్ధారణ అవుతోంది. అటు టాస్క్‌ఫోర్స్‌ను నిర్వీర్యం చేసి, ఇటు ఫారెస్ట్ అధికారులను ఎర్రచందనానికి రక్షణగా లేకుండా చేయడంతో వందల కోట్ల విలువైన సరుకు దొంగల పాలైనట్లు స్పష్టమవుతోంది. ఎర్రచందనం పరిరక్షణలో జగన్ సర్కారు విఫలమైందని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

పెద్ద పుష్ప కనుసన్నల్లోనే

జగన్ ఏలుబడిలో ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్, ఇతర వ్యవస్థలు నిర్వీర్యం కాగా, శేషాచలం అడవులు స్మగ్లర్లకు స్వర్గధామంగా మారాయి. ఈ పరిణామాల వెనుక ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పెద్దపుష్ప పాత్ర ఉందని అధికార, రాజకీయ వర్గాలు బాహాటంగా చెబుతున్నాయి. ఇటు అడవి, అటు గనులను తన నియంత్రణలో ఉంచుకొని అడ్డగోలు అక్రమాలకు ఆస్కారం కల్పించారని ఆరోపణలున్నాయి. అక్రమ మైనింగ్‌లో ఆయనపై ఉన్న ఆరోపణలు ఎవరిపైనా లేవు. అడవిని తన నియంత్రణలో ఉంచుకొని ఎర్రచందనం అక్రమ వ్యాపారాన్ని దర్జాగా చేశారని అటవీ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఎర్రచందనం నరకడం, రవాణా అన్నీ ఆయన కనుసన్నల్లోనే జరిగాయని, బెంగళూరుకు చెందిన ఓ ప్రముఖ కలప వ్యాపారితో చైనా కేంద్రంగా లావాదేవీలు నడిపించారని పెద్ద పుష్ప చరిత్ర చెబుతున్నాయి. ప్రభుత్వం సీబీఐతో విచారణ చేయిస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అధికార వర్గాలు అంటున్నాయి.

గంజాయి రహిత రాష్ట్రమే లక్ష్యం

- గంజాయి రవాణాదారులపై కఠిన చర్యలు
- త్వరలో యాంటీ నార్కోటిక్ టీమ్, టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు
- డీజీపీ ద్వారకా తిరుమలరావు



తిరుమల ఆలయం ముందు ద్వారకా తిరుమలరావు దంపతులు

తిరుపతి(నేరవిభాగం), జూలై 13: రాష్ట్రాన్ని గంజాయి రహితంగా తీర్చిదిద్దడమే పోలీసు శాఖ ముందున్న ప్రధాన లక్ష్యమని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం తిరుపతి వచ్చిన ఆయన పోలీసు అతిథి గృహంలో రాయలసీమ పరిధిలోని ఎనిమిది జిల్లాల ఎస్పీలు, అనంతపురం డీఐజీ డాక్టర్ షెముషి బాజ్పేయితో సమావేశమయ్యారు. జిల్లాలవారీగా శాంతి భద్రతలు, నేరాల కట్టడి, గత ఐదేళ్లలో జరిగిన పరిణామాలు, పోలీసు సంక్షేమం వంటి విషయాలపై చర్చించారు. అనంతరం మీడియా సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ అమాయక పేద గిరిజనులకు కొందరు డబ్బులు ఆశ చూపి గంజాయి సాగుకు ప్రోత్సహిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా గంజాయి సాగు, రవాణా, విక్రయాలపై గట్టి నిఘా ఉంచుతామని హెచ్చరించారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు అరికట్టడానికి ప్రత్యేకంగా యాంటీ నార్కోటిక్ టీమ్, టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గంజాయి రవాణా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుపతిలో గంజాయి అరికట్టడానికి ప్రజలకు, ముఖ్యంగా యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలీసు శాఖకు పదేళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన వాహనాలు పాతబడిపోయాయని వాటి స్థానంలో కొత్త వాహనాలు సమకూర్చాలని ఆలోచిస్తున్నామని చెప్పారు. పోలీసుల సంక్షేమం విషయంలో, పదోన్నతుల విషయంలో అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్పీల నుంచి కానిస్టేబుళ్ల వరకు క్షేత్రస్థాయిలోకి వెళ్లినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. మానవహక్కులకు భంగం కలగకుండా నేరాల అదుపునకు గట్టిగా పనిచేయాలని డీజీపీ ఆదేశించారు.

శ్రీవారి సేవలో డీజీపీ

డీజీపీ ద్వారకా తిరుమలరావు శనివారం సతీసమేతంగా రాత్రి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. నైవేద్య విరామ సమయంలో సంప్రదాయ వస్త్రధారణతో వచ్చారు. క్షేత్రసంప్రదాయాన్ని పాటిస్తూ ముందుగా వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోకి వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

'విపత్తుల' కార్యాలయాన్ని సందర్శించిన సిసోడియా



సాంకేతిక వివరాలు పరిశీలిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా

తాడేపల్లి, జూలై 13: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయాన్ని రెవెన్యూ శాఖ (ల్యాండ్స్ అండ్ విపత్తుల నిర్వహణ స్టాంప్స్, రిజిస్ట్రేషన్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సంస్థ అవలంబిస్తున్న అనేక సాంకేతిక అంశాల గురించి మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఆయనకు వివరించారు. తుఫాన్లు, వరదలు, వడగాల్పులు, భారీ వర్షాలు, పిడుగుపాటు హెచ్చరిక సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి పంపించే కార్యచరణను వివరించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ విపత్తులను ఎదుర్కొనడానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు, ప్రణాళికలు అమలు చేస్తూ హెచ్చరికలు జారీ చేస్తూ ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించాలన్నారు.

హోం శాఖ ముఖ్య కార్యదర్శిగా విశ్వజీత్ బాధ్యతల స్వీకరణ

రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శిగా కుమార్ విశ్వజీత్ బాధ్యతలు స్వీకరించారు. శనివారం అమరావతి సచివాలయం రెండవ బ్లాకులోని చాంబరల్లో బాధ్యతలు స్వీకరించారు. గతంలోనూ హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు.

ఐదేళ్లలో ఆర్థిక వ్యవస్థ పతనం

14 లక్షల కోట్లకు పెరిగిన అప్పులు

- రోజుకు వడ్డీ చెల్లింపులు 75 కోట్లు
- గ్రామ సచివాలయంలో 80% మంది ఉద్యోగులకు పనిలేదు
- జన చైతన్య వేదిక చర్చాగోష్ఠిలో మాజీ ఐఏఎస్ పీవీ రమేశ్



ప్రసంగిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేశ్

గుంటూరు (కార్పొరేషన్), జూలై 13: 'ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదు సంవత్సరాల కాలంలో ఆర్థిక వ్యవస్థ పతనమైంది. రూ.14 లక్షల కోట్లకు అప్పులు పెరిగాయి' అని రాష్ట్ర ప్రభుత్వ మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ పీవీ రమేశ్ పేర్కొన్నారు. శనివారం గుంటూరులో జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి, కార్యాచరణ అనే అంశంపై జరిగిన చర్చా గోష్ఠిలో ఆయన ప్రసంగించారు. 'వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతిరోజు రూ.75 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నాం. మరో రూ.175 కోట్లు ప్రతిరోజు అప్పులు చేసే దుస్థితికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దిగజారింది. రాష్ట్ర విభజన ద్వారా తీవ్రంగా నష్టపోయాం. గ్రామ సచివాలయ వ్యవస్థలో 80 శాతం ఉద్యోగులకు ఎలాంటి పని ఉండటం లేదు. రాష్ట్రంలో రాజకీయ పార్టీలు ప్రజలను కులాల ప్రాతిపదికగా విభజించి ఓట్లు పొందాలని భావిస్తున్నాయి. మట్టి, ఇసుక, మైనింగ్ లాంటి సహజ వనరులను గత పాలకులు దోచుకుని అవినీతిని తారా స్థాయికి తీసుకెళ్లారు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క శాతం జనాభా చేతిలో 44 శాతం ఆస్తులు, 24 శాతం ఆదాయం కలిగి ఉన్నారు. అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజలు కేవలం ఐదు శాతం ఆస్తులు కలిగి ఉన్నారు' అని రమేశ్ అన్నారు. కార్యక్రమంలో జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, రెడ్ క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రామచంద్ర రాజు తదితరులు ప్రసంగించారు.

అరాచక ఐపీఎస్‌లకు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

పలికారు. టీడీపీ బాధితులు ఫిర్యాదులు చేసినా, గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారు.

- అప్పట్లో సీఐడీ చీఫ్ సునీల్‌కుమార్ ఏం చెబితే అది గుడ్డిగా చేస్తూ, విపక్షాలను వేధించిన శ్రీకాకుళం ఎస్పీ రాధికకు పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయించారు. ఈమె శ్రీకాకుళం జిల్లా ఎస్పీగా ఉంటూ వైసీపీ నేతలకు వత్తాసు పలికారు. టీడీపీ బాధితులు ఫిర్యాదులు చేసినా, గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారు.
- జగన్ హయాంలో ఉండవల్లిలోని టీడీపీ అధినేత చంద్రబాబు నివాసంపైన, మంగళగిరిలోని ఆ పార్టీ కార్యాలయంపైన వైసీపీ మూకలు దాడులు చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో చర్యలు తీసుకోవాల్సిన ఎస్పీ ఆరిఫ్ ప్రేక్షక పాత్ర పోషించారు. అనంతరం, జగన్ ప్రభుత్వమే ఆయనను నెల్లూరులో నియమించింది. అయితే.. ప్రస్తుత ప్రభుత్వం ఆయనను డీపీజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.
- అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి అనుకూలంగా వ్యవహరించిన ఎస్పీ జగదీశ్‌కు కూడా పోస్టింగ్ ఇవ్వలేదు.
- నంద్యాలలో వైసీపీ అభ్యర్థికి అనుకూలంగా ప్రచారానికి వచ్చిన సినీనటుడు అల్లు అర్జున్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఎన్నికల వేళ అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించినా అడ్డు చెప్పని ఎస్పీ రఘువీరారెడ్డిని పక్కన పెట్టారు.
- కడపలో వైసీపీకి నమ్మిన బంటుగా వ్యవహరిస్తూ, ఆ పార్టీకి అనుకూలంగా ఉంటూ.. జగన్ ప్రత్యర్థి బీటెక్ రవిలాంటి వారిని తప్పుడు కేసుల్లో ఇరికించిన సిద్ధార్థ కౌశిల్‌కు పోస్టింగ్ ఇవ్వలేదు. డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.
- ఇదే సమయంలో గత ప్రభుత్వ ఆగ్రహానికి గురై సరైన పోస్టింగ్ లేకుండా ఉన్న ఐపీఎస్‌లకు ఈసారి సముచిత స్థానం దక్కింది.
- అనంతపురం ఎస్పీగా ఉన్న శ్రీనివాసరావును గత వైసీపీ ప్రభుత్వం బదిలీ చేసి ఆయన స్థానంలో అన్బురాజన్‌ను నియమించింది. ఈయనకు జగన్ కాంపౌండ్ అధికారిగా పేరుంది. అనంతపురంలో ఏకపక్షంగా వ్యవహరించడంతో ఆయనను ఈసీ బదిలీ చేసింది. ఈస్థానంలో అమిత్ బర్దార్‌ను ఎస్పీగా నియమించింది. ఆయన ఎన్నికల సమయంలో తాడిపత్రిలో హింసను అరికట్టే క్రమంలో రాళ్లదాడికి గురై తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం ఆయనకు అల్లూరి జిల్లా ఎస్పీగా అవకాశం ఇచ్చింది.
- గతంలో చంద్రబాబు చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి, ఐపీఎస్ హోదా రాగానే తెలంగాణ కేడర్‌కు వెళ్లిపోయిన ఎల్. సుబ్బరాయుడును డిప్యూటేషన్‌పై ఏపీకి తీసుకువచ్చారు. కీలకమైన తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమించారు. ఎర్రచందనం కట్టడి విభాగానికి ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.
- పల్నాడు ఎస్పీగా పని చేస్తూ వైసీపీ చేసిన తప్పుడు ఫిర్యాదులు కారణంగా సస్పెన్షన్‌కు గురైన బిందు మాధవ్‌ను కర్నూలు ఎస్పీగా నియమించారు.
- అన్నమయ్య జిల్లాలో వైసీపీ నేతలు చెప్పినట్లు వినకుండా రూల్స్ ప్రస్తావించి.. పోస్టింగ్ పోగొట్టుకున్న హర్షవర్ధన్ రాజు, రెడ్డి గంగాధర్‌రావులను కడప, కృష్ణా జిల్లాల ఎస్పీలుగా నియమించారు.
- గత ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు తీవ్ర వివక్షకు గురైన దామోదర్‌కు ప్రకాశం జిల్లా ఎస్పీగా పోస్టింగ్ లభించింది.

ఐపీఎస్‌ల బదిలీలు ఇలా..

ఐపీఎస్	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.వి.మహేశ్వర రెడ్డి	ఓఎస్‌డీ రంపచోడవరం	శ్రీకాకుళం జిల్లా ఎస్పీ
వకుల్ జిందాల్	బాపట్ల జిల్లా ఎస్పీ	విజయనగరం జిల్లా ఎస్పీ
ఎం. దీపిక	విజయనగరం జిల్లా ఎస్పీ	అనకాపల్లి జిల్లా ఎస్పీ
వి. రత్న	6వ బెటాలియన్ కమాండెంట్	సత్యసాయి జిల్లా ఎస్పీ
ఎస్‌వీ మాధవ రెడ్డి	సత్యసాయి జిల్లా ఎస్పీ	పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ
విక్రాంత్ పాటిల్	పార్వతీపురం మన్యం	కాకినాడ జిల్లా ఎస్పీ
ఎస్.సతీశ్‌కుమార్	కాకినాడ జిల్లా ఎస్పీ	గుంటూరు జిల్లా ఎస్పీ
తుషార్ డూడీ	గుంటూరు జిల్లా ఎస్పీ	బాపట్ల జిల్లా ఎస్పీ
అమిత్ బర్దార్	వెయిటింగ్	అల్లూరి జిల్లా ఎస్పీ
తుహిన్ సిన్హా	అల్లూరి జిల్లా ఎస్పీ	డీసీపీ-2, విశాఖపట్నం
డి.నరసింహ కిశోర్	చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, తిరుమల	తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ
వి.విద్యాసాగర్ నాయుడు	గ్రేహౌండ్స్ కమాండర్	అన్నమయ్య జిల్లా ఎస్పీ
బి. కృష్ణారావు	అన్నమయ్య జిల్లా ఎస్పీ	కోనసీమ జిల్లా ఎస్పీ
ఆర్. గంగాధర్ రావు	సీఐడీ, ఎస్పీ	కృష్ణా జిల్లా ఎస్పీ
అద్నాన్ నయీమ్ అస్మి	కృష్ణా జిల్లా ఎస్పీ	పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ
అజిత వేజెండ్ల	పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ	డీసీపీ-1, విశాఖపట్నం
కె. ప్రతాప్ శివ కిశోర్	ఏఎస్‌పీ గ్రేడ్-1, చింతపల్లి	ఏలూరు జిల్లా ఎస్పీ
కె. శ్రీనివాసరావు	డీసీపీ, జగ్గయ్యపేట	పల్నాడు జిల్లా ఎస్పీ
మలిక గార్గ్	పల్నాడు జిల్లా ఎస్పీ	5వ బెటాలియన్, కమాండెంట్
ఎ.ఆర్.దామోదర్	ప్రిన్సిపాల్, పోలీస్ ట్రైనింగ్ కాలేజీ	ప్రకాశం జిల్లా ఎస్పీ
జి. బిందు మాధవ్	వెయిటింగ్	కర్నూలు జిల్లా ఎస్పీ
జి.కృష్ణకాంత్	కర్నూలు జిల్లా ఎస్పీ	నెల్లూరు జిల్లా ఎస్పీ
అధిరాజ్ సింగ్ రానా	డీసీపీ, ఎన్టీఆర్ జిల్లా	నంద్యాల జిల్లా ఎస్పీ
వి.హర్షవర్ధన్ రాజు	తిరుపతి జిల్లా ఎస్పీ	కడప జిల్లా ఎస్పీ
కె.వి.మురళీకృష్ణ	అనకాపల్లి జిల్లా ఎస్పీ	అనంతపురం జిల్లా ఎస్పీ
గౌతమి శాలి	అనంతపురం జిల్లా ఎస్పీ	డీసీపీ, ఎన్టీఆర్ జిల్లా
సుబ్బరాయుడు	ఏపీకి డిప్యుటేషన్	తిరుపతిజిల్లా ఎస్పీ
వి. గీతాదేవి	పీటీసీ, వైస్ ప్రిన్సిపాల్	ఇంటెలిజెన్స్ ఎస్పీ
జి.ఆర్.రాధిక	శ్రీకాకుళం జిల్లా ఎస్పీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
డి.మేరీ ప్రశాంతి	ఏలూరు జిల్లా ఎస్పీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
కె.ఆరీఫ్ ఆఫీజ్	నెల్లూరు జిల్లా ఎస్పీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
కె.రఘువీరారెడ్డి	నంద్యాల జిల్లా ఎస్పీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
జి.సుమిత్ సునీల్	ప్రకాశం జిల్లా ఎస్పీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
పి.జగదీశ్	తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
సిద్ధార్థ కౌశిల్	కడప జిల్లా ఎస్పీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
ఎస్.శ్రీధర్	కోనసీమ జిల్లా ఎస్పీ	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్
ఎం.సత్తి బాబు	డీసీపీ, ఎన్టీఆర్ జిల్లా	డీజీపీ ఆఫీస్‌లో రిపోర్ట్

నేడు, రేపు భారీ వర్షాలు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం

- రేపటిలోగా అల్పపీడనంగా మారే చాన్స్
- మత్స్యకారులు సంద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరిక

అమరావతి, విశాఖపట్నం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కోస్తాకు ఆనుకుని పశ్చిమ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీనికితోడు బిహార్, అసోంల నుంచి వేర్వేరుగా వాయువ్య బంగాళాఖాతం వరకు 2 ఉపరితల ద్రోణులు, కేరళ నుంచి గుజరాత్ వరకు అరేబియా సముద్ర తీరం వెంబడి మరో ఉపరితల ద్రోణి విస్తరించాయి. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రుతుపవనాలు చురుగ్గా మారాయి. శనివారం రాష్ట్రంలో అనేకచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు, కోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం లేదా సోమవారం అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం, అరేబియా సముద్రం మీదుగా వస్తున్న రుతుపవన గాలుల ప్రభావంతో ఆదివారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయన్నారు. ఇంకా ఈనెల 17వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అనేకచోట్ల వర్షాలు కురుస్తాయని తెలిపారు. ఉత్తర కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. కాగా, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఆదివారం అల్లూరి, మన్యం, అనకాపల్లి, ఏలూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని పేర్కొంది. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. శనివారం సాయంత్రం వరకు అల్లూరి జిల్లా కొయ్యూరులో 80.5, అనంతగిరిలో 56, మన్యం జిల్లా వీరఘట్టంలో 56, శ్రీకాకుళం జిల్లా పలాసలో 50, మన్యం జిల్లా సీతంపేటలో 49.5, తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడిలో 49 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఆప్టా నూతన కార్యవర్గం ఎన్నిక

- ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని తీర్మానం

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన పాత బకాయిలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం(ఆప్టా) తీర్మానించింది. ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఏజీఎస్ గణపతిరావు అధ్యక్షతన శనివారం విజయవాడ సమీప పోరంకిలో నిర్వహించారు. నూతన పీఆర్‌సీ వేసి వెంటనే మధ్యంతర భృతిని ప్రకటించాలని, జీవో నెంబరు 117 రద్దు చేసి ఉన్నత పాఠశాలల్లో కలిపిన 3, 4, 5 తరగతులను తిరిగి పాత పాఠశాలలకు తీసుకురావాలని, జీవో 3 ను పునరుద్ధరించి గిరిజన ప్రాంతవాసులకు న్యాయం చేయాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని కోరుతూ తీర్మానాలను ఆమోదించారు. 2024-26 కాలానికి సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడుగా ఏజీఎస్ గణపతిరావు(విజయనగరం జిల్లా), గౌరవాధ్యక్షుడిగా మెహిదీ మీర్జా(కృష్ణా జిల్లా), ప్రధాన కార్యదర్శిగా కె.ప్రకాశరావు(కర్నూలు జిల్లా), ఆర్థిక కార్యదర్శిగా ఎస్.నారాయణరావు(విజయనగరం జిల్లా) ఎన్నికయ్యారు.

పచ్చకామెర్లోడికి అంతా పచ్చగానే..

- బాబుకి తోకపార్టీ అనడం అవగాహనారాహిత్యం
- జీవోకి క్లారిటీ ఇవ్వమనడం కొమ్ముకాయడమా..!
- తల్లుల పక్షాన నిలదీశాం కాబట్టే ప్రభుత్వం వివరణ ఇచ్చింది
- ప్రతి బిడ్డకూ 15 వేలు అని జగన్ ప్రచారం చేయడం నిజం
- వైసీపీపై షర్మిల మండిపాటు... బహిరంగ చర్చకు రమ్మంటూ సవాల్



అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): 'అమ్మఒడి కింద బిడ్డలిద్దరికీ రూ.15,000 చొప్పున ప్రతి తల్లికి ఇస్తామని ప్రచారం చేయలేదా?' అంటూ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిలదీశారు. జగన్ పత్రికలో తనపై వచ్చిన విమర్శపై ఆమె శనివారం ఎక్స్‌లో స్పందించారు. 'పచ్చకామెర్లోడికి లోకం అంతా పచ్చగా కనిపిస్తుందనే సామెతలా వైసీపీ నేతల తీరు. జగన్ పత్రికలో తల్లికి వందనం ఉత్తర్వులపై వచ్చిన వార్తకు చంద్రబాబు సమాధానం చెప్పాలని మేం అడిగితే... బాబుకు కాంగ్రెస్ తోక పార్టీ అని ముడిపెట్టడం వైసీపీ అవగాహనారాహిత్యానికి నిదర్శనం. వైసీపీ నేతలకు కళ్లుండి చూడలేకపోతున్నారు. విజ్ఞత కలిగినవాళ్లే అయితే.. మేం చెప్పిందేమిటో ఒకటికి పదిసార్లు వినాలి. తల్లికి వందనం జీవో 29 క్లారిటీ లేదని, జగన్ మీడియా రాసిన వార్తకు వివరణ ఇవ్వాలని, ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ పథకం వర్తింప జేయాలని డిమాండ్ చేస్తే.. కూటమి ప్రభుత్వానికి కొమ్ము కాసినట్లు ఎలా అవుతుంది? మేం ప్రెస్‌మీట్‌లో నిలదీశాం కాబట్టే 24 గంటలు దాటకుండా సర్కారు ప్రజలకు వివరణ ఇచ్చుకుంది. ప్రతిపక్షంగా తల్లుల పక్షాన మేం నిలబడితే కాంగ్రెస్, బాబుకి తోకపార్టీ ఎలా అవుతుంది? వైసీపీ నేతలకు బహిరంగ సవాల్. 2019 ఎన్నికల కంటే ముందు జగన్... ఇంట్లో ఇద్దరు బిడ్డలకు ఇస్తామని చెప్పలేదా? ఆ ముక్క పట్టుకుని నేను ప్రచారం చేయలేదా? అది మీరు నిలబెట్టుకున్నారా? నిలువునా మోసం చేశారా? అది ప్రజలు మీకు ఇచ్చిన తీర్పే చెపుతోంది. ఆరోజు నాచేత ఊరూరా, ప్రతిచోటా ప్రచారం చేయించడం నిజం కాదా? నేను వైసీపీ కోసం బైబై బాబు క్యాంపెయిన్ చేయడం ఎంత నిజమో అమ్మ ఒడి కింద ఇదరు బిడ్డలకు రూ.15,000 చొప్పున, ప్రతి తల్లికి ఇస్తాం అని ప్రచారం చేయడం కూడా అంతే నిజం. ప్రతిబిడ్డకూ రూ.15,000 ఇచ్చే ఉద్దేశమే లేకపోతే నాతో ఎందుకు అలా ప్రచారం చేయించారు? మీరు కూడా ఎందుకు క్యాంపెయిన్ చేశారు. జలయజ్ఞం, సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తాం, హోదా అని ఎందుకు క్యాంపెయిన్ చేయించారు? బహిరంగ చర్చకు మీరు సిద్ధమా?' అని సవాల్ చేశారు.

'బావమరిది'ని తీసుకోలేం

- విభజన వేళ ఆయన తెలంగాణ కోరుకున్నారు
- ఆ తరువాత తన ఉద్యోగానికే రాజీనామా చేశారు
- ప్రభుత్వ జీవోపై స్పష్టం చేస్తున్న ఏపీజెన్కో

అమరావతి, జూలై 13(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మాజీ కార్యదర్శి ధనుంజయరెడ్డి బావమరిది మురళీకృష్ణారెడ్డిని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ఏపీ జెన్కోలోకి మళ్లీ తీసుకోవాలన్న ప్రభుత్వ ఉత్తర్వుపై ఆ సంస్థలో భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోంది. మురళీకృష్ణారెడ్డిని ఆయన హోదాను మించిన పదవిలో.. ఈఈ, ఎస్ఈ స్థాయిని దాటి చీఫ్ ఇంజనీరు హోదాకు సమానమైన పదవిలో.. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసరుగా ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్‌లో వైసీపీ ప్రభుత్వం కూర్చోబెట్టింది. ఆ హోదాలో ఆయన కార్యకలాపాలపై వచ్చిన పలు ఆరోపణలపై విచారణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ తరుణంలో శుక్రవారం సోలార్ కార్పొరేషన్ సీఓఓ పదవి నుంచి ప్రభుత్వం ఆయనకు ఉద్వాసన పలుకుతూ ఉత్తర్వులు ఇచ్చింది. అదే ఉత్తర్వులో ఆయనను తిరిగి జెన్కోలో డీఈఈగా తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ ఆదేశాలపై ఏపీ జెన్కోలో భిన్నాభిప్రాయం వ్యక్తమవుతోంది. 'రాష్ట్ర విభజన తర్వాత మురళీకృష్ణారెడ్డి తెలంగాణ జెన్కోను ఎంపిక చేసుకున్నారు. దానికి తోడు సోలార్ కార్పొరేషన్‌లో చేరే సమయంలో జెన్కో ఉద్యోగానికి రాజీనామా చేశారు. అంటే ఏ విధంగా చూసినా మురళీకృష్ణారెడ్డికి ఏపీ జెన్కోతో సంబంధం లేదు. అలాంటి వ్యక్తిని ఏపీ జెన్కోలో డీఈఈగా సీనియారిటీని కొనసాగిస్తూ తీసుకోవడం సాధ్యం కాదు' అని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. పై సహేతుక కారణాలను కాదని తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం అంటే కొత్త చిక్కులు కొనితెచ్చుకోవడమే అని స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ విద్యుత్ సంస్థలకు కేటాయించిన ఉద్యోగులు ఏపీకి రావడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర విద్యుత్ సంస్థలు సుప్రీంకోర్టులో వాదనలు వినిపించిన విషయాన్ని కూడా జెన్కో వర్గాలు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాయి. మురళీకృష్ణారెడ్డికి, జెన్కోకు సంబంధం లేదని తేల్చేయడమే ఉత్తమమని స్పష్టం చేస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ప్రభాస్ ఫౌజీ?



ప్రస్తుతం 'కల్కి 2898 ఏడీ' చిత్రం ఘన విజయాన్ని ఆస్వాదిస్తున్నాడు ప్రభాస్. ప్రపంచ వ్యాప్తంగా ఈ సినిమాకు దక్కుతున్న ఆదరణ అభిమానులను సంతోషంలో ముంచెత్తుతోంది. ఇక త్వరలోనే ప్రభాస్ 'సలార్ 2' చిత్రం కోసం రంగంలోకి దిగబోతున్నారు. దీని తర్వాత ఆయన దర్శకుడు సందీప్‌రెడ్డి వంగాతో 'స్పిరిట్' చిత్రం చేయాల్సి ఉంది. వీటితో పాటు మైత్రీ మూవీ మేకర్స్ ప్రభాస్‌తో ఓ భారీ బడ్జెట్ చిత్రాన్ని ప్రకటించింది. పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు మేకర్స్ 'ఫౌజీ' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు పరిశ్రమలో వినిపిస్తోంది. ప్రభాస్ ఈ చిత్రంలో సైనికుడి పాత్రలో కనిపించనున్నారు కాబట్టి 'ఫౌజీ' టైటిల్ అయితే బావుంటుందని నిర్ణయానికి వచ్చారట. 1940వ దశకం నేపథ్యంలో సాగే ఈ కథలో ప్రభాస్ బ్రిటీష్ సైన్యంలో సిపాయిగా కనిపించనున్నారు. యాక్షన్ అంశాలతో పాటు మంచి ప్రేమకథను మేళవించి ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ప్రభాస్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నట్లు వార్తలు వచ్చాయి, కానీ అధికారికంగా ఖరారు కావాల్సి ఉంది.

మార్ ముంత... ఛోడ్ చింత





'మార్ ముంత... ఛోడ్ చింత' అంటున్నారు హీరో రామ్ పోతినేని. ఆయన హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' చిత్రానికి ఇది కొనసాగింపు. ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే చిత్రబృందం మ్యూజిక్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. రెండో గీతాన్ని ఈ నెల 16న విడుదల చేయబోతున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో రామ్ రెండు బాటిళ్ల కల్లును ఆస్వాదిస్తూ కనిపించారు. 'మార్ ముంత ఛోడ్ చింత' అనేది ఈ సిరీస్‌లో హీరో పాపులర్ డైలాగ్. ఈ పాట కూడా ఈ డైలాగ్‌తోనే ప్రారంభమవుతుంది. ఈ చిత్రంలో సంజయ్‌దత్ కీలకపాత్ర పోషిస్తున్నారు. రామ్ సరసన కావ్య థాపర్ హీరోయిన్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రానికి మణిశర్మ సంగీతం అందిస్తున్నారు.

అమ్మోరు తల్లి మళ్లీ వస్తోంది



నయనతార అమ్మవారి పాత్రలో నటించిన 'మూకుత్తి అమ్మన్' చిత్రం 2020లో విడుదలై మంచి విజయాన్ని అందుకొంది. తెలుగులో 'అమ్మోరు తల్లి' పేరుతో విడుదలైంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతోంది. కానీ ఈసారి నయనతారకు బదులు త్రిష అమ్మవారి పాత్ర పోషిస్తున్నారంటూ కొన్నాళ్లుగా కోలీవుడ్ మీడియాలో ప్రచారమౌతోంది. అయితే ఇందులో నిజం లేదని తేలిపోయింది. అమ్మవారి పాత్రలో నయనతార నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. నిర్మాణ సంస్థ వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేసింది. అందులో అమ్మవారిగా నయనతార లుక్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు ఆర్జే బాలాజీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్, మాలీవుడ్... తారలంతా ఒకే వేదికపై కనిపించడం చాలా అరుదు. అలా జరిగితే అభిమానులకు నిజంగా అది పండగే. అటువంటి అరుదైన కలయిక అపర కుబేరుడు, ముఖేశ్ అంబానీ చిన్న కొడుకు అనంత్ అంబానీ, వ్యాపారవేత్త విజయ్ మర్చంట్ కూతురు రాధికా మర్చంట్ వివాహ వేడుకలో ఆవిష్కృతమైంది. కనివినీ ఎరుగని రీతిలో.. అంగరంగ వైభవంగా సాగిన ఈ పెళ్లి వేడుకకు హాజరవడానికి తారలు బారులు దీరారు. ఆకాశంలో నక్షత్రాలన్నీ ఒకేచోట చేరినట్లు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు తారలంతా హాజరై కనువిందు చేశారు.

తారలు దిగివచ్చిన వేళ...




టాలీవుడ్ తారల సందడి

ఈ వేడుకకు టాలీవుడ్ నటీనటులు తరలి వచ్చారు. మహేశ్‌బాబు కుటుంబ సమేతంగా నమ్రత, సితారలతో.. రామ్‌చరణ్ తన సతీమణి ఉపాసనతో.. వెంకటేశ్, తన భార్య నీరజతో.. రానా దగ్గుబాటి దంపతులు పెళ్లికి వచ్చి వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు అందజేశారు.










బాలీవుడ్ అతిరథులంతా విచ్చేయగా...

బాలీవుడ్ తారాగణం అంతా కలసి ఈ పెళ్లి వేడుకలో సందడి చేయడం విశేషం. అమితాబ్ బచ్చన్ తన సతీమణి జయ బచ్చన్, ఖాన్ త్రయం(షారుఖ్, సల్మాన్, ఆమిర్), రణబీర్, తన సతీమణి ఆలియా, ప్రియాంక చోప్రా తన భర్త నిక్ జోనాస్, రణ్‌వీర్.. విక్కీ కౌశల్ దంపతులు, జాన్వీకపూర్, ఖుషీకపూర్, అర్జున్ కపూర్, మాధురి దీక్షిత్, కృతీ సనన్, అనన్య పాండే, సారా అలీఖాన్ తళుక్కున మెరిశారు. ఈ వేడుకలో ఐశ్వర్య తన కూతురు ఆరాధ్యతో వచ్చారు. ఆమెతో తన భర్త అభిషేక్ కనిపించకపోవడంతో.. ఈ మధ్య వారి వైవాహిక జీవితానికి సంబంధించి జరుగుతున్న చర్చను మరింతగా పెంచేలా చేసింది.











కనువిందు చేసిన కోలీవుడ్ స్టార్స్

తమిళ నటీనటులు కూడా పెద్ద సంఖ్యలో ఈ వివాహానికి హాజరయ్యారు. ఈ సెలబ్రిటీల లిస్టులో నయనతార, ఆమె భర్త విఘ్నేశ్ శివన్, సూర్య, జ్యోతిక, అట్లీ దంపతులు ప్రముఖంగా ఉన్నారు.





మాలీవుడ్ నుంచి 'దేవ'

'సలార్' సినిమాలో 'దేవ'గా అందరికీ సుపరిచితమన మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్, తన భార్య సుప్రియా మీనన్‌తో ఈ వేడుకలో తళుక్కున మెరిశారు. మాలీవుడ్ నుంచి ఈ పెళ్లి వేడుకకు హాజరైన వారిలో ఈ దంపతులు మాత్రమే ఉండటం గమనార్హం.



స్టెప్పులేసిన సూపర్ స్టార్



సూపర్‌స్టార్ రజనీకాంత్ తెరపైనా, తెరవెనుకా ఏది చేసినా సంచలనమే. ఆయన తెరపై కనిపిస్తే చాలు రజనీని డెమీ గాడ్‌లా భావించి పులకించిపోయే అభిమానులు సూపర్‌స్టార్ సొంతం. సినిమాల్లో ఎంత స్టైలిష్‌గా, హుషారుగా ఉంటారో.. రియల్‌లైఫ్‌లో అంత సింపుల్‌గా, హుందాగా ఉంటారాయన. అలాంటి రజనీ ఈ పెళ్లి వేడుకలో స్టెప్పులేయడం హైలైట్‌గా నిలిచింది. 'దిల్ దడకనే దో' చిత్రంలోని 'గలన్ గూడియాన్' పాటకు రజనీ స్టెప్పులేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది.

అంతర్జాతీయ అతిథులూ...

ఈ వేడుకకు దేశం నుంచి నలువైపుల నుంచి అతిథులు విచ్చేశారు.. అందులో సినీ తారలే కాకుండా, క్రీడా ప్రముఖులూ, రాజకీయనాయకులూ, వ్యాపార దిగ్గజాలూ ఉన్నారు. అయితే ఈ వేడుకలో అంతర్జాతీయ అతిథులు కూడా భాగం కావడం స్పెషల్ అట్రాక్షన్‌గా మారింది. బాక్సింగ్ సంచలనం, నటుడు మైక్ టైసన్, రెజ్లింగ్ స్టార్, నటుడు జాన్ సీనా, పాప్ గాయని రిహానా, కిమ్ కర్దశియాన్ ఈ లిస్ట్‌లో ఉన్నారు.

షూటింగ్‌లో మహేశ్వరిని చూసి అంతా కంగారు పడ్డారు




వరకట్న దురాచారాన్ని నిరసిస్తూ తెలుగులో చాలా చిత్రాలు వచ్చాయి. వాటిల్లో సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య రూపొందించిన 'అమ్మాయి కాపురం' చిత్రం ఒకటి. మహేశ్వరి లీడ్ రోల్ పోషించిన ఈ చిత్రంలో అలీ, ఆనంద్, కోట శ్రీనివాసరావు ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. చిత్ర కథ మొత్తం హీరోయిన్ చుట్టూ తిరుగుతుంది కనుక పేరున్న కథానాయిక కాకుండా కొత్త నటిని తీసుకుందామని దర్శకుడు ముత్యాల సుబ్బయ్య, నిర్మాత నాగేశ్వరరావు నిర్ణయించుకున్నారు. ఆ సమయంలోనే హీరోయిన్ శ్రీదేవి చెల్లెలు మహేశ్వరిని తమిళ దర్శకుడు భారతీరాజా పరిచయం చేస్తున్నారని తెలిసి, ఆమె ఫొటోలు తెప్పించుకుని చూసి ఫైనలైజ్ చేశారు. భారతీరాజా మీద నమ్మకంతో మహేశ్వరిని చూడకుండానే ఆమెని ఎంపిక చేశారు. ఒంగోలులో 'అమ్మాయి కాపురం' షూటింగ్‌కు తొలి రోజు వచ్చిన మహేశ్వరిని చూసి అంతా నిర్ఘాంత పోయారు.

భారతీరాజా షూటింగ్ కోసం ఎక్కడో పొల్లాచ్చిలో మంచి ఎండల్లో షూటింగ్ చేసి వచ్చిందేమో ఆమె మొహం నల్లగా మాడిపోయింది. మనిషి చాలా సన్నగా, ఏ మాత్రం గ్లామర్ లేకుండా ఉంది. ఆమెను చూడగానే దర్శకుడు ముత్యాల సుబ్బయ్యకు నోట మాట రాలేదు. 'ఈ అమ్మాయి హీరోయినా.. ఇంత చండాలంగా ఉందేమిటి' అని షూటింగ్ చూడడానికి వచ్చిన జనం చేసిన కామెంట్స్ ఆయన చెవిన పడ్డాయి.. అప్పటికే సినిమాలోని ఆర్టిస్టులంతా ఒంగోలు చేరుకున్నారు. షూటింగ్ ఆపడం కష్టం. మంచి కథతో వస్తున్న సినిమాను ఇలాంటి అమ్మాయి హీరోయిన్‌గా ఎలా తీయడం? అని ఆయన చాలా మదనపడ్డారు. అయినా రాజీ పడి, మహేశ్వరి ఏ యాంగిల్‌లో బాగుంటుందో చూసుకుని అలాగే కొన్ని రోజులు షూటింగ్ చేశారు సుబ్బయ్య. స్వర్గీయ దర్శకుడు టి.కృష్ణ పెద్ద కుమారుడు ప్రేమ్‌చంద్ 'అమ్మాయి కాపురం' చిత్రం ప్రొడక్షన్ వ్యవహారాలు చూసేవారు. అతను అనుకోకుండా ఓ రోజు హఠాత్తుగా రోడ్డు ప్రమాదంలో మరణించడంతో 'అమ్మాయి కాపురం' షూటింగ్ వాయిదా పడింది. యూనిట్ సభ్యులంతా షాక్‌లో ఉండడం వల్ల ఓ రెండు నెలల పాటు ఈ సినిమా విషయమే ఆలోచించలేదు. షూటింగ్ ఇలా రెండు నెలలు గ్యాప్ ఇవ్వడం వల్ల ఒక రకంగా మేలే జరిగింది. మహేశ్వరి పరవాలేదనిపించే విధంగా తయారైంది. దాంతో మళ్లీ షూటింగ్ మొదలు పెట్టి ఆమె ఏ యాంగిల్‌లో అందంగా కనిపిస్తుందో అలాగే షూట్ చేసి, సినిమాను పూర్తి చేశారు. 'అమ్మాయి కాపురం' మంచి హిట్. బాగానే ఆడినా ఫంక్షన్ మాత్రం చేయలేదు. కాకపోతే నిర్మాత నాగేశ్వరరావు ముఖ్యమైన టెక్నీషియన్లకు బ్రాస్‌లెట్స్ చేయించాడు. ఈ సినిమాకు నంది అవార్డ్ వచ్చింది. ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు కూడా అందుకున్నారు దర్శకుడు ముత్యాల సుబ్బయ్య.

ఐశ్వర్యారాయ్‌కు సారీ చెబుతా

- ఇమ్రాన్ హష్మీ



గతంలో ఐశ్వర్యారాయ్ బచ్చన్‌ను ప్లాస్టిక్‌తో పోల్చుతూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల పట్ల బాలీవుడ్‌నటుడు ఇమ్రాన్‌హష్మీ విచారం వ్యక్తం చేశారు. ఈ సారి ఆమెను కలసినప్పుడు క్షమాపణలు చెబుతానని చెప్పారు. 2014లో 'కాఫీ విత్ కరణ్' షోకి హాజరయ్యాడు ఇమ్రాన్. ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో యాంకర్ ఏదైనా ఒక వస్తువు పేరు చెబితే బదులుగా ఇమ్రాన్ ఒక సెలబ్రిటీ పేరు చెప్పాలి అనేది టాస్క్. యాంకర్ 'ప్లాస్టిక్' అనే పదం చెప్పగానే ఇమ్రాన్ హష్మి 'ఐశ్వర్యారాయ్' అని బదులు చెప్పాడు. అది కాస్తా వివాదంగా మారింది. అప్పటి నుంచి ఐశ్వర్యారాయ్ అభిమానులు ఇమ్రాన్‌ను వెంటాడుతున్నారు. విశ్వసుందరిని ప్లాస్టిక్‌తో పోల్చడం ఏంటంటూ ఇమ్రాన్‌పై ఫైర్ అయ్యారు. ఆ తర్వాత కూడా ఆ వివాదాన్ని తిరగదోడుతూ ఏదో ఒక సందర్భంలో ఇమ్రాన్ హష్మీని లక్ష్యంగా చేసుకొని విమర్శలకు దిగారు. అయితే ఇమ్రాన్ కూడా వెనక్కి తగ్గలేదు. తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకునేది లేదని తెగేసి చెప్పాడు. ఎప్పటికీ ఐశ్వర్యకు క్షమాపణలు చెప్పబోనని పలు సందర్భాల్లో చెప్పాడు. అయితే ఇటీవలే మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఇమ్రాన్ తన వ్యాఖ్యల పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆ రోజు అలా మాట్లాడి ఉండాల్సింది కాదని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఐశ్వర్యకు తాను చాలా పెద్ద అభిమానిని అన్నారు. ఆమెను చాలా గౌరవిస్తానని చెప్పాడు. సరదాగా చేసిన వ్యాఖ్య వల్ల ఇన్నేళ్లుగా నేను విమర్శలు ఎదుర్కోవాల్సి వచ్చిందని వాపోయాడు. ఈ సారి ఐశ్వర్యారాయ్‌ను కలసినప్పుడు క్షమించమని అడుగుతాను అని చెప్పాడు.

ఇది ఆరంభం మాత్రమే


మూవీ ఆర్టిస్టు అసోసియేషన్



సినీ తారలు.. వారి జీవితాలే లక్ష్యంగా విమర్శలు.. కామెంట్లు చేస్తూ వీడియోలు చేసే యూట్యూబర్లకు 'మా' అధ్యక్షుడు మంచు విష్ణు రెండు రోజుల క్రితం ఓ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. ఆ హెచ్చరికలో.. 48 గంటల్లోగా ఇలాంటి వీడియోలను సంబంధిత యూట్యూబ్ చానెళ్ల నుంచి తొలగించాలని..లేదంటే సైబర్ సెక్యూరిటీకి ఫిర్యాదు చేసి.. చర్యలు తీసుకుంటామని.. చానళ్లను నిషేధిస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఈ గడువు దాటిన మేరకు 'మా' శనివారం పలు యూట్యూబ్ చానళ్లపై చర్యలు తీసుకుని.. ఐదు యూట్యూబ్ చానళ్లపై నిషేధం విధించింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని.. భవిష్యత్తులో ఇలా సెలబ్రిటీల జీవితాలను టార్గెట్ చేసుకుని వీడియోలు చేసే వారిపై మరిన్ని కఠిన చర్యలు ఉంటాయని 'మా' ఎక్స్‌లో పేర్కొంది. ఈ రద్దు చేసిన యూట్యూబ్ చానళ్ల లిస్ట్‌లో జస్ట్ వాచ్ బీబీసీ, ట్రోల్స్ రాజా, బచినా లలిత్, హైదరాబాద్ కుర్రాడు, ఎక్స్‌వైజెడ్ ఎడిట్జ్ 007 ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 14 జూలై 2024

డీఎస్సీ(ఎస్‌జీటీ) మోడల్ ప్రశ్నలు



సోషల్ కంటెంట్

1. భూమి ఉపరితలం నుంచి ఎన్ని మీటర్లు ఎత్తుకు వెళ్లే కొద్దీ 1 డిగ్రీ ఉష్ణోగ్రత పెరుగుతుంది?
   1. 190మీ. 2. 150మీ. 3. 165మీ. 4. 185మీ.
2. సున్నా డిగ్రీ రేఖాంశం కింద పేర్కొన్న ఏ ఖండం మీదుగా గీయలేదు?
   1. ఆసియా 2. యూరప్ 3. ఆఫ్రికా 4. అంటార్కిటికా
3. భారత రాజ్యాంగ పీఠిక ప్రకారం అత్యున్నత అధికారం వీరికి ఉంటుంది.
   1. భారత రాష్ట్రపతి 2. ప్రధానమంత్రి
   3. రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, స్థానిక రాష్ట్ర పాలకులకు
   4. మొత్తం భారతదేశ ప్రజలకు
4. కింద పేర్కొన్న మృత్తికల్లో తనను తాను దున్నుకునే నేలలు అని వేటిని పిలుస్తారు?
   1. ఎర్ర మృత్తికలు 2. నల్ల మృత్తికలు
   3. ఒండ్రు మృత్తికలు
   4. లేటరైట్ మృత్తికలు
5. సున్నపురాయిని కింది ఏ పరిశ్రమల్లో ముడి పదార్థంగా ఉపయోగిస్తారు.
   1. సిమెంట్ పరిశ్రమల్లో
   2. ఇనుము, ఉక్కు పరిశ్రమ
   3. ఎరువుల పరిశ్రమ 4. పైవన్నీ
6. పేపర్ తయారీ దశలో ముఖ్యమైన దశను గుర్తించండి.
   1. ముక్కలు చేయడం
   2. కలపగుజ్జు తయారీ
   3. గుజ్జును పరచడం 4. కత్తిరించడం
7. కింది ఏ నగరంలో సూర్యకిరణాల తీవ్రత ఎక్కువ?
   1. బెంగళూరు 2. హైదరాబాద్
   3. ఢిల్లీ 4. భోపాల్
8. కళాక్షేత్ర అనే సంస్థను స్థాపించి, భరత నాట్య పునరుద్ధరణకు కృషిచేసింది ఎవరు?
   1. రుక్మిణిదేవి 2. బాల సరస్వతి
   3. ఇ.కృష్ణ అయ్యర్
   4. బెంగళూరు నాగరత్నమ్మ
9. భారతదేశంలో మొట్టమొదటి మహిళా రైల్ ఇంజన్ డ్రైవర్ ఎవరు?
   1. సురేఖ యాదవ్ 2. సరళ తక్రాల్
   3. అర్చన పట్నాయక్
   4. పద్మావతి బందోపాధ్యాయ
10. ఉత్తరమేరూర్ శాసనం ఏ వంశానికి చెందింది?
    1. చోళులు 2. రాష్ట్రకూటులు
    3. కాకతీయులు 4. శాతవాహనులు
11. హిరణగర్భ అనే సంస్కారనిధిని నిర్వహించింది ఎవరు?
    1. దంతి దుర్గుడు 2. విజయాలయుడు
    3. నాగభట్టు 4. ధంగదేవుడు
12. దాశరథి శతకాన్ని రాసింది.
    1. దాశరథి కృష్ణమాచార్యులు
    2. దాశరథి రంగాచార్యులు
    3. తాళ్లపాక అన్నమాచార్యులు
    4. కంచర్ల గోపన్న
13. 1948 సెప్టెంబరులో హైదరాబాద్ రాష్ట్రాన్ని భారతదేశంలో విలీనం చేయడానికి సాయుధ బలగాలను పంపిన కేంద్ర హోంశాఖ మంత్రి కింది వారిలో ఎవరు?
    1. బూర్గుల రామకృష్ణారావు
    2. సర్దార్ వల్లభాయ్ పటేల్
    3. శ్యాంప్రసాద్ ముఖర్జీ
    4. సి.రాజగోపాలాచారి
14. కోరిన సమాచారాన్ని పొందడానికి దరఖాస్తు అందించిన తేదీ నుంచి గల గడువు
    1. 25 రోజులు 2. 30 రోజులు
    3. 35 రోజులు 4. 40 రోజులు
15. భారతదేశంలో ద్రవ్య ముద్రణ, పంపిణీకి ఎవరు బాధ్యత వహిస్తారు?
    1. ఆర్థిక మంత్రిత్వశాఖ
    2. రాష్ట్రపతి
    3. రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా
    4. పార్లమెంటు
16. విషయ నిర్దేశిత పటాల్లో తెలుపురంగు దేనిని సూచిస్తుంది.
    1. అడవి 2. బంజరు భూములు
    3. ఖనిజాలు దొరికే ప్రాంతం
    4. సముద్రాలు
17. ఏటీఎంను విస్తరించండి?
    1. ఎనీ టైమ్ మనీ 2. ఎనీ టైమ్ మెడిసిన్
    3. ఆటోమేటిక్ టెల్లర్ మెషిన్
    4. ఆటోమేటిక్ టెల్లర్ మొబైల్
18. జబ్త్ అంటే?
    1. సైనిక విధానం
    2. విదేశాంగ విధానం
    3. రెవిన్యూ విధానం 4. పైవేవీకావు

సమాధానాలు

1) 3 2) 1 3) 4 4) 2 5) 1 6) 3 7) 2 8) 1 9) 1 10) 1 11) 1 12) 2 13) 2 14) 2 15) 3 16) 3 17) 3 18) 3

Methods

1. In which of the steps of evaluation, testing is done orally
   1. Home assignment 2. Recapitulation
   3. Comprehension of Text
   4. All the above
2. Planning, executing, feedback, re-planning, re-execution and re-feed-back are the steps followed in ....
   1. Seminars 2. Lesson Planning
   3. Micro Teaching
   4. Remedial Teaching
3. Identify the number of syllables in the word "Continuously"
   1. Six 2. Five 3. Four 4. Three
4. TOEFL, JELTS are examples for .....
   1. Standardised tests 2. Diagnostic tests
   3. Proficiency tests 4. Placement tests
5. Which type of reading strategy is looking up a word in the dictionary, finding the names of characters in a story, looking at a railway time table?
   1. Skimming 2. Scanning
   3. Intensive Reading
   4. Extensive Reading
6. One of the following method uses mother tongue as stimulus for evoking the foreign language as response. Identify it.
   1. Grammar Translation 2. Direct
   3. lingual 4. Total Physical Response
7. సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్రను రాసింది.
   1. నార్ల వెంకటేశ్వరరావు
   2. పండరీపుర సూర్య ప్రకాశ దీక్షితులు
   3. భాగవతుల సదాశివ శంకరశాస్త్రి
   4. దివాకర్ల వెంకటావధాని
8. విస్తార పఠనం ప్రయోజనాల్లో చేరనిది.
   1. విద్యార్థుల్లో మౌన పఠన సామర్థ్యం పెంపొందుతుంది
   2. విరామ కాలాన్ని సద్వినియోగ పరుస్తుంది
   3. విషయంపై సంపూర్ణమైన అవగాహన కలుగుతుంది
   4. విశేషమైన జ్ఞానార్జనకు తోడ్పడుతుంది
9. బోధనలో భాగంగా విద్యార్థుల అభ్యసన ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన చర్యలు చేపట్టి, అభ్యసన ప్రగతిని సాధించడానికి దోహదపడేది.
   1. రూపణ మూల్యాంకనం
   2. సంకలన మూల్యాంకనం
   3. లక్ష్యాధార మూల్యాంకనం
   4. సామర్థ్యాధార మూల్యాంకనం
10. కింది వాటిలో దంత్యోష్ఠ్యం.
    1. హ 2. ష 3. శ 4. స
11. మూలభాషలోని విషయాన్ని లక్ష్యభాషలోకి మార్చడాన్ని ఏమంటారు.
    1. వాగ్రూప వ్యక్తీకరణ 2. లిఖితరూప వ్యక్తీకరణ
    3. భాషాంతరీకరణ సామర్థ్యం 4. ఏదీకాదు
12. ఉపాధ్యాయుడు పాఠ్యభాగ విశదీకరణలో కొన్ని లక్ష్యాలను ఏర్పర్చుకుంటాడు. ఆ లక్ష్యాల సాధనకు ఉపయోగపడేవే బోధనోపకరణాలు అని నిర్వచించింది.
    1. హుమయూన్ కబీర్ 2. వెబ్‌స్టర్
    3. కొంపెల్లి ఆంజనేయులు 4. కోబాల్
13. కింది వాటిలో సాంఘికశాస్త్ర బోధనోద్దేశం కానిది?
    1. విద్యార్థుల్లో దేశభక్తి భావాన్ని పెంపొందించడం
    2. సమాజంలో దగ్గర సంబంధాన్ని పెంపొందించుట
    3. మానవ నాగరికతాభివృద్ధిని తెలియచేయడం
    4. విద్యార్థులకు స్వయం ఉపాధిని అంద చేయడం
14. మీ నియోజకవర్గంలో పోలింగ్ శాతాన్ని మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించుము అనే ప్రశ్న ఏ లక్ష్యాన్ని పరీక్షించడానికి గాను ఉద్దేశించింది?
    1. అవగాహన - వివరణ ఇచ్చుట
    2. వినియోగం - సంశ్లేషణ
    3. వినియోగం - కారణాలు చెప్పడం
    4. నైపుణ్యం - అనువాదం చేయుట
15. జన్మభూమి కార్యక్రమంలో గ్రామసభ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఉపాధ్యాయుడు మాదిరి గ్రామసభను నిర్వహించాడు. అతడు అనుసరించిన బోధనా టెక్నిక్ కింది వాటిలో ఏది.
    1. నాటకీకరణ 2. పాత్రాభినయం
    3. చర్చ 4. సిమ్యూలేషన్

సమాధానాలు

1) 2 2) 3 3) 2 4) 3 5) 2 6) 3 7) 1 8) 3 9) 1 10) 3 11) 3 12) 3 13) 4 14) 4 15) 4

ప్రశ్న పత్రాన్ని హైదరాబాద్‌లోని బాసర ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన **శీలం దేవేందర్‌రెడ్డి** నేతృత్వంలో సీనియర్ ఫ్యాకల్టీ బృందం రూపొందించింది.

ఇగ్నోలో నూతన కోర్సులు



ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) కొత్తగా 13 కోర్సులను ప్రవేశపెట్టింది. వీటిలో నాలుగు ఎంబీఏ స్పెషలైజేషన్స్ ఉన్నాయి. ఈ కోర్సులన్నీ ఆంగ్ల మాధ్యమంలోనే అందుబాటులో ఉంటాయి. కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా మూడేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులు. రిజర్వ్‌డ్ క్యాటగిరీ అభ్యర్థులకు 45 శాతం మార్కులుంటే చాలు. ఎంబీఏ కోర్సు కనీస వ్యవధి రెండేళ్లు. నాలుగేళ్లలోపు పూర్తి చేయాలి. మొత్తం 4 సెమిస్టర్లు ఉంటాయి. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పూర్తి సమాచారాన్ని http://www.ignou.ac.in/ వెబ్‌సైట్ నుంచి పొందవచ్చు.

ప్రధాన కోర్సులు

- ఎంబీఏ ఇన్ కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ ఇన్ లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ ఇన్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ ఇన్ హెల్త్‌కేర్ అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్
- పీజీ డిప్లొమా ఇన్ రీహాబిలిటేషన్ సైకాలజీ
- పీజీ డిప్లొమా ఇన్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్
- ఎంఏ ఇన్ గీతా స్టడీస్
- సర్టిఫికెట్ ఇన్ ఎర్లీ చైల్డ్ హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎనేబ్లింగ్ ఇన్‌క్లూజన్ - హియరింగ్ ఇంపెయిర్‌మెంట్
- సర్టిఫికెట్ ఇన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ ఎనేబ్లింగ్ ఇన్‌క్లూజన్ - ఇంటలెక్చువల్ డిజెబిలిటీ
- ఎమ్మెస్సీ ఇన్ హోమ్ సైన్స్(కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అండ్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్)

'జంతు సంక్షేమం'లో పీజీ డిప్లొమా

ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో), పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ యానిమల్ వెల్ఫేర్(పీజీడీఏడబ్ల్యూ) కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఇటీవల ప్రారంభించిన ఈ కోర్సు 'లార్జెస్ట్ గ్లోబల్ యానిమల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్'గా గుర్తింపు పొందింది. కరికులమ్‌ని యూకేలోని యూనివర్సిటీ ఆఫ్ ఎడిన్‌బరో సహకారంతో రూపొందించారు. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా గుర్తించింది. అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://ignouadmission.samarth.edu.in/ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు: కోర్సు వ్యవధి ఏడాది. కోర్సులో ప్రధానంగా నాలుగు విభాగాలుంటాయి. అవి.. యానిమల్ వెల్ఫేర్ సైన్స్ అండ్ ఎథిక్స్, యానిమల్ వెల్ఫేర్ ఇష్యూస్, యానిమల్ వెల్ఫేర్ లాస్ అండ్ పాలిసిస్, యానిమల్ వెల్ఫేర్ ప్రాక్టీసెస్ అండ్ స్టాండర్డ్స్ మొదలైనవి. కరికులమ్‌లో 85 మాడ్యూల్స్ ఉంటాయి. ఇవి సైంటిఫిక్, ఎథికల్, లీగల్, ప్రాక్టికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ యానిమల్ వెల్ఫేర్ వంటి ప్రధాన అంశాలు ఈ మాడ్యుల్స్‌లో భాగంగా ఉన్నాయి. వీటితో పాటు జూ, ల్యాబ్, స్ట్రీట్ యానిమల్స్ వంటి వాటి నిర్వహణను కూడా ఇందులో చేర్చారు.



కోర్సులో ఎవరు చేరొచ్చు?

- జంతు ప్రేమికులు
- జంతు సంక్షేమ సంస్థలు/ఎన్‌జీవోలు/గోశాలల సిబ్బంది
- యూనివర్సిటీలు, వెటర్నరీ కాలేజీలకు చెందిన ఫ్యాకల్టీ, పరిశోధకులు, విద్యార్థులు
- ప్రభుత్వం, మిలిటరీ సర్వీసెస్‌కు చెందిన వెటరినేరియన్స్, నాన్-వెటరినేరియన్స్
- జంతు సంక్షేమ బోర్డులు/కమిటీల సభ్యులు
- లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొఫెషనల్స్
- సివిల్ సర్వెంట్స్, ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్స్ అండ్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషనిస్ట్‌లు.

కరికులమ్ హైలైట్స్

యానిమల్ వెల్ఫేర్ సైన్స్ అండ్ ఎథిక్స్: జంతు సంక్షేమంపై అవగాహన, జంతువుల వ్యవహార శైలి, జంతు సంక్షేమాన్ని ప్రమోట్ చేయడంలో వెటరినేరియన్స్ పాత్ర, ఎథికల్ ఫ్రేమ్ వర్క్స్ వంటి ప్రధానాంశాలను ఈ విభాగం ద్వారా నేర్చుకోవచ్చు.
యానిమల్ వెల్ఫేర్ ఇష్యూస్: ఫార్మ్ యానిమల్స్ సహా పలు రకాల జంతు జాతులు, పెంపుడు జంతువులు, జూ - క్రూర మృగాలు, ల్యాబొరేటరీ యానిమల్స్ సంక్షేమం అదేవిధంగా స్లాటర్ అండ్ డిజాస్టర్ వంటి అంశాలు ఇందులో చర్చిస్తారు.
యానిమల్ వెల్ఫేర్ లాస్, పాలిసీస్ అండ్ ఆర్గనైజేషన్స్: పెర్టినెంట్ లెజిస్లేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెకానిజమ్స్ వంటి అంశాలు ఇందులో ఉంటాయి. వీటితో పాటు వివిధ అంశాలపై డిస్కషన్స్, ఆర్గనైజేషనల్ ఫ్రేమ్ వర్క్స్ కూడా ఇందులో భాగంగా ఉంటాయి.
యానిమల్ వెల్ఫేర్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్ అండ్ లైవ్‌లీహుడ్: జంతు సంక్షేమ ప్రాధాన్యతలు, సస్టయినేబుల్ ప్రాక్టీసెస్ వంటి వాటిని ఇందులో చర్చిస్తారు.

జాబ్ కార్నర్

ఇండియన్ ఆర్మీలో హవల్దార్, నాయబ్ సుబేదార్ పోస్టులు

ఇండియన్ ఆర్మీ.. క్రీడా కోటా ఎంట్రీ కింద డైరెక్ట్ ఎంట్రీ(ఇంటేక్ 02/2024) ద్వారా హవల్దార్, నాయబ్ సుబేదార్(స్పోర్ట్స్) ఖాళీల భర్తీకి అర్హులైన అవివాహిత పురుష, మహిళా క్రీడాకారుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టు: హవల్దార్, నాయబ్ సుబేదార్(స్పోర్ట్స్)- ఇంటేక్ 01/2024
క్రీడా విభాగాలు: అథ్లెటిక్స్, ఆర్చరీ, బాస్కెట్‌బాల్, బాక్సింగ్, డైవింగ్, ఫుట్‌బాల్, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, హాకీ, హ్యాండ్‌బాల్, కబడ్డీ.
అర్హత: పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు అవసరం. అంతర్జాతీయ/జూనియర్ లేదా సీనియర్ నేషనల్ చాంపియన్‌షిప్/ఖేలో ఇండియా గేమ్స్/యూత్ గేమ్స్‌లో పాల్గొన్న అత్యుత్తమ క్రీడాకారులై ఉండాలి.
వయోపరిమితి: 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: స్పోర్ట్స్ ట్రయల్స్, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా



దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను డైరెక్టరేట్ ఆఫ్ పీటీ అండ్ స్పోర్ట్స్, జనరల్ స్టాఫ్ బ్రాంచ్, ఐహెచ్‌క్యూ(ఆర్మీ), రూమ్ నెం. 147, 'ఎ' వింగ్, సేనా భవన్, న్యూఢిల్లీ చిరునామాకు పంపాలి.
దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ: సెప్టెంబరు 30
వెబ్‌సైట్: https://joinindian-army.nic.in/

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఆఫీసర్లు

ఖాళీలు 195

పుణెలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర.. వివిధ విభాగాల్లో ఆఫీసర్(స్కేల్: 2, 3, 4, 5, 6) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

1. ఇంటిగ్రేటెడ్ రిస్క్ మేనేజ్‌మెంట్
2. ఫారెక్స్ అండ్ ట్రెజరీ
3. ఐటీ/డిజిటల్ బ్యాంకింగ్/సీఐఎస్‌ఓ/సీడీఓ
4. క్రెడిట్, ఎకనామిస్ట్ విభాగాలు

పోస్టుల వివరాలు: డిప్యూటీ జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్, చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్
అర్హత: సంబంధిత విభాగాల్లో డిగ్రీ/పీజీ, పీజీ డిప్లొమా, సీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు స్కేల్-2 పోస్టులకు రూ.64,820 - రూ.93,960, స్కేల్-3కి రూ.85,920 - రూ.1,05,280, స్కేల్-4కు రూ.1,02,300 - రూ.1,20,940, స్కేల్-5కు రూ.1,20,940-రూ.1,35,020, స్కేల్-6 పోస్టులకు రూ.1,40,500 - రూ.1,56,500.
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.118. ఇతరులకు రూ.1180.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను జనరల్ మేనేజర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, హెచ్.ఆర్.ఎం డిపార్ట్‌మెంట్, హెడ్ ఆఫీస్, లోక్‌మంగల్, శివాజీనగర్, పుణె చిరునామాకు పోస్టు ద్వారా పంపించాలి.
దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 26
వెబ్‌సైట్: bankofmaharashtra.in/

లిటిల్స్



ఎవరిల్లు వారికి గొప్ప

అడవిలో ఉండే ఒక కొలను దగ్గర ఒక తాబేలు మరియు చిన్న పిట్ట ఒక దానికొకటి పరిచయం అయ్యాయి. ఆ తాబేలు పదేపదే తన గొప్పలు బయటకు చెబుతూ అందరినీ చిన్నబుచ్చుతూ ఉండేది. పిట్ట మాత్రం అందరితో మర్యాదగా స్నేహంగా నడుచుకునేది. అలా అందరినీ మాటలతో ఇబ్బంది పెట్టవద్దని పిట్ట తాబేలుకు ఎన్నోసార్లు హితవు చెప్పడానికి ప్రయత్నించింది కానీ తాబేలు దాని మాటలు పెడచెవిన పెట్టేది. 'అందరినీ అంటున్నది కానీ నన్ను ఏమీ అనదు తాబేలు' అనుకున్నది పిట్ట. ఒక రోజు పిట్ట చెట్టు కొమ్మ మీద వాలి ఉండగా, కిందనుండి వెళు తున్న తాబేలు దాన్ని చూస, 'ఏమీ అలా కూర్చున్నావు? నీకు ఇల్లు లేదా? నువ్వు ఇల్లు కట్టుకోవాలంటే ఎంత కష్టంమైన పని కదా. ఎవరినైన సాయం కూడా అడగాలి, అదే నా ఇల్లు చూడు, అదెప్పుడూ నా వీపునే ఉంటుంది. నాకు ఏ ఇబ్బంది కలిగినా క్షణంలో అందులోకి దూరిపోతాను పాపం నీ పరిస్థితి' అన్నది. ఆ మాటలకు నొచ్చుకున్న పిట్ట 'నీ ఇంట్లో నువ్వు ఒక దానివే ఉండగలవు అదే నా ఇంట్లో అయితే నా కుటుంబం అంతా నాతోనే నివసంచవచ్చు. ఎవరి ఇల్లు వారికి గొప్ప కదా' అన్నది.




10 తేడాలు గుర్తించండి!






దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 358

					3	
		8				
	7			2		5
	3	1	2		8	
6			1		7	
			6		9	1
	4	2		6		

సుడోకు - 357 సమాధానం

1	4	9	2	7	8	5	3	6
8	7	5	6	3	1	2	4	9
6	2	3	9	5	4	8	1	7
9	6	2	4	8	7	1	5	3
7	1	8	5	2	3	6	9	4
3	5	4	1	6	9	7	8	2
4	8	6	3	1	2	9	7	5
5	9	1	7	4	6	3	2	8
2	3	7	8	9	5	4	6	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.